అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 19-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 290 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

గ్రూపు-1 పరీక్షలు యథాతథం

అప్పీల్ పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూపు-1 పరీక్షల నిర్వహణకు కేసుల అవరోధం తొలగిపోయింది. గ్రూప్-1 పరీక్షల నోటిఫికేషన్ జారీని, కీలో తప్పులున్నాయనీ, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను కూడా హైకోర్టు కొట్టేసింది. ఈ నెల 15న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ దామోదర్‌రెడ్డి మరికొందరు వేసిన అప్పీళ్లను తోసిపుచ్చుతూ శుక్రవారం తీర్పునిచ్చింది. అభ్యర్థుల అభ్యర్థనను తిరస్కరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ప్రిలిమినరీ పరీక్ష కీలో తప్పులున్నందున పరీక్షను రద్దు చేసి ...6లో



గ్రూప్-1 అభ్యర్థులపై విరిగిన లాఠీ

స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత

నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్‌నగర్ చౌరస్తాలో రెండ్రోజులుగా గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రూప్-1 మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు ధర్నా చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేస్తున్న గ్రూప్స్ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం అభ్యర్థు లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ జీవో 29 తమ పాలిట శాపంగా మారుతుందని ఆవేదన ...13లో

అమానుషం 13లో..

లాఠీచార్జీకి సీపీఐ(ఎం) ఖండన

29 జీవోను రద్దు చేసి మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలి : తమ్మినేని డిమాండ్

ఓయూ వీసీగా ఎం కుమార్

107 ఏండ్ల చరిత్రలో తొలిసారి దళిత ప్రొఫెసర్‌కు అవకాశం

కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి

వ్యవసాయ వర్సిటీ వీసీగా అల్దాస్ జానయ్య

9 వర్సిటీలకు 5లో..

ఉపకులపతుల నియామకం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం

ఎన్ఈపీని అమలు చేస్తామనడం దుర్మార్గం

ఆ నిర్ణయాన్ని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)ని అమలు చేస్తామని ఉన్నత విద్యామండలి నూతన చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి ప్రకటించడం దుర్మార్గమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఆ నిర్ణయాన్ని ఆయన ...13లో

హామీ లేని ఉపాధి

ఈ ఏడాది 16.2 శాతం తగ్గిన పనిదినాలు

గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో కొనుగోలు స్థాయిని పెంచడం, సామాజిక అంతరాలను తగ్గించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పేదలకు పనిదినాలు దక్కకుండా పోతున్నాయి. కాదు..కాదు..కేంద్రంలోని మోడీ సర్కారు ఆ చట్టానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ, అరకొర వేతనాలు పడేలా చూస్తూ పేదలే ఆ పనుల నుంచి దూరం జరిగేలా చూస్తున్నది. దాని ఫలితం ఉపాధి హామీ పనిదినాల క్షీణతలో స్పష్టంగా కనిపిస్తున్నది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జాతీయ స్థాయిలో ఉపాధి హామీల పనిదినాలు 16.2 శాతం తక్కువ నమోదయ్యాయి. ఈ చట్టం అమలుకు ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ అనుసంధానం, డ్రోన్ల పర్యవేక్షణ ప్రతిబంధకంగా మారాయని తెలుస్తున్నది. గతేడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా 7.4 శాతం పనిదినాల సంఖ్య తగ్గింది. తెలంగాణలో మాత్రం 27.1 శాతం పెరుగుదల కనిపించింది. ఉపాధి హామీ చట్టాన్ని అత్యంత ప్రభావితంగా అమలు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉంది. ఉపాధి హామీ చట్టం కింద పనిదినాల కల్పనపై లిబ్‌టెక్ సంస్థ నివేదిక పలు కీలకాంశాలను వెల్లడించింది.



- తగ్గిన కేంద్రం నిధులే కారణం
- ప్రతిబంధకంగా ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ అనుసంధానం, డ్రోన్ల పర్యవేక్షణ
- తెలంగాణలో మాత్రం 27 శాతం పెరిగిన పనిదినాలు
- లిబ్‌టెక్ నివేదికలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్టం ప్రకారం పని అడిగిన ప్రతి కుటుంబానికి ఏడాదిలో కనీసం వంద రోజుల పని కల్పించాలి. కానీ, ఎక్కడ కూడా వంద రోజుల పని కల్పించిన దాఖలాలు లేవు. దేశ సగటు చూస్తే ఒక కుటుంబానికి కేవలం 34.81 రోజుల పనిదినాలనే కేంద్ర ప్రభుత్వం కల్పించింది. అదే తెలంగాణకు వచ్చేసరికి ఆ సగటు కాస్త పెరిగింది. తెలంగాణలో ప్రతి కుటుంబానికి సగటున 40.9 రోజుల పని దక్కింది. తెలంగాణలో 6 అక్టోబర్ 2024 నాటికి 53.07 లక్షల జాబ్‌కార్డులున్నాయి. అందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 34.53 లక్షలుండగా కేవలం 25.33 లక్షల కుటుంబాలే ఉపాధి పనుల్లో పాలుపంచుకున్నాయి. సగం జాబ్‌కార్డు హోల్డర్లు పనులకు దూరంగా ఉన్నారనేది స్పష్టంగా అర్థమవుతున్నది. కామారెడ్డి, ములుగు, వరంగల్ జిల్లాలు ఉపాధి హామీ పనుల కల్పనలో ముందంజలో ఉన్నాయి. రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో తగ్గుదల ఉంది. సంగారెడ్డి జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 46 లక్షల వ్యక్తిగత పనిదినాలు కల్పించబడితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి అది కాస్తా 43 లక్షలకు పడిపోయింది. ఈ ఏడాది ఆ ఒక్క జిల్లాలోనే 3 లక్షల పనిదినాలు తగ్గాయి. ఆ జిల్లాలో ఆరుశాతం తగ్గినట్టయింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో ఉపాధి హామీ పనుల ప్రక్రియ మంచిగానే ప్రారంభమైంది. మే నెలలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కొర్రీలు పెట్టడం, పనుల కేటాయింపు ఇష్టానుసారంగా కేటాయించారనే సాకు చూపెట్టడం లాంటి వాటితో జూన్‌లో పనిదినాల నమోదు గణనీయంగా తగ్గింది. రాష్ట్రంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు చూస్తే జులైలో తక్కువ పనిదినాలు కల్పించబడ్డాయి. జులై నెలకు వచ్చేసరికి 41.5 శాతంతో అత్యంత తగ్గుదల కనిపించింది.

కూలీలు తగ్గడానికి కారణాలివే..

ఆధార్‌కార్డు, ఉపాధి జాబు కార్డు నెంబర్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం ప్రధాన సమస్యగా ముందుకు రావడం వల్ల పెద్ద ఎత్తున జాబుకార్డులు తొలగించబడ్డాయని వ్యవసాయ కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దేశంలో 7.5 కోట్ల జాబ్‌కార్డులను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. పనిప్రదేశంలో ఆన్‌లైన్ మస్టర్ తప్పనిసరి చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. పనిప్రదేశాల్లో నెట్ రాకపోవడంతో కూలీలు పనిచేసినా మస్టర్‌ను కిందిస్థాయి సిబ్బంది వేయలేకపోయారు. ఫలితంగా రికార్డుల్లో కూలీల సంఖ్య తగ్గిపోయింది. అటవీ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. తెలంగాణలో రోజువారీ వేతనాలు ...13లో

21 వరకు సర్కారుకు డెడ్‌లైన్ 6లో..

సీఎం పిలవాలి..మా సమస్యలు పరిష్కరించాలి


ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు : ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ సంస్థకు నో 14లో..

పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

బ్యూటిఫికేషన్ కాదు..లూటిఫికేషన్

రూ.25 వేల కోట్లతో పూర్తిగా ప్రక్షాళన చేయొచ్చు



- అయినా లక్షన్నర కోట్ల ఖర్చెందుకు?
- ఢిల్లీకి సంచులు మోయటానికా? అధిష్టానానికి కమీషన్లు ఇవ్వటానికా? : సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటి ప్రశ్న
- మూసీ సుందరీకరణపై మాజీమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయేది బ్యూటిఫికేషన్ (సుందరీకరణ) కాదనీ, అది లూటిఫికేషన్ (ప్రజల సొమ్మును దోచుకోవటం) అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ఎద్దేవా చేశారు. రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి, ఎక్కడా ఏ ఒక్క ఇంటినీ తొలగించకుండా ఆ నదిని ప్రక్షాళన చేయొచ్చని ఆయన తెలిపారు. ఈ వాస్తవాన్ని పక్కనబెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు రూ.లక్షన్నర కోట్లతో మూసీని పునరుజ్జీవింపజేస్తామని చెప్పటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఢిల్లీకి డబ్బు సంచులు మోయటానికా? లేక కాంగ్రెస్ అధిష్టానానికి కమీషన్లు ఇవ్వటానికా? అని ఆయన నిలదీశారు. మూసీని ప్రక్షాళన చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తాము వ్యతిరేకించటం లేదనీ, కానీ ఆ పేరిట ప్రజాధనాన్ని లూటీ చేస్తాం, పేదల ఇండ్లను కూల్చేసి, వారిని రోడ్డున పడేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మూసీ సుందరీకరణ, ప్రక్షాళన తదితరాంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్... పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మూసీ పుట్టు ...13లో

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి 13లో..

చిత్తశుద్ధి ఉంటే మూసీలో వ్యర్థాలు కలవకుండా ఆపాలి : మాజీ మంత్రి హరీశ్

మూసీపై ప్రభుత్వ ప్రతిపాదనను అఖిలపక్షం ముందుంచాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ సుందరీకరణపై ప్రభుత్వ ప్రతిపాదనను అఖిలపక్షం ముందుంచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. మూసీ నది ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన సమంజసంగా లేదని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే మూసీ నదిపై ఒక నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు. దాని అమలుకు సంబంధించిన సూచనలు మాత్రమే అడుగుతున్నదని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం, దాని ప్రక్షాళన విషయంలో ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఆ పేరుమీద ప్రభుత్వం ఏమిచేయ తలపెట్టిందన్నదే అసలు విషయమని పేర్కొన్నారు. ఇతర పార్టీల కార్యాచరణ ప్రణాళికలు అడగడం హాస్యాస్పదమని తెలిపారు. ప్రభుత్వం చేయతలపెట్టిన ప్రాజెక్టు, దాని లక్ష్యాలు, ప్రణాళిక తదితర అంశాలతో కూడిన నిర్దిష్ట ప్రతిపాదనను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని వివరించారు. అఖిలపక్ష సమావేశం ముందు ఆ ప్రతిపాదనను పెట్టి సలహాలు తీసుకోవడం సమంజసంగా ఉంటుందని సూచించారు. మరోవైపు ప్రతిపక్షాలు తమ సందేహాలను రాతపూర్వకంగా ఇస్తే, ప్రభుత్వ సమాధానం..13లో

రేపటితరం కోసమే మూసీ ప్రక్షాళన

ప్రజాభవన్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సీతక్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఒక తరం మూసీనది పరీవాహక ప్రాంతంలో అనేక ఇబ్బందుల్లో నివసించారనీ, రేపటితరమైనా మంచి వాతావరణంలో బ్రతికేలా చేయడం కోసమే ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన చేపట్టిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారంనాడిక్కడి ప్రజాభవన్‌లో మూసీ పరీవాహక ప్రాంత స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసీ నుంచి పునరావాసం పొందిన 17 స్వయం సహాయక మహిళా సంఘాల్లోని 172 మంది మహిళలకు రూ. మూడు కోట్ల 44 లక్షలు విలువ చేసే చెక్కులను మంత్రి వారికి అందచేశారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు మహ్మద్ బలాలా, కౌసర్ మొయినుద్దీన్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి మరొక చోటుకు వెళ్ళినప్పుడు కొంత కష్టంగా ఉంటుందనీ, కానీ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్ తరాలకు మెరుగైన జీవనం కోసం వెళ్లక తప్పదని అన్నారు. మూసీ నది వరద ఉధృతి పెరిగితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందనీ, బతుకు దుర్భరం అనిపిస్తుందనీ చెప్పారు. ప్రజలు మంచి గాలి, నీరు దొరికే వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. మూసీ పునరావాస కుటుంబాల మహిళలను 17 గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఒక్కొక్కరికి రూ.2 లక్షల రుణాలను ప్రభుత్వం అందచేస్తున్నదని తెలిపారు. దీనిలో రూ.1 లక్షా 40 వేలను ప్రభుత్వం మాఫీ చేస్తుందనీ, మహిళా సంఘాలు కేవలం రూ.60వేలు నెలవాయిదాల్లో చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. ప్రభుత్వం సహాయంతో మంచి వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు. మహిళా సంఘాలకు కుట్టు మిషన్లు కూడా ఇస్తామనీ, వారిని ...13లో

మూసీ నీళ్లతో స్నానం చేసే దమ్ముందా? 6లో..

ఈటలకు ఎంపీ చామల సవాల్

అటు కొనుగోళ్లు..ఇటు నిరీక్షణ

రైస్ మిల్లులను కేటాయించకపోవడంతో పలుచోట్ల ఆగిన ధాన్యం కొనుగోళ్లు

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా వాటిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో దళారుల వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. రైస్‌మిల్లుల కేటాయింపు జరగకపోవడం, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించుకోవడానికి టార్పలిన్లు అందించకపోవడం తదితర కారణాలతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు. దాంతో చేసేదేమీలేక సొసైటీ సిబ్బంది ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. దాంతో దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. కాగా, మిల్లర్లు, ప్రభుత్వం మధ్య బియ్యం అందించే విషయంలో ఒప్పందం జరగకపోవడంతో కూడా కొనుగోళ్లు ఆశించినంత వేగంగా జరగడం లేదని తెలుస్తోంది.

వర్షాల భయంతో దళారుల వైపు చూపు

టార్పాలిన్లు అందించాలని రైతుల విజ్ఞప్తి



నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)/విలేకరులు

కొనుగోలు కేంద్రాలను ముందుగా నల్లగొండలో, ఆ తర్వాత మెదక్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రారంభించారు. కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇంకా పూర్తిగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కేంద్రాలు ప్రారంభించిన చోట కూడా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని రైతులు అంటున్నారు. దాంతో పక్కనే దళారులు కొనుగోళ్లు చేస్తుండటంతో వారికే అమ్ముకోవాల్సి వస్తోందని వరంగల్, కామారెడ్డి జిల్లాల రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు సన్న ధాన్యానికి అదనంగా మరో రూ.500 బోనస్ ఇవ్వడంతో క్వింటాకు రూ.2800 చెల్లించాల్సి ఉంటుంది. కానీ దళారులు మాత్రం.. వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తామంటూ రూ.2350కే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మూడు రోజుల్లో ధాన్యం డబ్బులు కావాలంటే రూ.లక్షకు వెయ్యి కట్ చేసుకుని ఇస్తున్నారు. దాంతో రైతులకు రూ.500 బోనస్‌తో పాటు అదనంగా రూ.లక్షకు మరో వేయి చొప్పున నష్టపోతూ అమ్ముకుంటున్నారు.

కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలు..

పంటను దళారులకు విక్రయించకూడదని సభలు, సమావేశాల్లో పాలక నేతలు, అధికారులు సలహాలు సూచనలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరుతో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో వారం రోజులుగా దళారులు గ్రామాల్లోకి ప్రవేశించి రైతులను ఆశ్రయించి ఆశ చూపుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ...13లో

ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం 2లో..

ఇక సుప్రీంలో అన్ని కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం 3లో..

ప్రయోగాత్మకంగా పరీక్షించిన ఉన్నత న్యాయస్థానం



ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళం అందజేసింది. శుక్ర వారం అదానీ గ్రూప్ సంస్థల చైర్మెన్ గౌతమ్ అదానీ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విరాళానికి సంబంధించిన చెక్కును సీఎంకు అందజేశారు.

నేడు మహారాష్ట్రకు మంత్రి డాక్టర్ సీతక్క

- ఉత్తర మహారాష్ట్ర ఇన్‌చార్జిగా

సీనియర్ పరిశీలకుల సమావేశానికి హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) శనివారం మహారాష్ట్రకు వెళ్లనున్నారు. ఆమె అక్కడ జరిగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులు సమావేశంలో పాల్గొంటారు. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఆమెను సీనియర్ పరిశీలకులుగా నియమించిన విషయం విదితమే. ఆమె ఉత్తర మహారాష్ట్ర జిల్లాల్లో కాంగ్రెస్ గెలుపునకు దగ్గరుండి కృషిచేయనున్నారు. ఆ రాష్ట్రానికి సీనియర్ అబ్జర్వర్లుగా మాజీ సీఎంలు అశోక్ గెహ్లాట్, భూపేష్ బగాల్, చరణ్‌జిత్ సింగ్ చన్ని, సీనియర్ నేత టీఎస్ సింగ్‌డియో, కర్నాటక మంత్రులు జి.పరమేశ్వర, ఎమ్‌బీ పాటిల్ తదితరులున్నారు.

గ్రూపు-1 అభ్యర్థులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం : ఎంపీ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రూపు-1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ప్రకారం కాకుండా 1:50 నిష్పత్తిలో ప్రిలిమ్స్ క్లియర్ చేసిన అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయడాన్ని తప్పుబట్టారు. 563 పోస్టులకు అర్హత సాధించిన 31,382 మంది జనరల్ కోటా కిందనే లెక్క అని తెలిపారు.

దీనివల్ల రిజర్వేషన్ అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. ఒక్క బీసీ పోస్టు ఉంటే 50 మందిని, 100 బీసీ పోస్టులుంటే 5 వేల మందిని పిలవాలని డిమాండ్ చేశారు. గ్రూపు-1 నియామకాలపై వివాదాలు సృష్టించి, కోర్టు కేసులను సాకుగా చూపి నియామకాలను వాయిదా వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. జీవో 29పై ఆందోళన చెందుతున్న అభ్యర్థులతో ప్రభుత్వం చర్చలు జరపాలని సూచించారు. వారి డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిశీలించాలని కోరారు. లేనిపక్షంలో గ్రూపు-1 అభ్యర్థుల తరపున తమ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు.

పొంగులేటితో కులదీప్ నారాయణ్ భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ, కులదీప్ నారాయణ్ భేటీ అయ్యారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై చర్చించారు. వీలైనంతవరకు రాష్ట్రానికి సహాయాన్ని అందించాలని పొంగులేటి కోరారు.

జార్ఖండ్ ఎన్నికల పరిశీలకులు భట్టికి ఘన స్వాగతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జార్ఖండ్ ఎన్నికల సీనియర్ పరిశీలకులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు రాంచీలో పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. వచ్చేనెల 13, 20 తేదీల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఆయన సీనియర్ పరిశీలకునిగా ఆయన నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన రాంచీ విమానాశ్రయానికి ఆయన చేరుకున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు సుల్తాన్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అభిజిత్ రాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంజన్ సింగ్‌తోపాటు పలువురు నేతలు భట్టికి ఘన స్వాగతం పలికారు.

పత్తి పంట కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు తెరవాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పత్తి పంట కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు తెరవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. శుక్ర వారం ఇదే అంశంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వానాకాలంలో రైతులు పండించిన పత్తి పంట చేతికొచ్చినప్పటికీ కేంద్రం కొనుగోలు కేంద్రాలు తెరవలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటు న్నారని తెలిపారు. అధిక వర్షాలకు విత్తనాలు మునిగిపోయి, రెండు, మూడుసార్లు పత్తి విత్తనాలను నాటాల్సి వచ్చిందని గుర్తు చేశారు. చీడపీడల వల్ల పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గిందని తెలిపారు. క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు.

ఎండీ నౌహీరా షేక్‌కు బెయిల్ రద్దు

హీరా గోల్డ్ కేసులో గత ఆదేశాలు అమలు చేయకపోవడంతో నిర్ణయం

- దాఖలైన అన్ని పిటిషన్లు ముగిస్తున్నట్టు సుప్రీంకోర్టు వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా స్కీముల పేరుతో అక్రమంగా డిపాజిట్లు సేకరించి వేల కోట్ల కుంభకోణానికి తెరలేపిన హీరా గోల్డ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గత ఆదేశాలను అమలు చేయకపోవడంతో హీరాగోల్డ్ ఎండీ నౌహీరాషేక్‌కు సుప్రీంకోర్టు బెయిల్ రద్దు చేసింది. అలాగే ఈ కేసులో దాఖలైన అన్ని పిటిషన్లను ముగిస్తు న్నట్టు స్పష్టం చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్‌తో పాటూ, ఐపీసీలోని తీవ్ర నేర ఆరోపణల కింద విచారణ జరపాలని తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 10, 2020న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే కేసుకు సంబంధించి హీరా గోల్డ్ ఎండీ నౌహీరా, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్(ఎస్ఎఫ్ఐఓ), సీకే మౌలా షరీఫ్‌లు సర్వోన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. ఈ ఏడాది ఆగస్టు 23న ఈ పిటిషన్లను జస్టిస్ జే.బి. పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది.

ఈ సందర్భంగా ఈ వ్యవహారం క్రిమినల్ కేసు కిందకు రాదని ఈ కేసును ఆర్థిక నేరంగా పరిగణించి తనకు బెయిల్ ఇవ్వాలని నౌహీరా షేక్ తరపు న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. తదుపరి విచారణ లోపు రూ. 580 కోట్ల డిపాజిట్లను మదుపరులకు తిరిగి చెల్లిస్తానని అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని కోర్టుకు నివేదించారు. ఈ అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఐదు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఇందులో ఏ షరతును అతిక్రమించినా బెయిల్ రద్దు అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే దేశ వ్యాప్తంగా దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్‌లు కలపడం కోసం ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేయబడుతోందని వెల్లడించింది. అలాగే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఐఓ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చట్టం ప్రకారం ముందుకు వెళ్లొచ్చని స్పష్టం చేసింది. అంతేకాక ఆయా రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ప్రకారం విచారణ చేపట్టవచ్చని వెల్లడించింది. అయితే శుక్రవారం మరోసారి ఈ పిటిషన్ జస్టిస్ జే.బి. పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 23న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను హీరా గోల్డ్ అమలు చేయలేదని పిటిషనర్లు ధర్మాసనం దష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నౌ హీరా బెయిల్ రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. అలాగే మిగిలిన షరతులు అమలవుతాయని స్పష్టం చేస్తూ... ఈ వ్యవహారంలో దాఖలైన అన్ని పిటిషన్లను ముగిస్తున్నట్లు వెల్లడించింది.



(ఫైల్)

దాదాపు రూ. 5, 600 కోట్ల డిపాజిట్లు సేకరణ

హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పేరుతో దేశ వ్యాప్తంగా సుమారు 1,72,000 మంది నుంచి దాదాపు రూ.5,600 కోట్ల డిపాజిట్ల సేకరణ జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. తక్కువ పెట్టుబడులకు అధిక లాభాలు చెల్లిస్తామని తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఎపీ రాష్ట్రాల్లో డిపాజిటర్లను హీరా గ్రూప్ మోసం చేసింది. హీరా గ్రూప్‌లో పెట్టుబడులు పెడితే నెలకు 3శాతం లాభాలు ఇస్తామని మదుపరులను నమ్మించింది. ఇలా హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పేరుతో 24 కంపెనీలు ప్రారంభించి అనేక స్కీములతో డిపాజిటర్లను హీరా గ్రూప్ ఆకర్షించినట్లు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 24 కంపెనీల కోసం దేశ వ్యాప్తంగా 182 బ్యాంక్ ఖాతాలను హీరా గ్రూప్ తెరిచింది. యూఏఈ, సౌదీ అరేబియా లాంటి అరబ్ దేశాల్లో 20 బ్యాంక్ అకౌంట్లను నౌహీరా మెయింటెన్ చేశారు. ఈ దిశలో ఆర్థిక నియంత్రణ సంస్థలనుంచి ఎటువంటి అనుమతులు హీరా గ్రూప్ తీసుకోలేదు. దీంతో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఇతర విభాగాలు ఈ కేసులో జోక్యం చేసుకున్నాయి. ఫుడ్ ఐటమ్స్, గోల్డ్, టెక్స్ టైల్స్ బిజినెస్ పేరుతో హీరా గోల్డ్ సంస్థ మనీలాండరింగ్ కి పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తుంది. ఈ విచారణలో భాగంగా సుమారు రూ. 300 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను గతంలో ఈడీ అటాచ్ చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ కేసు పురోగతిలో భాగంగా గతంలో నౌహీరా షేక్ ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి ఆర్థిక నేరాలకు సంబంధించి పలు కేసులు నమోదు చేశారు.

పాతపద్ధతిలోనే గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలి

- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్
- అభ్యర్థులపై లాఠీచార్జీకి ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జీవో నెంబర్ 29ని రద్దు చేసి పాత పద్ధతిలో జీవో నెంబర్ 55 ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండించాయి. ఈ మేరకు ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, కోట రమేష్, టి నాగరాజు, ఆనగంటి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్సర్ బుక్‌లెట్లలో యూపీఎస్సీ తరహాలో ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్ ముద్రించి ఆయా అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షను నిర్వహించాలని కోరారు. గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలను పరిష్కారం చేసి ఎలాంటి వివాదాలు లేకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని సూచించారు. అభ్యర్థుల సందేహాలను టీజీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అవలంబిస్తున్న 29 జీవో ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థులను జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణించి ఇతర అభ్యర్థులు నష్ట పోకుండా ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న అభ్యర్థులపై లాఠీలతో దాడులు చేయకుండా సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

- కిషన్ రెడ్డి, కోదండరాం, కూనంనేనితో

జాజుల శ్రీనివాస్‌గౌడ్ భేటీ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వివిధ రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులతో వేరు వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 20న హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించబోయే అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశానికి హాజరు కావాలని వారిని ఆహ్వానించారు. ప్రతినిధుల్లో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, నేతలు తాటికొండ విక్రమ్, సింగం నగేష్, ఆయిలి వెంకన్న, ఇంద్రం రజక ,జాజుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అంకుర సంస్థలకు మరింత ప్రోత్సాహం

- జయేశ్ రంజన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అంకుర సంస్థలను మరింత ప్రోత్సహిస్తామని ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. శుక్రవారం ఇండియన్ స్టేట్స్ అండ్ బిజినెస్ ఇంకుబేటర్స్ అసోసియేషన్ (ఐఎస్‌బీఏ) అటల్ ఇంకుబేషన్ సెంటర్-సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (ఏఐసీ - సీసీఎంబీ) సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్ ఐఎస్‌బీఏకాన్ 16వ ఎడిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఇంకుబేటర్లకు సంబంధించి వ్యాపార అవకాశాలు, సమాచార మార్పిడి, అనుభవాలను పరస్పరం పంచుకోవడం ఎడిషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏఐసీ-సీసీఎంబీ సీఈవో డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ స్టార్టప్ లకు పారిశ్రామికంగా భారతదేశంలో ఎదిగేందుకు ఉన్న అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి మాట్లాడుతూ సీసీఎంబీలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బీఏ సలహా కమిటీ సభ్యులు ఎ.రమణన్, బిరాక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ, టి-హబ్, టీఐఈ-హైదరాబాద్, ఐకేపీ నాలెడ్జ్ పార్క్, తదితర సంస్థలు నాలెడ్జ్ పాట్నర్లుగా వ్యవహరించాయి.

ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

- తమ్మినేనికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ -475) కోరింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం పంపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదలయ్యేలా చూడాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని తెలిపారు.

ఆదివాసీలలో ఎన్డీఏకు చుక్కెదురే

వచ్చే నెలలో మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అటు ఎన్డీఏ, ఇటు ఇండియా బ్లాక్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ రెండు రాష్ట్రాలలోనూ గిరిజనుల ఓట్లు గణనీయంగా ఉండడం ఎన్డీఏను కలవరపెడుతోంది. విజేతలను నిర్ణయించేది ఆదివాసీల ఓట్లేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ స్థానాలలో 25 సీట్లను గిరిజనులకు కేటాయించారు. జార్ఖండ్‌లోని 81 స్థానాలలో మూడో వంతు...అంటే 28 సీట్లు ఎస్టీలవే. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలో మహాయుతి కూటమి, జార్ఖండ్‌లో ఎన్డీఏ కూటమి గిరిజన స్థానాలలో ఉనికిని కోల్పోయాయి. ఈ నేపథ్యంలోనే ఎన్డీఏలో కలవరం మొదలైంది.

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో విజేతలను నిర్ణయించనున్న గిరిజనం

రెండు రాష్ట్రాలలో గణనీయంగా ఓటు బ్యాంక్



మహారాష్ట్రలో...

న్యూఢిల్లీ: 2011 జనాభా లెక్కల ప్రకారం మహారాష్ట్ర జనాభాలో గిరిజనులు 10 శాతం వరకూ ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 36 జిల్లాలు ఉండగా వాటిలో 21 జిల్లాలలో ఒక్కో దానిలో కనీసం లక్ష మంది ఆదివాసీలు నివసిస్తున్నారు. భిల్స్, గోండా, కోలిస్, వర్లిస్ జిల్లాలలో మొత్తం గిరిజనం సంఖ్య 65 లక్షలు. గిరిజనులలో బాగా వెనుకబడిన మూడు తరగతులకు చెందిన సుమారు ఐదు లక్షల మంది కూడా ఈ జిల్లాల్లోనే నివసిస్తున్నారు. మొత్తంగా చూస్తే 38 శాసనసభ స్థానాలలో ఎస్టీల జనాభా కనీసం 20 శాతం మేర ఉంది.

2014 శాసనసభ ఎన్నికలలో ఎస్టీ సీట్లలో బీజేపీ 11 స్థానాలను గెలుచుకోగా 2019 నాటికి ఆ సంఖ్య ఎనిమిదికి తగ్గింది. ఓటింగ్ శాతం కూడా 27.9 నుంచి 26.9కి పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ సీట్లు కూడా ఐదు నుంచి నాలుగుకు తగ్గిపోయాయి. ఎన్సీపీ బలం మాత్రం నాలుగు నుంచి ఆరుకు పెరిగింది. ఈ రెండు ఎన్నికలలోనూ శివసేనకు మూడు స్థానాల చొప్పున లభించాయి.

ప్రస్తుత ఎన్నికలలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ), మహాయుతి తలపడుతున్నాయి. ఒక్కో శిబిరంలో మూడేసి పార్టీలు ఉన్నాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో గిరిజన సీట్లలో బీజేపీకి ఎదురు దెబ్బలు తగిలాయి. ఆ పార్టీ కేవలం ఒకే ఒక స్థానాన్ని గెలుచుకోగలిగింది. కాంగ్రెస్‌కు రెండు, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి ఒక స్థానం లభించాయి. శాసనసభ స్థానాల వారీగా చూస్తే బీజేపీ కూటమి 9, ఎంవీఏ కూటమి 15 (కాంగ్రెస్ 9, శివసేన-ఠాక్రే 4, ఎన్సీపీ-పవార్ 2) స్థానాలలో ఆధిక్యత సంపాదించాయి.

జార్ఖండ్‌లో...

2011 జనగణన ప్రకారం జార్ఖండ్ జనాభాలో ఎస్టీలు 26 శాతం మేర ఉన్నారు. మొత్తం 24 జిల్లాలలో 21 జిల్లాలలో కనీసం లక్ష చొప్పున ఆదివాసీల జనాభా ఉంది. రాష్ట్రంలోని 43 అసెంబ్లీ స్థానాలలో గిరిజన జనాభా కనీసం 20 శాతం వరకూ ఉంటుంది. 22 స్థానాలలో అయితే జనాభాలో సగానికి పైగా ఆదివాసీలే. 2014 శాసనసభ ఎన్నికలలో 13 స్థానాలు గెలుచుకున్న జేఎంఎం 2019లో 19 సీట్లలో విజయం సాధించింది. 2014లో ఒక్క స్థానం కూడా గెలుచుకోలేకపోయిన కాంగ్రెస్ 2019లో ఆరింటిని చేజిక్కించుకుంది. బీజేపీ బలం మాత్రం 11 నుంచి రెండుకు పడిపోయింది. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), జార్ఖండ్ వికాస్ మోర్చ (జేవీఎం) ప్రభావం చూపలేక పోయాయి.

ఈసారి కూడా జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి ఆధిక్యత కనబరిచే అవకాశాలు కన్పిస్తున్నాయి. జేఎంఎం అధినేత, ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేయడంతో ఆయనపై ఓటర్లలో సానుభూతి పెరిగింది. ఈ ప్రభావం ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. మొత్తం ఐదు ఎస్టీ స్థానాలనూ ఈ కూటమే గెలుచుకుంది. ఎస్టీ స్థానాలకు సంబంధించి పది అసెంబ్లీ సెగ్మెంట్లలో జేఎంఎం, 13 సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఆధిక్యత కనబరచగా బీజేపీ ఐదింటిలో మాత్రమే మెజారిటీ సంపాదించింది.



(ఫైల్)

22, 23 తేదీల్లో రష్యాలో ప్రధాని మోడీ పర్యటన

న్యూఢిల్లీ : ఈ నెల 22, 23 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ రష్యాలో పర్యటించనున్నారు. కజన్‌లో జరగనున్న 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనాల్సిందిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానించిన మేరకు ఈ పర్యటన ఖరారైందని విదేశాంగ శాఖ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ సదస్సు నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులతో మోడీ ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతారని భావిస్తున్నారు. "అంతర్జాతీయ అభివృద్ధి, భద్రతల కోసం బహుళవాదాన్ని బలోపేతం చేయడం" అన్నది ఈ ఏడాది సదస్సు ప్రధాన ఉద్దేశంగా వుంది. కీలకమైన అంతర్జాతీయ సమస్యలపై చర్చించేందుకు ఇదొక ముఖ్య వేదిక కానుందని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. బ్రిక్స్ దేశాలు చేపట్టిన పలు చొరవల పురోగతిని సమీక్షించేందుకు ఇదొక విలువైన అవకాశమని, అలాగే భవిష్యత్ సహకారానికి ముఖ్యమైన రంగాలను గుర్తించడానికి కూడా వీలు వుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ కార్యక్రమాలు వద్దు

ప్రధాని మోడీకి తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ భాషా ఆధారిత కార్యక్రమాలను నిర్వహించే నిర్ణయాన్ని పునరాలోచించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చెన్నై దూరదర్శన్ స్వర్ణోత్సవాలతో పాటు హిందీ మాసం ముగింపు వేడుకలను సంయుక్తంగా నిర్వహించడాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాశారు. ప్రాథమిక భాష కాని రాష్ట్రాల్లో హిందీని ప్రోత్సహించడంపై ప్రాంతీయంగా పెరుగుతున్న ఆందోళలను స్టాలిన్ ప్రస్తావించారు. 'భారతదేశం వంటి బహుభాషా దేశంలో హిందీకి ప్రత్యేక హోదా కల్పించడం, హిందీ మాట్లాడని రాష్ట్రాలలో హిందీ మాసాన్ని జరపడం ఇతర భాషలను కించపరిచే ప్రయత్నమే' అని ఆరోపించారు.

భారత రాజ్యాంగం ఏ భాషకూ జాతీయ భాష హోదా కల్పించలేదని ఎంకే స్టాలిన్ తెలిపారు. అధికార ప్రయోజనాల కోసమే హిందీ, ఇంగ్లీష్‌ను ప్రధానంగా వినియోగిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హిందీ ఎక్కువగా మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ ఆధారిత వేడుకలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ప్రతిపాదించారు.



ఒకవేళ హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ కార్యక్రమాలను కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం పట్టుబడితే ఆయా రాష్ట్రాల్లోని స్థానిక భాషల వేడుకలను కూడా అంతే ఉత్సాహంతో జరపాలని సీఎం స్టాలిన్ సూచించారు. అలాగే దేశంలో గుర్తింపు పొందిన అన్ని సాంప్రదాయ భాషల గొప్పతనాన్ని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వాటిని ప్రోత్సహించాలని కేంద్రాన్ని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు వివిధ భాషా వర్గాల మధ్య సత్సంబంధాలను, భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



జార్ఖండ్‌లో బీజేపీకి షాక్

జేఎంఎంలోకి సీనియర్ ఎమ్మెల్యే

రాంచీ : జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే రాజకీయం మారుతోంది. పార్టీ అధిష్టానం తీరుకు మనస్తాపం చెందిన బీజేపీ ఎమ్మెల్యే కేదార్ హజ్రా, ఏజేఎస్‌యూ పార్టీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఉమాకాంత్ రజక్ శుక్రవారం జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)లో చేరారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇరువురు నేతలు కొనియాడుతూ గిరిజన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తాము జేఎంఎంలో చేరామని చెప్పారు. హేమంత్ సోరెన్ వారిద్దరినీ జేఎంఎంలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీజేపీని ఓడించేందుకు ఇండియా బ్లాక్ పని చేస్తోందని చెప్పారు. జేఎంఎంలో చేరిన నేతలు బీజేపీని టార్గెట్ చేస్తున్నారని విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్ర వాతావరణాన్ని చెడగొట్టాలని బీజేపీ చూస్తోందని వారు ఆరోపించారు. మరోపక్క ఎన్డీఏ కూటమిలో సీట్ల సర్దుబాట్లు బీజేపీని దెబ్బతీయటం ఖాయమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

క్యాబినెట్ నిర్ణయానికి

గవర్నర్ కట్టుబడి ఉండాలి

మద్రాస్ హైకోర్టు పునరుద్ఘాటన

చెన్నై : రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను పాటించటానికి గవర్నర్ రాజ్యాంగబద్ధంగా కట్టుబడి ఉండాలని మద్రాసు హైకోర్టు పునరుద్ఘాటించింది. తనను త్వరగా విడుదల చేయాలంటూ జీవితఖైదు అనుభవిస్తున్న ఒక ఖైదీ వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. పై విధంగా స్పందించింది. ఒక హత్య కేసులో పురుఖల్ జైలులో పిటిషనర్ వీరభారతి జీవితఖైదు అనుభవిస్తున్నారు. తనను త్వరగా విడుదల చేయాలంటూ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాను ఇప్పటికే 20 ఏండ్లు జైలులో శిక్షను అనుభవించాననీ, సత్ప్రవర్తన కింద తనను విడుదల చేయాలంటూ అంతకముందు జైళ్లశాఖ డీజీపీ నేతృత్వంలోని కమిటీకి పిటిషన్‌ను సైతం అందిచాడు. ఇవే నేరాలకు సంబంధించి దోషులుగా తేలిన ఖైదీలు త్వరగానే విడుదలయ్యారని వీరభారతి వాదించారు. పూర్తి రివ్యూ తర్వాత రాష్ట్ర కమిటీ తన విడుదలకు సిఫారసు చేసిందని వివరించారు. ఈ సిఫారసును సీఎంకు పంపించటం, ఆ తర్వాత రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం పొంది తుది అనుమతి కోసం గవర్నర్ వద్దకు వెళ్లిందని పేర్కొన్నాడు. అయితే, తన విడుదలకు గవర్నర్ ఆమోదం తెలపలేదని వీరభారతి వివరించారు. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎం సుబ్రహ్మణ్యం, జస్టిస్ వి. శివజ్ఞానం లతో కూడిన ధర్మాసనం.. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషి అయిన పెరారివాలన్ వంటి కేసులను ఉటంకించింది. ఈ నేపథ్యంలో గవర్నర్ విషయంలో కోర్టు పై విధంగా కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన బాధ్యత గవర్నర్‌కున్నదని న్యాయస్థానం నొక్కి చెప్పింది. మరోపక్క, వీరభారతి పిటిషన్‌ను పునర్విచారణకు ఆదేశించిన ధర్మాసనం.. ఆయనకు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. తమిళనాడు ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్‌కు మధ్య గత కొంత కాలంగా సఖ్యత లేని విషయం విదితమే. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

రాష్ట్రహోదాను పునరుద్ధరించాలి

- తీర్మానాన్ని ఆమోదించిన జమ్మూకాశ్మీర్ క్యాబినెట్
- తొలి సమావేశంలో నిర్ణయం

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని క్యాబినెట్ తీర్మానాన్ని ఆమోదించింది. కొత్తగా సీఎంగా ఎన్నికైన తర్వాత ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన తొలి క్యాబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ముసాయిదా తీర్మానంపై క్యాబినెట్ చర్చించింది. శ్రీనగర్‌లోని సివిల్ సెక్రెటేరియట్‌లో జరిగిన తొలి క్యాబినెట్ సమావేశానికి ఒమర్ అబ్దుల్లాతో పాటు ఐదుగురు మంత్రులు హాజరయ్యారు. జమ్మూకాశ్మీర్ మీడియాలో ఈ తీర్మానం గురించి విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఇటు నేషన్ కాన్ఫరెన్స్(ఎన్సీ) నుంచి కానీ, ప్రభుత్వ అధికారుల నుంచి కానీ ఎవరూ పెదవి విప్పకపోవటం గమనార్హం. ఈ విషయాన్ని ఎన్సీ నేతలు కూడా కాదనటం లేదు.

కాగా, ఒమర్ అబ్దుల్లా క్యాబినెట్ నిర్ణయంపై ప్రతిపక్ష బీజేపీ, పీడీపీలు విమర్శలు గుప్పించాయి. రాష్ట్ర హోదాను కోరటం ద్వారా 2019, ఆగస్టు 5న కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఒమర్ అబ్దుల్లా



పరోక్షంగా సమర్థిస్తున్నారని పీడీపీ నేత వాహీద్-ఉర్-రెహమాన్ పెర్రా ఆరోపించారు. ఆర్టికల్ 370పై ఎలాంటి తీర్మానం లేకపోవటం, కేవలం రాష్ట్ర హోదాను కోరటం పెద్ద దెబ్బగా అభివర్ణించారు. తీర్మానం విషయంలో రహస్యాన్ని, మిస్టరీని జమ్మూకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ చైర్మెన్ సాజద్‌లోనే ప్రశ్నించారు.

ఐదుగురు మంత్రులకు శాఖల కేటాయింపు

ఒమర్ అబ్దుల్లా తన క్యాబినెట్‌లోని ఐదుగురు మంత్రులకు శాఖలు కేటాయించారు. ఇద్దరు కాశ్మీర్ లోయ నుంచి, మరో ముగ్గురు జమ్మూ ప్రాంతం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఎన్సీతో పొత్తు ఉన్న కాంగ్రెస్ నుంచి ఎన్నికైనవారిలో ఒక్కరు కూడా ప్రస్తుతం ఒమర్ క్యాబినెట్‌లో లేరు.

జమ్మూకాశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురిందర్ కుమార్ చౌదరీకి పబ్లిక్ వర్క్స్ (రోడ్లు, బిల్డింగ్‌లు), పరిశ్రమలు, కామర్స్, మైనింగ్, లేబర్, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శాఖలు దక్కాయి. సకీనా మసూద్ ఇటూకు వైద్యారోగ్యం, విద్య, స్కూల్ ఎడ్యుకేషన్, హయ్యార్ ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్‌లు వచ్చాయి. జావెద్ అహ్మద్ రానా.. జల్‌శక్తి, అటవీ, ఎకోలజీ, పర్యావరణం, గిరిజన వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు దక్కాయి. వ్యవసాయ ఉత్పత్తి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, సహకార, ఎలక్షన్ మంత్రిగా జావిద్ అహ్మద్ దర్‌కు బాధ్యతలు అందాయి. జమ్మూ ప్రాంతంలోని ఛంబ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన మంత్రి సతీశ్ శర్మకు ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సమాచార సాంకేతిక, యువజన సర్వీసులు, క్రీడలు, ఏఆర్ఐ అండ్ ట్రైనింగ్స్ శాఖలను ఒమర్ కేటాయించారు.

ఇక సుప్రీంలో అన్ని కేసుల విచారణ

ప్రత్యక్ష ప్రసారం

ప్రయోగాత్మకంగా పరీక్షించిన ఉన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ : ఇక అన్ని బెంచ్‌ల్లో జరిగే సాధారణ విచారణా కార్యకలాపాలన్నిం టినీ ప్రత్యక్ష ప్రసారం చేయాలని సుప్రీం కోర్టు యోచిస్తోంది. ప్రయోగాత్మక పద్ధతిలో శుక్రవారం అన్ని బెంచ్‌ల కార్యకలపాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. సుప్రీం కోర్టు అధికారిక యూ ట్యూబ్ ఛానల్‌కు బదులుగా ప్రత్యే కంగా రూపొం దించిన యాప్ ద్వారా ఈ ప్రత్యక్ష ప్రసారం జరిగింది. ఇప్పటివరకు కేవలం రాజ్యాంగ ధర్మాసనం చేపట్టిన ప్రజా ప్రాధాన్యత కలిగిన కేసుల విచారణను మాత్రమే ప్రత్యక్షంగా ప్రసారం చేశారు. ఇటీవల నీట్-యూజీ అంశం, ఆర్‌జి కార్ సుమోటో కేసు విచారణలు ప్రజా ప్రయో జనాలను దృష్టిలో వుంచుకుని ప్రత్యక్షంగా ప్రసారం చేశారు. 2018లో స్వప్నిల్ త్రిపాఠి వర్సెస్ సుప్రీం కోర్టు కేసులో ఇచ్చిన చారిత్రక తీర్పులో ఆన్‌లైన్ ప్రసారాలకు ద్వారాలు తెరిచారు. బాల నేరస్తులు, లైంగిక దాడులు, వివాహ సంబంధిత కేసులు మినహా మిగిలిన జాతీయ, రాజ్యాంగబద్ధమైన ప్రాధాన్యత కలిగిన కేసుల విచారణలను ప్రత్యక్షంగా ప్రసారం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2022లో మొదటిసారిగా ఇడబ్ల్యుఎస్ కోటా కేసు విచారణ ప్రత్యక్షంగా ప్రసారమైంది. సుప్రీం మాదిరిగా హైకోర్టులు కూడా ఈ తరహా చర్యలు చేపడుతున్నాయి. అందులో గుజరాత్ హైకోర్టు మొదటిసారిగా ఈ చర్యలు తీసుకుంది. ఏం జరుగుతోందో ప్రజలకు తెలుసుకునేందుకు, జ్యుడీషియల్ కార్యకలపాల్లో పారదర్శకత పెంచేందుకు ఇలా ప్రత్యక్ష ప్రసారమన్న ఆలోచనను అమలు చేశారు.

ఇషా ఫౌండేషన్‌పై

కేసు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ : సద్గురు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఇషా ఫౌండేషన్‌పై నమోదైన హెబియస్ కార్పస్ కార్యకలాపాలను సుప్రీం కోర్టు శుక్రవారం విరమించుకుంది. 42, 39ఏళ్ళ వయస్సున్న తన ఇద్దరు కుమార్తెలను ఆ స్వచ్ఛంద ఆధ్యాత్మిక సంస్థ బందీలుగా వుంచిందని ఆరోపిస్తూ 70ఏళ్ల వృద్ధుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. మద్రాసు హైకోర్టులో ప్రారంభమైన ఈ కార్యకలాపాలు సుప్రీం కోర్టుకు చేరాయి. అయితే ఆ ఇద్దరు యువతులు తమ అభీష్టం మేరకే తాము సన్యాసినులుగా జీవిస్తూ ఇషా ఫౌండేషన్‌లో వున్నామని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు వ్యక్తిగతంగా తెలియచేయడంతో కోర్టు ఈ చర్యలను తీసుకోవాల్సి వచ్చింది. తమను కలిసిన తమిళనాడు పోలీసుల కు కూడా వారీ విషయం తెలియచేశారు. వారు మేజర్లు అయినందున తల్లిదండ్రులుగా మీరు వారిని నియంత్రించలేరు. పైగా తల్లిదండ్రులు, పెరిగిన పిల్లల మధ్య వుండాల్సిన వ్యక్తిగత బంధాలను చట్టపరమైన తీర్పులు, చర్యలు ద్వారా నిర్దేశించలేరని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పేర్కొన్నారు. ఆ మహిళలను బందీలుగా వుంచితే కోర్టు సర్వ శక్తులను ఒడ్డి చర్యలు తీసుకునేదని, కానీ వారు తాము బందీలం కాదని, తమను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేసిన తర్వాత ఈ నిర్ధారణకు రావాల్సి వచ్చిందని సిజెఐ తెలిపారు.

బాల్య వివాహాల కట్టడికి

మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ : బాల్య వివాహాల కట్టడికి సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు జారీ చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పర్సనల్ లాతో తగ్గించవద్దని వెల్లడించింది. ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్య వివాహాల నిరోధం, మైనర్‌ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది. 'బాల్య వివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతం అవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యాన్ని పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు.

అవినీతి కేసులో దోషిగా

వియత్నాం రియల్ ఎస్టేట్ దిగ్గజం

హనోయ్ : వియత్నాం రియల్ ఎస్టేట్ దిగ్గజం ట్రాంగ్ మై లాన్ కోట్లాది రూపాయిల మేరకు అవినీతికి పాల్పడిన కేసులో దోషిగా తేలారు. అవినీతిపై ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా ఈ కేసు తెరపైకి వచ్చింది. మరో కేసులో 12,500కోట్ల డాలర్ల మేరకు అవినీతి చర్యలు చేపట్టినందుకు హోచిమిన్ నగర కోర్టు ఇప్పటికే ట్రాంగ్ మై లాన్‌ను ఏప్రిల్‌లో దోషిగా నిర్ధారించింది. ఈ మొత్తం దేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3శాతంగా వుంది. ఈ కేసులో మరణ శిక్ష విధించారు. ఆమెపై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణలను రెండు భాగాలుగా చేశారు. గురువారం ఇచ్చిన తీర్పు కింద గరిష్ట కాలం జైలు శిక్ష అనుభవించాల్సి వుంది. కాగా తన మరణశిక్ష తీర్పునకు వ్యతిరేకంగా అప్పీల్ చేసిన ఆమె తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.

గనులు తవ్వు..రాజకీయ పార్టీలకు ఇవ్వు

'పొలిటికల్' దాతలుగా పలు మైనింగ్ సంస్థలు

ఒడిశాలోని ఎనిమిది సంస్థల నుంచి భారీ విరాళాలు

బీజేడీ, బీజేపీ,కాంగ్రెస్‌లకు నిధులు

ఈ సంస్థలపై కాగ్ పలు అభియోగాలు

న్యూఢిల్లీ : ప్రకృతి ప్రసాదించిన గనులను తవ్వుకొని సొమ్ము చేసుకుంటున్న కొన్ని సంస్థలు.. రాజకీయ పార్టీలకు భారీ ఎత్తున నిధులను అందిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష, విపక్ష పార్టీలు అన్నింటినీ కవర్ చేస్తూ నోట్లతో మాట్లాడుతున్నాయి. తమ తవ్వకాల వ్యాపారానికి అడ్డురాకుండా ముందు జాగ్రత్త పడుతున్నాయి. ఒడిశాలోని పలు మైనింగ్ సంస్థల తీరు ఈ విధంగానే ఉన్నది. ఎనిమిది సంస్థలు రాజకీయ పార్టీలకు భారీ ఎత్తున విరాళాలను ఇచ్చిన సందర్భాలున్నాయి. వీటి వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక పలు అభియోగాలనూ మోపింది. అలాగే, ఒడిశా ప్రభుత్వ తీవ్రమైన లోపాలను సైతం ఇది ఎత్తి చూపింది.

కాగ్ నివేదిక.. ఒడిశాలో 2015 నుంచి 2022 వరకు మైనింగ్ రాబడిలో రూ.22,392 కోట్ల నష్టాన్ని ఎదుర్కోవటానికి 23 ప్రయివేటు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం గణ నీయంగా సహాయపడిందని వివరించింది. వీటిలో 8 కంపెనీలను ఒక ఆంగ్ల వార్తా సంస్థ కనుగొన్నది. వీటి ద్వారా రూ.6,962 కోట్ల నష్టం కలిగిందని పేర్కొన్నది.

అలాగే, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో మొత్తం రూ.601 కోట్లను రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చినట్టు కనుగొన్నది. ఈ కంపెనీలు ఒడిశాలో ప్రధాన ప్రాంతీయ పార్టీగా ఉన్న బీజేడీతో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లకు విరాళాలు ఇచ్చాయి. ఈ విరాళాల్లో అత్యధిక వాటా బీజేడీకి దక్కటం గమనార్హం. ఆరు కంపెనీల నుంచి మాజీ సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని పార్టీకి రూ.453 కోట్లు వచ్చినట్టు సమాచారం. ఆ తర్వాత అత్యధిక మొత్తం ఆరు సంస్థల నుంచి బీజేపీకి రూ.145 కోట్లు దక్కాయి. ఈ దాతల విరాళాలు వివాదమవ్వటం ఇదే మొదటిసారి కాదు. 2013లో ఎంబీ షా కమిషన్ వివిధ మైనింగ్ ఉల్లంఘనల గురించి లేవనెత్తింది. తన నివేదికలో పలు కంపెనీల పేర్లను లేవనెత్తింది. అయితే, ఒడిశాలో మైనింగ్ లీజులు, అనుమతులు, లైసెన్సుల మంజూరు, పొడగింపులు, లీజు హోల్డర్ల ద్వారా ఖనిజాల పంపకాలు, విక్రయాలను నివేదించటానికి సంబంధించిన పలు విషయాలను ఈ నివేదికలో ఎత్తి చూపింది. వాస్తవానికి ఒడిశా ఇనుప ఖనిజ ఉత్పత్తిలో 57 శాతం వాటాను కలిగి ఉన్నది. దాదాపు 60 గనులు, 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇక్కడ పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో ఇనుప ఖనిజం తవ్వకాలపై పరిమితి విధించటంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది.

- 70 శాతానికిపైగా ఖనిజ ప్రాంతాలు అన్వేషించబడకపోవటంతో పరిమితి అవసరం లేదని మోడీ సర్కారు వాదించింది. పైన తెలిపిన ఎనిమిది కంపెనీలలో ఒకటి పరిమితికి మించి మైనింగ్ చేయటం గమనార్హం.
- తవ్విన ఇనుప ఖనిజం నాణ్యతలో తగ్గుదల కారణంగా 2020 నుంచి 2022 మధ్య రూ.4,162 కోట్ల నష్టం సంభవించటం గమనార్హం. కాగ్ కనీసం ఎనిమిది ఇనుప ఖనిజం గనులు, వాటి మైనింగ్ పరిమితులను మించినట్టు గుర్తించింది.
- ఇది రూ.3618.5 కోట్ల అదనపు నష్టానికి దారి తీసిందని అంచనా. పర్యావరణ క్లియరెన్స్ పరిమితులను ఉల్లంఘించిన మైనింగ్ కార్యకలాపాల కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ.1600 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు సమాచారం. సరైన ఈ-పాస్‌లు లేకుండానే 1.48 కోట్ల టన్నుల ఇనుప ఖనిజం రవాణా చేయబడిందనీ, దీనితో రూ.1473 కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ అంచనా వేసింది.



ఈ ఎనిమిది సంస్థల్లో ఎస్సెల్ మైనింగ్, జేఎస్‌పీఎల్, కేపీ, రుంగ్టా సన్స్, పెంగ్విన్ అండ్ ట్రేడ్ అండ్ ఏజెన్సీ, ఎస్ఎన్ మొహంతి, కె.జె.ఎస్ అహ్లువాలియా, ఇంద్రానీ పట్నాయక్‌లు ఉన్నాయి. ఇందులో నాలుగు సంస్థలు బీజేడీకి రూ.396 కోట్లు, బీజేపీకి రూ.126 కోట్లు విరాళంగా ఇచ్చాయి. ఈ ఎనిమిది సంస్థల ద్వారా రాష్ట్ర ఖజనాకు రూ.5032 కోట్లు ఖర్చయ్యాయి. 2020 నుంచి 2022 మధ్య కాలంలో ఇనుప ఖనిజం గ్రేడ్‌లో ఆకస్మిక, అసాధారణ క్షీణత కారణంగా రూ.4,162 కోట్ల నష్టం వాటిల్లింది. ఆరు గనుల్లో ఇది నమోదు కాగా.. ఇందులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందినవి మూడు ఉన్నాయి. మైనింగ్ ప్లాన్‌ను మించి ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేయటంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.3618 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని కాగ్ పేర్కొన్నది.

నవతెలంగాణ

సంపాదకీయం

ఆకలిని జయించేదెలా?

"చారిత్రక విభాత సంధ్యల
మానవ కథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించినదే పరమార్థం" అంటూ... అంతిమంగా "ఏ వెలుగులకీ ప్రస్థానం" అని ప్రశ్నించాడు శ్రీశ్రీ. ఈ ప్రశ్న దశాబ్దాలు గడిచినా మనల్ని వెంటాడుతూనే ఉన్నది.సమాజం వెలుగులవైపే ప్రయాణిస్తోందా? అని సదా హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తూనే ఉన్నది. ఇప్పుడు ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక నేపథ్యంలో మరోసారి మనలను తట్టిలేపుతున్నది. గురువారం వెల్లడించిన "యూఎన్‌డీపీ" సూచీ ప్రపంచంలో 110కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఉన్నారని పేర్కొన్నది. ఇందులో అత్యధికులు మనదేశంలోనే ఉన్నారని కుండబద్దలు కొట్టింది. ప్రస్తుతం ప్రజలు ఏం తినాలో ఏం తినకూడదో కూడా వారే తేల్చిచెపుతూ ఈ దేశ రాజకీయాలను ఎడతెరిపిలేకుండా 'అలరిస్తున్న' సనాతన ధర్మో పాసకుల ప్రవచ నాలను కాసేపు పక్కన పెట్టి... ఈ ఐక్యరాజ్య సమితి తాజా సూచీ వెలుగులో ప్రపంచాన్ని ఒక్కసారి తేరిపారచూస్తే... అసలు తిండే దొరకని అన్నార్తుల ఆక్రందనలు మనలను కలవరపెడుతాయి. భయంకరమైన సంక్షోభాల ఊబిలో కూరుకుపోతున్న మానవాళి మనల్ని ఆందోళనకు గురిచేస్తుంది.

ఆయుధాలు ఎంత విధ్వంసం సృష్టించగలవో, అవి ఎంత కనికరం లేనివో మనం కండ్లారా చూస్తున్నాం. అంతకుమించి వాటి బేహారులు ఎంతనీచంగా నిప్పు చల్లారకుండా ఎగదోస్తున్నారో కూడా గమనిస్తూనే ఉన్నాం. వీరి నైచ్యానికి పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాల నుంచి పచ్చటి పొలాలు, నదులు, విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమల దాకా సర్వం నేలమట్టం అవుతున్నాయి. ఈ కారణంగా తలెత్తే ఆహార సంక్షోభం రాబోవు తరాలను సైతం ఆకలి కోరలకు బలిచేయనుంది.



మనుషులు అన్నపానీయాల కోసం అలమటించిన కాలమొకటి గతంలో ఉండేదంటే సరిపెట్టుకోవచ్చు. కానీ నేటి ఆధునికయుగంలో సైతం ఇది కొనసాగుతుండటం సహించలేనిది. ఎందుకంటే.. ప్రపంచంలో ఇప్పటికే ఏటా కొన్ని వేల ట్రిలియన్ డాలర్ల సంపద ఉత్పత్తి అయి చలామణిలో ఉంటోంది. అది ప్రపంచ జనాభా మొత్తం కాలుమీద కాలేసుకుని తిన్నా కొన్ని వందల సంవత్సరాలకు సరిపోతుంది. అసలీ ఉన్న సంపదను వాడుకోకుండానే, అది ఏటా ఉత్పత్తి చేసే అదనపు సంపదే ప్రపంచ జనాభాకు కడుపునిండా అన్నం పెడుతుంది. అయినా నేడు సగం ప్రపంచం అర్ధాకలితో అలమటిస్తోంది. నూటా పదికోట్లమంది దారుణమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఎందుకు? సంపద పంపిణీలో అంతులేని దోపిడీ, ఫలితంగా నెలకొన్న తీవ్రమైన అసమానతలు అనాదిగా వెంటాడుతుండగా.. వాటికి తోడు యుద్ధాల ఫలితంగా తలెత్తే ఆహార సంక్షోభాలు ఈ ఆకలికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో రోజుకు సుమారు ఇరవైయ్యొక్క వేలమంది చొప్పున ఆకలికి తాళలేక ప్రాణాలు కోల్పోతున్నారన్న ఆక్స్‌ఫామ్ నివేదిక ఇందుకో తిరుగులేని ఉదాహరణ.

నేడు ఇజ్రాయిల్, పాలస్తీనా వైపు చూస్తే ఏం కనిపిస్తోంది? రావణకాష్టంలా మండుతున్న మారణహోమంలో ఆయుధాలకంటే ఆకలికి బలవుతున్న వారే ఎక్కువ. ఇందులో మూడోవంతు మంది ముక్కుపచ్చలారని పసిపిల్లలు, మహిళలే. బాంబుల మోతల్లో అట్టుడికిపోతున్న గాజాలో అయిదు లక్షల మందికి ఆహారం అందడం లేదు. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా తీవ్రమైన ఆకలిచావులు సంభవించే ప్రమా దం పొంచివుందని పలు మానవతావాద సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే అక్కడ సుమారు ఏడున్నర లక్షల మంది ఆహారం కోసం అల్లాడుతున్నారు. ఇక ఉక్రెయిన్‌లో జరుగుతున్నదేమిటి? యుద్ధంలో అటూ ఇటూ మాటిమాటికీ చేతులు మారుతున్న ఆధిపత్యంలో ప్రతి ఊరూ, ప్రతి నగరం నేలమట్టమయ్యాకే వీరికైనా, వారికైనా స్వాధీనం అవుతోంది. వైరిపక్షాలు ఆహారాన్నీ, తాగునీటినీ, ఇంధనాన్నీ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఫలితంగా బాధిత ప్రజలు ఆకలికి విలవిలలాడు తున్నారు. యుద్ధభూమి నుండి వలసబాటలో సాగుతున్న లక్షలాది ప్రజలు కూడా ఆకలిచావులకే బలవుతున్నారు. ఇది ప్రత్యక్షంగా ఆయా దేశాల ప్రజలనే కాదు.. పరోక్షంగా మొత్తం ప్రపంచ దేశాల ప్రజలనూ ప్రభావితం చేస్తుంది. అందుకే ఇప్పుడు ఆకలి విశ్వమంతటా విలయతాండవం చేస్తున్నది.

ఆయుధాలు ఎంత విధ్వంసం సృష్టించగలవో, అవి ఎంత కనికరం లేనివో మనం కండ్లారా చూస్తున్నాం. అంతకుమించి వాటి బేహారులు ఎంతనీచంగా నిప్పు చల్లారకుండా ఎగదోస్తున్నారో కూడా గమనిస్తూనే ఉన్నాం. వీరి నైచ్యానికి పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాల నుంచి పచ్చటి పొలాలు, నదులు, విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమల దాకా సర్వం నేలమట్టం అవుతున్నాయి. ఈ కారణంగా తలెత్తే ఆహార సంక్షోభం రాబోవు తరాలను సైతం ఆకలి కోరలకు బలిచేయనుంది. చివరికి ఇదెక్కడికి దారితీస్తుంది? మానవజాతి మొత్తాన్ని ఈ నేల నుంచి తుడిచి పెట్టేస్తుందా? బతకడానికే పనికిరానిదిగా ఈ భూమండలం రూపురేఖల్ని మార్చేస్తుందా? స్టీఫెన్ హాకింగ్ చెప్పినట్టు కుబేరులంతా కలిసి పచ్చటి భూమిని చెత్తకుండీగా మార్చేసి, గ్రహాంతరాలకు ఉడాయించేస్తారా? అదే జరిగితే ఈ మానవజాతి సుదీర్ఘ నాగరికతా వికాసం ఏం సాధించినట్టు? "గతమంతా తడిచె రక్తమున కాకుంటే కన్నీళ్లతో" అన్నాడు శ్రీశ్రీ. కానీ వర్తమానమూ అందుకు భిన్నంగా లేకపోవడం కడు విషాదం. ఇదిలాగే కొనసాగితే.. 2030 నాటికి ఆకలన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని ఈ ప్రపంచం ఎలా సాధించగలదు?

ఎవరి ప్రయోజనాలకు ఈ ప్రాజెక్టులు...ప్రజలకెందుకీ అగచాట్లు?



ఎస్. వీరయ్య

రాష్ట్ర రాజకీయాలు మూసీ సుందరీకరణ, హైడ్రాల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రభుత్వం మడమ తిప్పేది లేదంటున్నది. సాధారణ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ చర్యలను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. సమస్య పూర్వాపరాలతో పాటు ఎవరి బాధ్యత ఎంతో కూడా బేరీజు వేయాలి. సరైన పరిష్కారాలు వెతకాలి. ఇప్పుడు జరుగుతున్నది ఇందుకు పూర్తిగా భిన్నం. పాలకులు తాము చేయదలచుకున్నదేమిటో సూటిగా చెప్పడం లేదు. ఒకవైపు బీజేపీ, మరోవైపు బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి. వేలాది ప్రజలు మాత్రం తీవ్ర ఆందోళనతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మూసీ నదిపైన ప్రభుత్వం చేయదలచిన చర్యల గురించి మీడియాలో రకరకాల ఊహాగానాలు నడిచాయి. సుందరీకరణ, ప్రక్షాళన, వరదల నుంచి పేదలను కాపాడటం, పర్యాటక కేంద్రంగా మార్చటం వంటి మాటలు ఈ చర్చల్లో వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం తలపెట్టింది మూసీ సుందరీకరణ కాదని, అది పునరుద్ధరణ అని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. సంపూర్ణ ప్రక్షాళన తప్పదని చెప్పారు. ఈ విషయంలో అన్ని పార్టీలు సలహాలు ఇవ్వవచ్చని, తమ సందేహాలను రాతపూర్వకంగా పంపాలని కోరారు. ఈ పద్ధతి అప్రజాస్వామికం. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. దాని అమలుకు సంబంధించిన సలహాలు మాత్రమే అడుగుతున్నది. పైగా చర్చలు కాకుండా పార్టీలు పంపే రాతపూర్వక సందేహాలకు తాము రాతపూర్వక సమాధానాలిస్తామని అంటున్నది. ఇది ఏకపక్ష ధోరణి. ఇతర పార్టీలు తమ ప్రణాళికలను ప్రభుత్వానికి అందజేయాలనటం హాస్యాస్పదం. ప్రాజెక్టులు రూపొందించడం, అమలు జరుపడం పాలకుల పని. తాము తలపెట్టిన ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రణాళిక తదితర అంశాలతో కూడిన సమగ్రమైన ప్రతిపాదనను ప్రతిపక్ష పార్టీలు, మేధావుల ముందుంచి అభిప్రాయాలను ఆహ్వానించడం ప్రభుత్వ బాధ్యత. ఇప్పటికైనా అలాంటి ప్రతిపాదనలను అన్ని పార్టీలకు అందజేసి, అధ్యయనానికి తగు సమయమిచ్చి అఖిలపక్ష సమావేశం పిలువటం అవసరం.

ప్రభుత్వం చేయాల్సింది ఇది!

మూసీ వరద నీటిలో మునిగిపోయే పేద కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. మూసీ మధ్యలో గానీ, ముంపు ప్రాంతంలో గానీ పేదలు ఇండ్లు నిర్మించుకోవడం అంటే మరో దిక్కులేకనే. గృహవసతి కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యం వల్లనే మూసీ మురుగు వాసన కూడా భరిస్తూ జీవిస్తున్నారు. ఇలాంటివారికి మూసీ పరిసరాల్లోనే ఇండ్లు నిర్మించి ఆదుకోవాలి. కానీ ప్రభుత్వం చేస్తున్న పని ఇది కాదు. సుమారు పన్నెండు వేల ఇండ్లను ఖాళీ చేయించి నగర శివారు ప్రాంతాలకు తరలిస్తామని అంటున్నారు. మూసీ పూర్తిస్థాయిలో ప్రవహించినపుడు కూడా ఈ ప్రాంతాలు ముంపునకు గురికాలేదు. అలాంటి ప్రాంతాలు ఖాళీ చేయించ వల్సిన అవసరం ఏమిటి? ఇప్పటికే రెవెన్యూ శాఖ ఇండ్లు కూల్చివేసేందుకు సరిహద్దులను కూడా నిర్ణయించింది. సహజంగానే ఈ ప్రజలంతా నిద్రలేని రాత్రులు గడపవలసి వస్తున్నది. ఇప్పుడు ప్రభుత్వం అడుగులు వేస్తున్న తీరును చూస్తే మూసీలో ముంపునకు గురయ్యే పేద కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో కాదనీ, ఈ చర్యల వెనక ఇంకేవో ప్రయోజనాలు దాగున్నాయని భావించవలసి వస్తున్నది. సుందరీకరణకు కూడా ఈ ఇండ్లన్నీ తొలగించవలసిన అవసరమే లేదు. మూసీ పొడవునా రిటైనింగ్ వాల్ నిర్మించి గట్లమీద ఏపుగా ఎదిగే వృక్షజాతులను నాటవచ్చు. మూసీ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో కూడా వృక్షాలు పెంచడంతో పాటు చిన్నచిన్న పార్కులు ఏర్పాటు చేయవచ్చు. వీటివల్ల మూసీ సుందరీకరణ, పరిరక్షణతో పాటు నగర పర్యావరణం కూడా మెరుగుపడుతుంది. విరామ సమయంలో పిల్లలు, వృద్ధులు, ఇతర ప్రజలు సేదదీరడానికి కూడా ఈ పార్కులు తోడ్పడతాయి. కానీ ప్రభుత్వం దృష్టి ఈవైపు లేదు. ప్రక్షాళన అనే మాట కూడా వినబడుతున్నది. ఇది తక్షణం ప్రభుత్వం చేయవలసిన పని. ఈ సమస్యతో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, హైద్రాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట వరకూ ఏడు జిల్లాల ప్రజలు సతమతమవుతున్నారు. జంటనగరాల డ్రైనేజీతో పాటు రసాయనాలతో కూడిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తున్నాయి. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఇది సమస్యగా తయారైంది. ఘట్‌కేసర్ నుంచి సూర్యాపేట వరకు ఈ నీటినే వ్యవసాయానికి, పశుపోషణకు కూడా వాడుతున్నారు. ఈ నీటితో పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులు, పాలు, పాల ఉత్పత్తులు ప్రజలు వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. కాలుష్య నియంత్రణ కోసం పరిశ్రమలు, సివరేజ్ ప్లాంట్లు నిర్మించి తగు చర్యలు తీసుకోవాలని చట్టం ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావటం లేదు. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు తగినన్ని ఏర్పాటు చేసినప్పటికీ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి మాత్రమే అది సరిపోతుంది. నీటిలో రసాయనాలను పూర్తిగా తొలగించదు. ఇలాంటి నీరు మనుషులు, పశువులు తాగడానికి గానీ, వ్యవసాయానికి గానీ వినియోగించడం సాధ్యం కాదు. అందువల్ల మూసీ నీటిని సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా ప్రక్షాళన చేసి నేరుగా కృష్ణాలోకి పంపించాలి. వ్యవసాయానికి, తాగునీటి సౌకర్యం కోసం కృష్ణా, గోదావరి జలాలను అందుబాటులోకి తేవాలి. ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇందుకోసం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వం నెలరోజుల పాటు విస్తృతంగా పాదయాత్ర కూడా చేసింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రక్షాళనకు పూనుకోవాలి. మూసీ నదిని ఆనుకుని ఉన్న జిల్లాల ప్రజల సమస్యలకు ఇది మాత్రమే సరైన పరిష్కారం. కానీ ప్రజల దృష్టిని ఆకర్షించటం కోసం మాత్రమే ప్రక్షాళన అనే మాట ప్రభుత్వం వాడుతున్నది. ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టులో నాలుగు జిల్లాలను మాత్రమే ప్రస్తావిస్తున్నది. మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలిస్తే ఈ ప్రాజెక్టు కేవలం వ్యాపార ప్రయోజనాలకు తప్ప ప్రజా ప్రయోజనాలకు కాదు. మూసీ నదిలోకి గోదావరి జలాలు తెచ్చి పడవలు నడపడానికి వీలైన స్థాయిలో నీటి ప్రవా హాన్ని నిలపాలని నిర్ణయించింది. మూసీ పరిసరాల్లోని ఇండ్లు తొలగించి హోటళ్లు, లాడ్జీలు, వాణిజ్య సంస్థలకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా రూపొందించాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇది నిజం కాకపోతే వాస్తవ ప్రతిపాదన ఏమిటో వెంటనే అఖిలపక్షం ముందుంచాలి. ఆ పని చేయకుండా మీడియా మీద కూడా నిందలు వేయడం తగదు. ప్రజా ప్రయోజనం రీత్యా చూసినా, ప్రాధాన్యతల రీత్యా చూసినా ఈ ప్రాజెక్టు అవసరం లేదు. పర్యావరణ నిపుణులతోనూ, మేధావులతోనూ, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతోనూ విస్తృత సంప్రదింపుల ద్వారా సరైన నిర్ణయానికి రావాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చేసిన తప్పు నేటి ప్రభుత్వం మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టు పేరుతో చేయవద్దు.



వ్యవసాయానికి, తాగునీటి సౌకర్యం కోసం కృష్ణా, గోదావరి జలాలను అందుబాటులోకి తేవాలి. ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇందుకోసం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వం నెలరోజుల పాటు విస్తృతంగా పాదయాత్ర కూడా చేసింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రక్షాళనకు పూనుకోవాలి. మూసీ నదిని ఆనుకుని ఉన్న జిల్లాల ప్రజల సమస్యలకు ఇది మాత్రమే సరైన పరిష్కారం. కానీ ప్రజల దృష్టిని ఆకర్షించటం కోసం మాత్రమే ప్రక్షాళన అనే మాట ప్రభుత్వం వాడుతున్నది. ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టులో నాలుగు జిల్లాలను మాత్రమే ప్రస్తావిస్తున్నది. మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలిస్తే ఈ ప్రాజెక్టు కేవలం వ్యాపార ప్రయోజనాలకు తప్ప ప్రజా ప్రయోజనాలకు కాదు.

మూసీ వరద నీటిలో మునిగిపోయే పేద కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. మూసీ మధ్యలో గానీ, ముంపు ప్రాంతంలో గానీ పేదలు ఇండ్లు నిర్మించుకోవడం అంటే మరో దిక్కులేకనే. గృహవసతి కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యం వల్లనే మూసీ మురుగు వాసన కూడా భరిస్తూ జీవిస్తున్నారు. ఇలాంటివారికి మూసీ పరిసరాల్లోనే ఇండ్లు నిర్మించి ఆదుకోవాలి. కానీ ప్రభుత్వం చేస్తున్న పని ఇది కాదు. సుమారు పన్నెండు వేల ఇండ్లను ఖాళీ చేయించి నగర శివారు ప్రాంతాలకు తరలిస్తా మని అంటున్నారు. మూసీ పూర్తిస్థాయిలో ప్రవహించినపుడు కూడా ఈ ప్రాంతాలు ముంపునకు గురికాలేదు. అలాంటి ప్రాంతాలు ఖాళీ చేయించవల్సిన అవసరం ఏమిటి?

రొచ్చుకుంటలో చేపలు పడుతున్న బీజేపీ ఉచ్చులో పడొద్దు

మూసీ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెపుతున్న బీఆర్ఎస్ నాయకత్వం తాము అధికారంలో ఉన్నప్పుడే దీన్ని ఎజెండా మీదకి తెచ్చింది. ఇంతలో ప్రభుత్వం మారింది. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇంకొక మాటతగదు. రాజకీయ పార్టీలు ప్రజా ప్రయోజనాల ప్రాతిపదికగా పరిష్కారాలు వెతకాలి. మరోవైపు ఈ సమస్యను బీజేపీ తమ స్వార్థరాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది. మూసీ ప్రక్షాళన, పర్యావరణ పరిరక్షణ, ఈ ఏడు జిల్లాల ప్రజల ప్రయోజనాల పట్ల బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. గంగానదీ జలాల ప్రక్షాళన కోసం కేంద్రంలో మోడీ ప్రభుత్వం రూ.37,750 కోట్లు కేటాయించింది. మూసీ నది విషయం మాత్రం కేంద్ర బీజేపీ సర్కారుకు పట్టదు. తెలంగాణ కూడా భారతదేశంలో భాగమే కదా. ఈ ఏడు జిల్లాల ప్రజలు కూడా భారతీయులే కదా. వీరు కూడా మనుషులే కదా. అయినా మూసీ ప్రక్షాళన గురించి కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇక్కడ మూసీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పక్షపాత ధోరణి గురించి మాత్రం నోరు విప్పరు. రాష్ట్ర ప్రజలు బీజేపీని ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో, మరో ఎనిమిది శాసనసభ స్థానాల్లో గెలిపించారు. కేంద్రంలో వారి ప్రభుత్వమే ఉన్నది. ఈ ఏడు జిల్లాల ప్రజల సమస్యకు సరైన పరిష్కారం చూపి కేంద్రం నుంచి నిధులు తేవలసిన బాధ్యత బీజేపీ నాయకత్వం మీద ఉన్నది. అందుకు భిన్నంగా ఈ సమస్యను రాజకీయం చేసి వాడుకునేందుకు మాత్రమే ప్రయత్నిస్తున్నది. సున్నితమైన ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గమనంలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఇందుకోసం మూసీతో సంబంధం ఉన్న ఈ ఏడు జిల్లాల ప్రజలు సమైక్యంగా కదలాలి. ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. బాధిత పేద, మధ్యతరగతి ప్రజలకు ఐక్య పోరాటం తప్ప మరో మార్గం లేదు. 'అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు' అన్నది ఎంత నిజమో పోరాడకుండా పాలకులు ప్రజలవైపు చూడరు అన్నది కూడా అంతే నిజం. అందుకే ప్రజలు ఐక్యంగా కదలాలి.

ప్రాణధార మందులూ.. ఇక భారమే!

ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైన ఔషధాల ధరలు సైతం చుక్కలను దాటి పరుగులు తీస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 800 రకాల ముఖ్యమైన ఔషధాలను ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రతి ఏడాది చోటుచేసుకునే సాధారణ పెంపుగానే దీన్ని అప్పట్లో సమర్థించుకున్న ప్రభుత్వం తాజాగా ఎనిమిది రకాల ఔషధాల ధరలను ఏకంగా 50 శాతం పెంచడానికి అనుమతించింది. ఉబ్బసం, గ్లుకోమా, తలసేమియా, క్షయతో పాటు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడేవారికి అవసరమైన మందులు ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో దిక్కుతోచక సతమతమౌతున్న దేశ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం శరాఘాతంగా మారనుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలో 1997లో ఏర్పాటైన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పి.పి.ఎ) సాంకేతికంగా ఔషధాల ధరలను నియంత్రిస్తుంది. 'దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల రీత్యా..ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనివార్య పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్టు' ధరల పెంపునకు అనుమతిస్తూ ఆ సంస్థ



చేసిన ప్రకటన హాస్యాస్పదం! ఉత్పత్తి వ్యయం పెరగడం, ధరల నియంత్రణ చర్యల కారణంగా ఔషధాలను ఉత్పత్తి చేయడం అసాధ్యంగా మారిందంటూ తయారీదారులు భీష్మించుకు కూర్చోవడమే ఎన్.పి.పి.ఎ చెప్పిన 'అసాధారణ పరిస్థితి'! ఔషధాలను అందుబాటులో ఉంచడానికి ధరలను పెంచడానికి అనుమతివ్వడమే 'ప్రజా ప్రయోజనం'. ఇంతకన్నా అడ్డగోలు వాదన మరోటి ఉంటుందా?

1997లో ఎన్.పి.పి.ఎ ఏర్పాటైన తరువాత నుండి ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ధరలను సమీక్షించి పెంపునకూ అనుమతిస్తూనే ఉంది. దీనికోసం ఔషధాలను ప్రభుత్వం షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ తరగతులుగా విభజించింది. ముఖ్యమైన ఔషధాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చారు. టోకు ధరల సూచిక ఆధారంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం వీటి ఎగువ సీలింగ్ ధరను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఈ జాబితాలో 384 ఔషధాలు, నాలుగు వైద్య పరికరాలు ఉన్నాయి. నాన్ షెడ్యూల్డ్ ఔషధాల ధరలను తయారీదారులే కొన్ని నిబంధనలకు లోబడి నిర్ణయించుకోవచ్చు. షెడ్యూల్డ్ ఔషధాల ధరలను నిర్దేశించిన ప్రమాణాల కన్నా ఎక్కువగా పెంచాలని తయారీదారులు అడిగిందే తడవుగా కేంద్రం తలూపింది. ఎన్.పి.పి.ఎ కున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి మరీ ఔషధ తయారీ కంపెనీలకు మేలుచేసింది. ఇలా ఉత్పత్తి దారుల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం తలగ్గడం ఇదే మొదటిసారి కాదు. 2019లోనూ, 2021లోనూ ఆర్థిక సంవత్సరాల మధ్యలో ఈ తరహా నిర్ణయాలనే తీసుకుంది.గత నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ హెల్త్ అకౌంట్స్ నివేదిక ప్రకారం ఆరోగ్యంపై పెడుతున్న ఖర్చులో మూడో వంతు మందులకు అవుతోందని ఆ నివేదిక పేర్కొంది. ఇన్సూర్ టెక్ ప్లమ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో మన దేశంలో వైద్య ద్రవ్యోల్బణం 14 శాతానికి చేరింది. సరైన చర్యలు తీసుకోకపోతే ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని ఆ సంస్థ హెచ్చరించింది.

ఆన్‌లైన్ బీమా సంస్థ 'పాలసీ బజార్' గణాంకాల ప్రకారం 2019లో 17,900 రూపాయలుగా ఉన్న వార్షిక ఆరోగ్య బీమా పాలసీ ధర ఈ ఏడాది 26,533 రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణం ఔషధాల ధరల్లో భారీ పెరుగుదల చోటు చేసుకోవడమేనని ఆ సంస్థ తెలిపింది. పెరుగుతున్న ఔషధాల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్న తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డి.పి.సి.ఓ) 1979 ప్రకారం ముఖ్యమైన ఔషధాల ధరలను ప్రభుత్వం నియంత్రించేది. నాణ్యమైన, తక్కువ ధరలకు అవసరమైన మందులను ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగం బలంగా ఉండేది. ఆ పరిస్థితి ప్రస్తుతం మారింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చారు. రోగులు వినియోగదారులుగా మారారు. ప్రయివేటు రంగాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం వారి చేతిలో కీలుబొమ్మగా మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో అన్ని నియంత్రణలను ఎత్తివేసింది. కార్పొరేట్, బహుళజాతి ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యానికి ఔషధ రంగాన్ని వదిలివేసింది. ఫలితం ఏడాదికేడాదికి పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్టుగా సామాన్యుల స్థితి తయారవుతోంది. పేదల మూలుగులు పీల్చి కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఆ విధానాలను ప్రతిఘటించడమే ఈ సమస్యకు పరిష్కారం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కల నెరవేరేదాకా 'పాట' ఆగదు

ఆ ఇద్దరూ చింతనాపరులు ప్రకృతిని, పాటను ప్రేమించారు.

రాజ్యాన్ని, రాజ్యహింసను నిరసించిన వాళ్లే.. దొరలను దొర గడీలను ఎదిరించిన వాళ్లే.. జన్మంతా జనం కోసం పరితపించిన వాళ్లే.. వాళ్లను ప్రజల నుంచి దూరం చేసేందుకు జైలు గోడలు మొలిచాయి. పాటల పరుగుకు పగ్గాలు వేసినా.. సంకెళ్లు తొడిగినా... జైలు గోడలు మాకడ్డుకాదని నిరూపించిన నికార్సైన ప్రజా కళాకారులు కామ్రేడ్ సుద్దాల హనుమంతు, అరుణోదయ నాగన్న.

వారి పాటలను, వాళ్ల జీవితాలను, ఈ సమాజంతో సంభాషిస్తున్నారు. మాటలను ఆపవచ్చు కానీ.. పాటను ఆపగలరా? అని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో పాట ఒక ఆయుధం, దాన్ని ఆపడం ఎవరికీ సాధ్యం కాదు. మనం ఇప్పుడు వాళ్ల గొంతుకను విందాం! వాళ్ళ కవనముతో కరచాలనం చేద్దాం! కవి, కళాకారుడు, రచయిత జీవించే రచించే స్వేచ్ఛ కోసం ఉద్యమించాల్సిన నేటి ఈ తరుణంలో....

"చీకటి రోజుల్లో ...గానాలు ఉండవా..?

ఉండకేం.. చీకటి రోజుల గురించే గానాలు" అన్న బ్రెక్ట్ మాటలు రుజువు పరిచిన వాళ్లు విప్లవాన్నే కలగని, విప్లవాన్నే గానం చేసిన వారు చావు అంచుకుపోయినా పాటను ప్రాణంగా బతికినవారు విప్లవ సాంస్కృతిక రథానికి కాడెడ్లయి కదం తొక్కిన వారు, విప్లవనావకు చుక్కానై సాంస్కృతిక సైనికులుగా సాగుతున్న వారు, విప్లవం ఎంత సున్నితమైందో, ఎంతో సహజమైందో, ఎంత అనివార్యమైందో.. అనుభవించినవారు. విప్లవ ప్రతిఘాతకులు ఎంతటికైనా తెగిస్తారని ముందే గ్రహించిన వారు వాళ్లకు తగిలిన గాయాలే.. గేయాలై, పల్లవులై ప్రజల్లో నేటికీ పాటలై ప్రతిధ్వనిస్తున్నాయి.

వాళ్ల జీవితం "ముండ్లకంపపై ఆరేసుకున్న అంగవస్త్రం లాంటి అనుభవ పుటలను కదిపితే.. ప్రజాపాటల పరిమళాలు కోకొల్లలుగా వెదజల్లుతాయి, ఎదలను ఆకర్షిస్తాయి. వలల్లోంచి, మగ్గాల్లోంచి, సుత్తి కొడవళ్ల నుంచి, నాగేటి చాళ్ల



భూపతి వెంకటేశ్వర్లు
9490098343

నుంచి, మూల మూలల్లోంచి, అణచివేతల్లోంచి ఆర్తితో.. ఆత్మీయంగా పొంగి వచ్చే పాల బుగ్గల తడి, ఆరని పల్లె భాషతో గుండె ఘోషను వినిపిస్తున్నాయి. అందుకే వాళ్ల ప్రజాపాటలకు సంతకమయ్యారు. మరణము లేని పాటలు నేటికీ ప్రజల నోళ్లల్లో నానుతూనే ఉన్నాయి. తన పాటల వారసత్వాన్ని నేటికీ కొద్ది మంది అయినా కొనసాగిస్తున్నారు. అందులో నాగన్న ఒకరు.

ప్రజా పాటల యుద్ధంలా.. సుద్దాల హనుమంతు వారసుడిగా.. పాలబుగ్గల జీతగాడుగా.. అరుణోదయ నాగన్న చిన్ననాటి నుండే వారి పాటలు వింటూ పెరిగాడు. సుద్దాల హను మంతు ఎన్ని కళలలో ఆరితేరిన వారో... అన్ని కళలను నాగన్న కూడా అబ్బినాయి. బుర్రకథ, యక్షగానాలు, పల్లెసుద్దులు, వీధి నాటకాలను విరివిగా ప్రదర్శించారు. చిన్ననాటి నుండి కళల మీద ప్రీతి, పేదరికపు బాధ, పుట్టింది నిరుపేద గీత కార్మిక కుటుంబం, తాతల నాటి నుండి కల్లుగీత వృత్తి, వ్యవసాయకూలి తప్ప సంపాదించిన ఆస్తులు లేవు. లక్ష్మమ్మ, పాపయ్యలకు పరకాల నాగయ్య జన్మించాడు. చిన్ననాటి నుండే చిల్లిగవ్వ లేదు. రెండు రెక్కలు, రెండు మేకల్ని మేపుకుంటూ.. తాడి చెట్లెక్కుతూ..పొట్టనింపుకునే జీవితం.

ఆ సమయంలోనే ఆకాశంలో సగానువ్వు సగం నేను అన్నట్లుగా లక్ష్మితో నాగన్న వివాహం జరిగింది. కొడుకు అజయ్, పాటమ్మ ఒడిలోనే పెరిగాడు. ప్రజలే పాలుపట్టారు. ప్రజలే పెంచి పెద్ద చేశారు. నిరంతరం సభలు, సమావేశాలు, వెంటాడే పోలీసుల భయంబడిలో బలికాడు.



నాగన్న ఎప్పుడూ బడికి పోయి చదువుకున్నది లేదు. తండ్రి భాగోతం కళాకారుడు. పాటల వారసత్వం నాగన్న, లక్ష్మి ఇరువురు చరణమైతే.. పల్లవిగా అజయ్ ముగ్గురు జనం పాటలను పల్లవిస్తూ.. కలవరించేవారు. పార్టీ కోసం, ప్రజల కోసం తప్పా చింతన లేని చిన్నకుటీరం. నేటికీ గ్రామ పునాదుల్లో కులం పునాదులు బలంగా ఉన్న ఊరు. ఆది రెడ్డీ, దొరల ఆధిపత్యం. గౌండ్లోలు కూడా రెడ్ల పక్కన బంతి భోజనాలు కలిసి చేస్తారా! అంటూ కన్నెర చేసి, గళ్ళాపట్టి, బంతి భోజనం నుండి బజారుకీడ్చుండు. ఆ సంఘటన సలసల మసిలే కసితో.. కండ్లెర్రజేసిండు. అప్పుడే.. ఎర్రజెండా రెపరెపలు తన గుండెకు హత్తుకున్నాయి. ఆ జెండా నీడలోనే.. కంఠానికి పదును పెట్టుకున్నాడు. కంఠానికి తన రాగానికి ఎక్కడో .. ఏదో చైతన్యం తగిలి భగ్గున మండినట్లనిపించింది అప్పుడే.. నాగన్న నీ గొంతులో గోదారిలోయ పాటలతో పసిపాపలను సైతం ఊయల లూగించింది.

కూలికి పోయిన చోటల్లా తన పాటకు తోటి కూలీలే కోరస్ ఇచ్చే వాళ్లు. ఇలా కోరస్ ఇచ్చిన కూలీలే కొడవళ్లు పట్టుకొని పోరు నడిపిన సంఘటనలు చూసినప్పుడు పాటకుండే పవర్ తెలిసింది. ఆ పాటనే ఆయుధంగా మలుచుకున్నాడు. ఆ పాటలను రాజ్యం వెంటాడింది. పోలీసుల నిఘా.. కనబడితే కాల్చివేతలు, అప్పుడు నాగన్నమీద నిషేధం, పాట మీద నిషేధం, అడుగడుగున నిర్బంధం, దుష్ప్రచారం, ఏమాత్రం పొసగని గాలి వాదనలు, కల్పిత ఆధారాలతో ప్రజా గొంతులను పగబట్టడం నాటి నుండి నేటి వరకు జరుగుతున్నవే.. ఇన్ని గాయాలను గొంతులో మోస్తున్న కవి, గాయకుడు నాగన్నను చూసినప్పుడు 'పాట కోసం ఉరికంబాన్ని ముద్దాడిన కెన్సారోవివా'లా కనిపిస్తాడు. ఒక యోగిలా.. విరాగిలా.. సాధువులా.. సమర యోధునిలా.. బతకడం ఎందరికీ సాధ్యమవుతుంది? వీటన్నింటినీ భూషణంలా ధరించిన నిర్వేశపు నిత్యఅన్వేషి అరుణోదయ నాగన్న. కమ్యూనిజానికి కంఠాన్ని ధారబోసినవాడు, అవమానాలను అవార్డుగా స్వీకరించినవాడు, అమరుల త్యాగాన్ని కర్ణభేరిలో కరగబోసినవాడు, గోదారిలోయను గొంతులు ఒంపుకున్నవాడు, అన్నిరకాల ఆధిపత్యాలను ప్రశ్నిస్తున్నవాడు. సమ సమాజాన్ని స్వప్నిస్తున్నవాడు, కంపగూటిలో కాకిలా బతుకుతూ.. కోకిల గొంతును ఆవిష్కరించిన వారు. నూతన లోకాన్ని నిరంతరం ఆలపిస్తున్న వాడు, నాగన్న జీవితం ఒక పాటతోనో, ఒక పార్శ్యాంశంతోనో కొలువలేము. అతనిది ఒక సుదీర్ఘ పోరాట చరిత్ర. అతని నిరాడంబరత, నిబద్ధత, ఆచరణాత్మకత ఈ తరం సామాజిక విప్లవకారులకు ఆదర్శం.

ఒక యోగిలా.. విరాగిలా.. సాధువులా.. సమరయోధునిలా.. బతకడం ఎందరికీ సాధ్యమవుతుంది? వీటన్నింటినీ భూషణంలా ధరించిన నిర్వేశపు నిత్యఅన్వేషి అరుణోదయ నాగన్న. కమ్యూనిజానికి కంఠాన్ని ధారబోసినవాడు, అవమానాలను అవార్డుగా స్వీకరించినవాడు, అమరుల త్యాగాన్ని కర్ణభేరిలో కరగబోసినవాడు, గోదారిలోయను గొంతులు ఒంపుకున్నవాడు, అన్నిరకాల ఆధిపత్యాలను ప్రశ్నిస్తున్నవాడు.

నాగన్నను ఎప్పుడు కదిలించినా...
నా రోజులు వస్తాయి,
నా కన్నీళ్లు ఇంద్రధనస్సులవుతాయి
నాజ్ఞాపకాలే చరిత్ర లవుతాయి
మా బాధలే ప్రజల గాథలావుతాయి

అన్న భరోసాతోనే బతుకుతున్నాడు. ఒక రోజు అర్ధరాత్రి తానున్న తాటికమ్మల గుడిసెను సైతం కూల్చేసినా.. గుట్టుచప్పుడు కాకుండా గూడెం గుండెలోనే నేటికీ తలదాచుకుంటున్నాడు తప్ప సర్కారుకు సాగిలపడి డబుల్ బెడ్ రూమ్ అడగలేదు. చీకట్లను చీల్చుకొని వెలుగులోకి వచ్చిన పార్టీ బలహీనపడినా నమ్ముకున్న సైద్ధాంతిక స్థైర్యం, ఉద్యమ నిమగ్నత, అమరుల ఆశయాల కోసం యావత్తు జీవితాన్ని త్యాగం చేసిన సాంస్కృతిక సేనాని.

ఆటపాటలతోనే .. విశాల సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన తరుణంలో.. సుద్దాల హనుమంతు జానకమ్మల జాతీయ పురస్కారం అందుకోవడం నాకు గొప్ప సందర్భంగా భావిస్తున్నాననీ, సలాంలు కొట్టే సర్కార్ అవార్డు కాదిది..! ప్రజాయుద్ధ కవి సుద్దాల హనుమంతు అవార్డు అంటే "నా తండ్రులే ఎదిరించిన నాటి శత్రువే నేటికీ నీచంగా హీనంగా పీల్చిపిప్పి చేస్తుంటే" ఆ వీర తెలంగాణ వారసత్వాన్ని పుణికి పుచ్చుకోవడమేనని అన్నారు..

ప్రజాపాటలే ప్రజా చైతన్యానికి ఆచరణకు గీటురాయి. నియంతృత్వానికి ఏకైక సమాధానం కళా కారులంతా కలిసి నడవడమే ఇప్పుడు సరైన సమయం. సుద్దాల హనుమంతుకిచ్చే నిజమైన నివాళి.

(నేడు సుద్దాల హనుమంతు, జానకమ్మల జాతీయ అవార్డు అరుణోదయ నాగన్నకు అందజేస్తున్న సందర్భంగా)



కేరళ కళాశాల ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ జయభేరి

- సీపీఐ(ఎం) అభినందనలు

తిరువనంతపురం : కేరళలోని పలు విశ్వవిద్యాలయాల పరిధిలో జరిగిన కళాశాల సంస్థాగత విద్యార్థి సంఘ గుర్తింపు ఎన్నికల్లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జయభేరి మోగించింది. కేరళలోని ప్రధాన విశ్వవిద్యాలయాలైన కన్నూరు వర్సిటీ, కాలికట్ వర్సిటీ, మహాత్మాగాంధీ వర్సిటీ, కేరళ వర్సిటీలన్నింటా కళాశాల గుర్తింపు సంఘ ఎన్నికల్లోనూ ఎస్ఎఫ్ఐ జయకేతనం ఎగురవేసింది. ఎస్ఎఫ్ఐ విజయం పట్ల సిపిఎం హర్షం వ్యక్తం చేసింది. విజేతలందరికీ అభినందనలు తెలిపింది. కన్నూర్ విశ్వవిద్యాలయం పరిధిలో కాసరగోడ్, కన్నూరు, వాయనాడ్ జిల్లాల్లోని 65 కళాశాల్లో ఎన్నికలు జరగగా ఎస్ఎఫ్ఐ 45 కాలేజీల్లో గెలుపొందింది. కన్నూరు వర్సిటీలో నిర్వహించిన రెండో విడత ఎన్నికల్లో ఐదు డిపార్ట్‌మెంటల్ కేంద్రాల్లోనూ ఎస్ఎఫ్ఐకే విద్యార్థులు పట్టం కట్టారు. కాలికట్ విశ్వవిద్యాలయంలో పరిధిలోనూ ఎస్ఎఫ్ఐ ఘన విజయం సాధించింది. ఈ వర్సిటీ పరిధిలో 171 కాలేజీల్లో ఎన్నికలు నిర్వహించగా 102 కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ విజయపతాక ఎగురవేసింది. వీటిలో 20 కాలేజీల్లో ఏకగ్రీవంగా విజయం సాధించింది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో 129 కళాశాల్లో 104 చోట్ల విద్యార్థులు ఎస్ఎఫ్ఐకి పట్టం కట్టారు. వీటిలో 62 కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కేరళ విశ్వవిద్యాలయంలోనూ ఎస్ఎఫ్ఐ తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ వర్సిటీ పరిధిలో 77 కాలేజీల్లో ఎన్నికలు జరగగా 64 చోట్ల ఎస్ఎఫ్ఐ పతాకం రెపరెపలాడింది. ఇదివరకే పాలిటెక్నిక్ కాలేజీ యూనియన్ ఎన్నికల్లోనూ, స్కూల్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎస్ఎఫ్ఐ జయభేరీ మోగించింది. చాలా కళాశాల్లో అన్ని గర్ల్స్ ప్యానెళ్లను ఎస్ఎఫ్ఐ సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. రాజ్యాంగ పదవిలో ఉండి కూడా ఎస్ఎఫ్ఐపై అపనిందలు మోపిన రాష్ట్ర గవర్నరుకు, అలాగే అసత్య కథనాలతో దుష్ప్రచారం సాగించిన బూర్జువా మీడియాకు విద్యార్థులు ఈ విజయం ద్వారా చెంప పెట్టులాంటి సమాధానమిచ్చారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా ఎస్ఎఫ్ఐ విజయానికి సీపీఐ(ఎం) అభినందించింది.

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు

- సలహాలు, సూచనలు, అభ్యంతరాలకు ఆహ్వానం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేసే విషయంలో అభ్యర్థనలు, సలహాలు, సూచనలు, అభ్యంతరాలను ఆహ్వానించాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లా కేంద్రాలలో బహిరంగ విచారణ నిర్వహించ డానికి సన్నాహాలు చేసింది. ఈ మేరకు కమిషన్ నోటిఫికేషన్ నెం. 2/457/2024ను శుక్రవారం విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ బీసీ కమిషన్ రాష్ట్ర పోర్టల్ www. telangana. gov. in లో కూడా అందుబాటులో ఉందని తెలియజేసింది. ఈనెల 28న ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి జిల్లాలో, నవంబర్ నెల ఒకటిన కరీంనగర్, 2న వరంగల్, 4న నల్లగొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ జిల్లాలలో సంబంధిత జిల్లాల కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బహిరంగ విచారణను నిర్వహించనుంది. అలాగే కమిషన్ కార్యాలయంలో నవంబర్ 11న ప్రత్యేకంగా సంస్థలు కుల, సంక్షేమ సంఘాల కోసం, 13న సాధారణ ప్రజల కోసం బహిరంగ విచారణను నిర్వహిస్తామని పేర్కొన్నది. ఇదిలా వుండగా ఈనెల 18 నుంచి నవంబరు13 వరకు వరకు వ్యక్తిగతంగా లేదా పోస్ట్ ద్వారా కమిషన్ కార్యాలయంలో కూడా తమ అభ్యర్థనలు ప్రత్యేక అధికారికి సమర్పించవచ్చని ప్రకటించింది. మరిన్ని వివరాల కోసం నోటిఫికేషన్ చూడాలనీ, సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలిపే ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషన్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళిపై అక్రమ కేసుకు ఫెడరేషన్ ఖండన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాక్షి దినపత్రిక సంపాదకులు వర్ధెల్లి మురళిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా కేసు బనాయించడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఖండించింది. 'పత్రికా స్వేచ్ఛపై రెడ్‌బుక్ పడగ' అనే వార్తా కథనంపై ఏపీ సర్కారుకు అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వడం లేదా వివరణ కోరే అవకాశం ఉందన్నారు. అలా కాకుండా ఏకంగా పోలీసు కేసు పెట్టడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం జర్నలిస్టులు, మీడియాను వేధించడమేనని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యలను సర్కార్ల దృష్టికి తీసుకురావడమే మీడియా బాధ్యత అని చెప్పారు. మీడియాను రాజ్యాంగం నాలుగో స్థంభంగా గుర్తించిన సంగతిని మరిచిపోవద్దన్నారు. వార్తాకథనం పట్ల ఏదైనా అభ్యంతరం ఉంటే ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అలా కాకుండా పోలీసు కేసులతో వేధించడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఎడిటర్ వర్ధెల్లి మురళిపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈ మేరకు ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి.ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈపీఎఫ్ డబ్బులు ఇప్పించండి : ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈపీఎఫ్ఓ కార్యాలయం నుంచి కార్మికులకు రావల్సిన బకాయిల చెల్లింపుల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సహకరించాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆర్టీసీ చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. పీఎఫ్ పెన్షన్‌లో 1996-2014 మధ్య కాలంలో మొత్తం జీతాల పైన ఎంప్లాయిస్ పెన్షన్ స్కీంకు 7373 మంది డబ్బులు చెల్లించారని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. వారికి హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌లను 2014 లో ఈపీఎఫ్ఓ తిరస్కరించిందన్నారు. 7373 మంది నుండి సాధారణ పెన్షన్ కోసం చెల్లించాల్సి డబ్బులు పోనూ, మిగతా డబ్బులు వడ్డీతో సహా నెల రోజుల్లో చెల్లిస్తామని అప్పట్లో ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పదేండ్లు గడచినా ఆ డబ్బులు అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.222 కోట్లు ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. ఆ సొమ్మును తిరిగి ఇప్పించాలని బర్కత్‌పురాలోని రీజినల్ పీఎఫ్ కార్యాలయం వారితో జరిగిన మీటింగ్‌లో కోరామనీ, దీనికి సంబంధించి పూర్తి సమాచారంతో కూడిన లేఖను ఇచ్చి, ఆర్టీసీ యాజమాన్యం సహకరించాలని కోరారు.

యూకో బ్యాంక్ కొత్త డిపాజిట్ ప్లాన్ ఆవిష్కరణ

नवतेलंगाणा - బిజినెస్ బ్యూరో

యూకో బ్యాంక్ కొత్తగా స్పెషల్ డిపాజిట్ స్కీమ్ 'యూకో333ని ఆవిష్కరించింది. 333 రోజుల గడువు కలిగిన ఈ స్కీం పరిమిత కాలం అందుబాటులో ఉంటుందని ఆ బ్యాంక్ తెలిపింది. రూ.3 కోట్ల లోపు విలువ చేసే డిపాజిట్లపై ఏడాదికి గరిష్టంగా 7.30 శాతం వడ్డీ రేటును అందించనున్నట్టు తెలిపింది. సీనియర్ సిటిజన్స్‌కు 7.55 శాతం వడ్డీ ఇవ్వనున్నట్టు పేర్కొంది. పెట్టుబడులపై అధిక రిటర్న్‌లు కోరుకునే ఖాతాదారులకు ఇది మంచి ఎంపికని తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఇది ఉత్తమమైన వడ్డీ రేటు అని పేర్కొంది.

ఓయూ వీసీగా ఎం కుమార్

107 ఏండ్ల చరిత్రలో తొలిసారి దళిత ప్రొఫెసర్‌కు అవకాశం

- కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి
- వ్యవసాయ వర్సిటీ వీసీగా అల్దాస్ జానయ్య
- 9 వర్సిటీలకు ఉపకులపతుల నియామకం
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రొ॥ జీఎన్ శ్రీనివాస్, ప్రొ॥ ప్రతాప్‌రెడ్డి, ప్రొ॥ ఎం కుమార్, ప్రొ॥ నిత్యానందరావు, ప్రొ॥ అల్తాఫ్ హుస్సేన్, ప్రొ॥ యాదగిరి రావు, ప్రొ॥ అల్దాస్ జానయ్య, ప్రొ॥ రాజిరెడ్డి

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) ఉపకులపతి (వీసీ)గా ఎం కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. 107 ఏండ్ల ఓయూ చరిత్రలో దళిత ప్రొఫెసర్‌కు వీసీ పదవిని కట్టబెట్టడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు వీసీలను ప్రభుత్వం నియమించింది. సెర్చ్ కమిటీల ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఆమోదించారు. కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) వీసీగా ప్రతాప్‌రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ) వీసీగా జీఎన్ శ్రీనివాస్, శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ) వీసీగా ఉమేష్‌కుమార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పీఎస్టీయూ) వీసీగా నిత్యానందరావు, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ) వీసీగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) వీసీగా యాదగిరిరావు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) వీసీగా అల్దాస్ జానయ్య, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) వీసీగా రాజిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలోనే మహిళా విశ్వవిద్యాలయం వీసీగా ధనావత్ సూర్య, ఆర్జీయూకేటీ బాసర ట్రిపుల్‌ఐటీ వీసీగా ఎ గోవర్ధన్‌ను నియమించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించింది. జేఎన్టీయూహెచ్ సెర్చ్ కమిటీ నిర్వహించినా వీసీ పేరును గవర్నర్ ఆమోదించకపోవడం గమనార్హం. సెర్చ్ కమిటీ సిఫారసును రద్దు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. జేఎన్ఏఎఫ్ఏయూ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాల వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీల సమావేశాలు జరగలేదు. ఆరోగ్య విశ్వవిద్యాలయం, పివి నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం (పీవీఎన్ఆర్టీవీయూ) వీసీలను నియమించాల్సి ఉన్నది. రాష్ట్రంలో రెగ్యులర్ వీసీల పదవీకాలం ఈఏడాది మే 21న ముగిసిన విషయం తెలిసిందే. అదేరోజు ఐఏఎస్ అధికారులకు ఇన్‌చార్జీ వీసీల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రెగ్యులర్ వీసీల పదవీకాలం ముగియకముందే మే 17న వీసీల నియామకానికి సంబంధించి పది వర్సిటీలకు వేర్వేరుగా సెర్చ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రంలో పది వర్సిటీలకు 320 మంది ప్రొఫెసర్లు 1,382 దరఖాస్తులను సమర్పించారు. వాటిని సెర్చ్ కమిటీ పరిశీలించి ముగ్గురు పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించింది. వారిలో ఒకరిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఆమోదించారు.

ప్రతాప్‌రెడ్డి నేపథ్యం

ప్రతాప్‌రెడ్డి ఓయూలో జువాలజీ ప్రొఫెసర్ రిటైరయ్యారు. బీఎస్సీ (ఆనర్స్) కోర్సులో ఓయూలో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత పొందారు. ఎంఎస్సీ జువాలజీలో కూడా డిస్టింక్షన్‌లో పాసయ్యారు. ఓయూలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. 1989 నుంచి 1998 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 1998 నుంచి 2006 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006 నుంచి 2021 వరకు ప్రొఫెసర్‌గా పనిచేశారు. 32 ఏండ్ల బోధన, 37 ఏండ్ల పరిశోధన అనుభవం ఉన్నది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్లలో 104 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ప్రస్తుతం కేయూ వీసీగా నియమితులయ్యారు.

ఎం కుమార్ నేపథ్యం

ఎం కుమార్ ఓయూలో రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (ఆర్‌సీయూఈఎస్) డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రముఖ విద్యావేత్త, సివిల్ ఇంజినీరింగ్ పరిశోధనలో ప్రఖ్యాతిగాంచారు. ఓయూలో డిగ్రీ, జేఎన్టీయూలో పీజీ, ఐఐటీ బాంబేలో డాక్టరేట్‌ను చదివారు. ప్రస్తుతం ఆయన ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్లలో వంద పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఆయన ఓయూ వీసీగా నియమితులయ్యారు.

నిత్యానందరావు నేపథ్యం

వెలుదండ నిత్యానందరావు నాగర్ కర్నూల్ జిల్లా మంగనూర్ గ్రామం. 30 ఏండ్లుగా సీనియర్ ప్రొఫెసర్‌గా బోధన, 33 ఏండ్లుగా పరిశోధన అనుభవం ఉన్నది. ఆయన వివిధ పుస్తకాలను రాశారు. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. పలు అవార్డులను పొందారు. ఆయన తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులయ్యారు.

జీఎన్ శ్రీనివాస్ నేపథ్యం

జేఎన్టీయూహెచ్‌లో ఈఈఈ సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన బీటెక్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో, ఎంఈ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో, పీహెచ్‌డీ జేఎన్టీయూలో పూర్తి చేశారు. ఆయన పీయూ వీసీగా నియమితులయ్యారు.

విశ్వవిద్యాలయాల వీసీల పేర్లు

విశ్వవిద్యాలయం	వీసీ పేరు
1. పాలమూరు	ప్రొ॥ జీఎన్ శ్రీనివాస్
2. కాకతీయ	ప్రొ॥ ప్రతాప్‌రెడ్డి
3. ఉస్మానియా	ప్రొ॥ ఎం కుమార్
4. శాతవాహన	ప్రొ॥ ఉమేష్‌కుమార్
5. తెలుగు	ప్రొ॥ నిత్యానందరావు
6. మహాత్మాగాంధీ	ప్రొ॥ అల్తాఫ్ హుస్సేన్
7. తెలంగాణ	ప్రొ॥ యాదగిరి రావు
8. వ్యవసాయ	ప్రొ॥ అల్దాస్ జానయ్య
9. హార్టికల్చర్	ప్రొ॥ రాజిరెడ్డి

దేశానికి అన్నం పెట్టే రాష్ట్రం.. తెలంగాణ

పామాయిల్ సాగుతో లక్షాధికారి కానున్న రైతు

- రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం : మర్పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

నవతెలంగాణ-మర్పల్లి



దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణను వ్యవసాయ రంగంలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రూ. 2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా వై.మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గూడెం మల్లేష్‌యాదవ్, పాలకవర్గ సభ్యులతో మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. గత పాలకులు చేసిన అప్పులకు అధిక వడ్డీలు కట్టడంతో అభివృద్ధికి కొంత ఆటంకం కలుగుతోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదని అన్నారు. రైతులు ఫామాయిల్ సాగుకు ముందుకు రావాలని, రైతులు లాభాలు పొందేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ట్రిబుల్ ఆర్‌తో వికారాబాద్ జిల్లా రూపురేఖలు మారనున్నాయని తెలిపారు.

, రూ.2లక్షల రుణమాఫీ నిధులు సోనియాగాంధీ జన్మదినం నాటికి పూర్తిస్థాయిలో విడుదల చేస్తామన్నారు. గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. స్పీకర్, శాసనమండలి చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎస్సీ, బీసీలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. కాగా, ఈ కార్యక్రమంలో.. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు క్యాంటీన్ సౌకర్యం, కోల్డేజ్ షెడ్లు, రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌యాదవ్, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ కొండల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాములుయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రామేశ్వర్ మంత్రిని కోరారు.

అంతకుముందు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ టాయిలెట్స్ ప్రారంభించి, విద్యార్థులకు నోట్‌బుక్కులు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం స్పీకర్, మంత్రిని ఓపెన్ టాప్ జీపులో భారీ ఊరేగింపుతో సభా స్థలానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఎస్పీ నారాయణరెడ్డి, సుభాష్‌యాదవ్, దివాకర్, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



లాస్ట్ మైల్ కనెక్టివిటీకి 'మనయాత్రి'తో ఎల్అండ్‌టీ మెట్రో ఒప్పందం

- మెట్రో ప్యాసింజర్స్‌కు 10శాతం రాయితీతో ఆటో రైడ్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో ప్రయాణికులకు లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంచేందుకు మనయాత్రి సంస్థతో ఎల్అండ్‌టీ మెట్రో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆ సంస్థ సీఎండీ కేవీబీ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు మనయాత్రి ప్రతినిధులతో కలిసి శుక్రవారం టీ-హబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలులో రోజుకు 5లక్షల మంది ప్రయాణికులు జర్నీ చేస్తున్నారన్నారు. ఎల్అండ్‌టీ మెట్రో, మనయాత్రి భాగస్వామ్యంతో సబ్సిడీ ధరతో ఆటో రైడ్లను అందించనున్నట్టు చెప్పారు. 57 మెట్రో స్టేషన్లలో ఈ యాప్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మనయాత్రి సీఈవో మాగిజన్ సెల్వన్ మాట్లాడుతూ.. తమ సంస్థ బెంగళూరు, కొచ్చిలో సేవలందించిందని, ఇప్పుడు హైదరాబాద్ మెట్రోతో కలిసి సేవలందిం చనుందని అన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణంతోపాటు డ్రైవర్లను ఆర్థికంగా బలోపేతం చేయటమే తమ లక్ష్యమని తెలిపారు. మనయాత్రి యాప్ రైడ్స్ నిర్వహించే మెట్రో ప్రయాణికులకు 10శాతం రాయితీ కల్పించనుందని, డ్రైవర్లకు నేరుగా డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా ప్రయాణికులు ఈ యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు మురళీవరదరాజన్, సుధీర్, పి.రవిశంకర్, అల్లూరి శర్మ సుదీప్తోరంజన్, రిషివర్మ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ పోలీస్ బెటాలియన్‌ను సందర్శించిన డీజీపీ

- వివిధ బెటాలియన్ల కమాండెంట్లతో సమావేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో గల తెలంగాణల స్పెషల్ పోలీస్ బెటాలియన్ ప్రధాన కార్యాలయం శౌర్యభవన్‌ను శుక్రవారం రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ సందర్శించారు. వివిధ బెటాలియన్ల కమాండెంట్లతో సమావేశ మయ్యారు. వారికున్న సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు చేయబోతున్న బెటాలియన్లకు సంబంధించిన వివరాలను డీజీ సంజయ్‌కుమార్ జైన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సాయుధ రిజర్వు పోలీసుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని డీజీపీ జితేందర్ తెలిపారు.

రౌడీషీటర్ చోర్ కైసర్ ఆస్తులు జప్తు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని పేరుమోసిన రౌడీషీటర చోర్ కైసర్ అలియాస్ పైల్వాన్ కైసర్‌కు చెందిన రూ. కోటీ 10 లక్షల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శుక్రవారం జప్తు చేశారు. నగరంలోని హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా రికార్డయిన కైసర్‌పై హత్య, హత్యాయత్నం, బెదిరించి డబ్బులు వసూళ్లు, కిడ్నాప్‌లు వంటి కేసులు నమోదై ఉన్నాయి. ఇటు నేరాలకు పాల్పడటమే కాక విదేశాల్లో ఉన్న కొందరికి హవాలా ద్వారా డబ్బులను సమకూర్చి పెద్ద ఎత్తున కమీషన్లు తీసుకునేవాడని ఈడీ అధికారులు తెలిపారు. దీంతో హవాలా ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కైసర్‌కు చెందిన 1.10 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ ఆస్తులన్నీ కైసర్ భార్య బేగం పేరిట ఉన్నాయని తెలిపారు. కాగా, కైసర్‌పై ఉన్న ఇతర కేసులకు సంబంధించి హబీబ్‌నగర్ పోలీసులు ఇటీవలి కాలంలోనే అతడిని అరెస్టు చేశారు. ప్రస్తుతం కైసర్ బెయిల్‌పై ఉన్నట్టు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు.

'మున్నేరు' గోడ నిర్మాణంలో మార్పు!

- మొన్నటి వరదలను దృష్టిలో ఉంచుకుని డిజైన్ చేంజ్
- నదికి ఇరువైపులా వాల్ మధ్య దూరం పెంచే యోచన
- గతంలో ఏరు మధ్య నుంచి అటు 150.. ఇటు 150 మీటర్లు
- ఇప్పుడు దాన్ని 230- 250 మీటర్లకు పెంచే దిశగా యత్నాలు
- నిర్వాసితులకు ఎన్నెస్పీ స్థలాలు కేటాయించాకే పనులు..!
- త్వరలో ప్రభుత్వ ఆమోదం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలాలను ముంచెత్తిన మున్నేరు వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలోనే మంజూరైన రెయిన్ ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ వాల్ (ఆర్సీసీ) డిజైన్‌లో మార్పులు చేయాలనే యోచనలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు మంత్రులు ఇటీవల పలు సమావేశాల్లో వెల్లడించారు. ఇంజినీర్లు ఇప్పటికే వాల్ నిర్మాణంలో కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ ప్రతిపాదనలను మంత్రుల ముందు ఉంచారు. అనధికారిక సమాచారం ప్రకారం నదికి ఇరువైపులా గోడల మధ్య దూరం పెంచడమే పరిష్కారమని నిపుణులు సూచించినట్టు తెలుస్తోంది.

ప్రతిపాదనల ప్రకారం ఆర్సీసీ వాల్ నిర్మాణంలో మార్పులు..

నిపుణులు మంత్రుల ముందు ఉంచిన ప్రతిపాదనల ప్రకారం ఆర్సీసీ వాల్ నిర్మాణంలో ఎలాంటి మార్పులు ఉండనున్నాయనే చర్చ ముంపు బాధితుల్లో విస్తృతంగా సాగుతోంది. గతంలో ఏరు మధ్య నుంచి ఇరువైపులా 150 మీటర్ల దూరంతో, 31 అడుగుల ఎత్తుతో గోడలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.650 కోట్లు మంజూరయ్యాయి. పరిపాలన అనుమతులు కూడా లభించడంతో దానవాయిగూడెం పరిసరాల నుంచి గోడ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈలోగా సెప్టెంబర్ 1వ తేదీన వరద పోటెత్తడంతో ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. కనీవినీ ఎరుగని రీతిలో వరదలు పోటెత్తడంతో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్సీసీ వాల్ నిర్మాణంలో మార్పులు చేయడం అనివార్యమని ప్రభుత్వం భావించింది. గత డిజైన్ ప్రకారం 300 మీటర్లు ఉన్న గోడల మధ్య దూరాన్ని 460-500 మీటర్లకు విస్తరించాలని ప్రతిపాదించినట్టు సమాచారం. ఈ లెక్కన నది మధ్య నుంచి ఇరువైపులా 230-250 మీటర్ల దూరంతో రెండు వైపులా గోడలు నిర్మించనున్నట్టు తెలుస్తోంది. గోడల మధ్య విస్తీర్ణం పెంచాలే తప్ప ఎత్తు పెంచితే మున్నేరుపై ఉన్న మూడు బ్రిడ్జీలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఆ ప్రకారం మార్పులు చేయాలని నిర్ణయించే దిశగా మంత్రులు ఉన్నట్టు వినికిడి. నదికి ఇరువైపులా 8 కి.మీ పొడవునా ఈ గోడ నిర్మిస్తారు. ఇలా గోడల మధ్య విస్తీర్ణం పెంచడంతోపాటు ఏరులోని పెద్ద బండరాళ్లను చెక్కడం, చెక్ డ్యామ్‌లను తొలగించడం, లేదంటే ఎత్తు తగ్గించడం వంటి ప్రతిపాదనలను నిపుణులు మంత్రుల ముందు ఉంచినట్టు సమాచారం.

నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాకే..

రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచకుండా రెండు గోడల మధ్య వెడల్పు పెంచడం ద్వారా వరద ప్రవాహం తగ్గించొచ్చని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నదికి రెండు వైపులా 150 మీటర్ల చొప్పున భూ సేకరణ జరిగింది. ఇప్పటికే ఉన్న డిజైన్ మేరకు 19 ఇండ్లు పోతుండగా.. గోడల మధ్య దూరం పెంచడం ద్వారా అదనంగా మరో 100కు పైగా ఇండ్లు తొలగించాల్సి ఉంటుంది. నిర్వాసితులకు పరిహారంతో పాటు, రూరల్ మండలంలో గతేడాది గుర్తించిన ఎన్ఎస్పీ మిగులు భూమిని ప్లాట్లుగా కేటాయించొచ్చని తెలుస్తోంది. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాకే పనులు ప్రారంభించాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇదే విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు, మూడు రోజుల క్రితం ఓ సమావేశంలో స్పష్టం చేశారు.

మరో రూ.200 కోట్లు అదనంగా కేటాయిస్తే చాలు..

మున్నేరు రివర్ బెడ్‌లో 5 ఫీట్ల ఎత్తు వరకు ఉన్న పెద్ద బండరాళ్లను తొలగిస్తే నీటి ప్రవాహం ఎత్తును కూడా తగ్గించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా సేకరించాల్సిన భూమి, ఇండ్లకు పరిహారంతో పాటు రివర్ బెడ్ లెవల్‌కు మొత్తంగా రూ. 200 కోట్లు అదనంగా ఖర్చు చేస్తే ప్రస్తుత డిజైన్‌తోనే రిటైనింగ్ వాల్ నిర్మించొచ్చని అంటున్నారు. అలా కాకుండా రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచితే నదిపై మూడు బ్రిడ్జీలకు ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. మొన్నటి వరదతోనే ప్రకాశ్ నగర్ బ్రిడ్జీ డ్యామేజీ అయిందని, నీటి ప్రవాహం ఎత్తు తగ్గించాలంటే గోడల మధ్య వెడల్పు పెంచడంతో పాటు, రివర్ బెడ్ లెవల్‌ను తగ్గించడమే పరిష్కారమంటున్నారు.

గ్రూపు-1 పరీక్షలు యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా నిర్వహించేలా ఆదేశించాలన్న అభ్యర్థనను తోసిపుచ్చుతూ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణలతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. 2022లో నోటిఫికేషన్‌ను రద్దు చేసిన చాలా కాలానికి పిటిషన్లు ఎలా వేస్తారు. అది కూడా పరీక్షలు రాసి ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చాక ఎలా వేస్తారు. ఇప్పటికే రెండుసార్లు రద్దయ్యింది. ఐదు లక్షల మంది రాసిన పరీక్షలు ఇప్పుడు మూడు లక్షలకు పడిపోయాయి. కొందరు ఆత్మహత్యలు చేసుకునే ప్రయత్నాలు చేశారు. పరీక్షలను వాయిదా వేసుకుంటూపోతే దానికి అంతే ఉండదు. వాయిదాను సవాల్ చేస్తూ మరికొందరు కోర్టులకు వస్తారు. దీనికి అంతం ఉండకపోతే ఎలా? అభ్యర్థుల మానసిక పరిస్థితులపై కూడా ఆలోచన చేయండి. అప్పీల్స్‌ను అనుమతించే ప్రసక్తే లేదు. అయినా సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకునేందుకు కారణాలు ఏమీ లేవు. కాబట్టి కొట్టేస్తూ తీర్పు చెబుతున్నాం.. అని బెంచ్ తీర్పులో పేర్కొంది.గ్రూప్ -1 పిలిమినరీ కీలో తప్పులు ఉన్నాయని పలు ఆధారాలను సమర్పించినప్పటికీ సింగిల్ జడ్జి పట్టించుకోలేదని పిటిషనర్ల న్యాయవాదులు వాదించారు. ప్రిలిమినరీ పరీక్ష కీలో తప్పులున్నందున పరీక్షను రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేసులోని పూర్వాపరాలను, వాస్తవాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని తప్పుపట్టారు. టీజీపీఎస్సీ ప్రకటించిన తుది కీలో తప్పులున్నాయని పిటిషనర్లు ఆధారాలు చూపినప్పటికీ సింగిల్ జడ్జి వద్ద న్యాయం లభించలేదన్నారు. తామిచ్చిన వివరాల జోలికి వెళ్లలేదని ఆక్షేపించారు. వీటిపై పూర్తి వివరాలను వాదనల సమయంలో చెప్పినప్పటికీ వాటిని సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదనీ, ఈ పరిస్థితుల్లో పిటిషనర్ల వాదనలు విని పరీక్షలను వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రశ్నల్లో ఏ రకంగా తప్పులున్నా యో చెప్పినా పరిశీలనే చేయలేదనీ, ఎన్నో ఏండ్లుగా ఆశలు పెట్టుకున్న అభ్యర్థులకు న్యాయం చేకూర్చాలని కోరారు. ప్రశ్నకు ఐచ్ఛిక సమాధానాల్లో సరైనది లేనప్పుడు సదరు ప్రశ్నను తప్పుగా పరిగణించాలన్న నిబంధనను అమలు చేయలేదన్నారు. మెలికలతో కూడిన ప్రశ్నలు ఉండాలంటూ సర్వీస్ కమిషన్ చేసిన వాదనను సింగిల్ జడ్జి ఆమోదించడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. ఒకే ఒక్క పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలను మాత్రమే తాము పరిగణనలోకి తీసుకుంటామని సింగిల్ జడ్జి చెప్పడం విడ్డూరంగా ఉందనీ, ఒక అభ్యర్థి చెప్పినది సబబుగా ఉన్నప్పుడు కూడా సింగిల్ జడ్జి పిటిషనర్ల వాదనను ఆమోదించాలని అన్నారు. 41, 119 ప్రశ్నలను పరిశీలిస్తే, తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేవన్నారు. ఈ రెండు ప్రశ్నలను తొలగించడం వల్ల మెరిట్ జాబితాపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఇలాంటి కీ ద్వారా మెయిన్‌కు అభ్యర్థుల జాబితా రూపొందించడం చట్ట వ్యతిరేకం అవుతుందన్నారు. ప్రాథమిక పరీక్ష ఒక్కటే ఎంపికకు ప్రామాణికం కాబోదని వాదించారు. ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమేనని సింగిల్ జడ్జి పేర్కొనడం చెల్లదన్నారు. అభ్యర్థుల వడపోతకు ప్రాథమిక పరీక్ష కీలకమనీ, గతంలో ప్రాథమిక పరీక్ష నిర్వహణలో తప్పులు జరిగాయనే రెండుసార్లు పరీక్షలను హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. కాబట్టి తప్పుడు సమాధానాలతో ఉన్న కీ ఆధారంగా మెయిన్స్‌కు అర్హత జాబితాను రూపొందిస్తే తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాల్సిందేనని వాదించారు.టీజీపీఎస్సీ, ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదిస్తూ, ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరిగాయనీ, చిట్టచివరి దశలో గ్రూప్-1 పరీక్షల విషయంలో జోక్యం చేసుకోరాదన్నారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిలాలో 27 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరిగాయని చెప్పారు. ఇప్పటికే 90 శాతం మంది అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని, ఈ నెల 20 వరకు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుందని తెలిపారు. కొద్దిమంది అభ్యర్థులు మాత్రమే గ్రూప్-1 పరీక్షల నిర్వహణను వ్యతిరేకిస్తున్నారనీ, వీటిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు సర్వీస్ కమిషన్ ఆఫీసులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరీక్షల పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు.'ప్రశ్నలు 41, 61, 79, 119..కి సంబంధించి సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేం. తికమకతో కూడిన ప్రశ్నలు ఇస్తే అర్థం చేసుకుని రాయగలిగే ఉన్నత స్థాయి పోస్టుల భర్తీకి జరిగే పరీక్షలివి. ఆ మాత్రం ఐక్యూలెవెల్స్ అభ్యర్థులకు ఉండాలని సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదు. పరీక్షల కోసం ఎన్నాళ్ల నుంచో అభ్యర్థులు వేచిచూస్తున్నారు. పరీక్షల నిర్వహణకు సకల ఏర్పాట్లు జరిగాయి. ఈ పరిస్థితుల్లో అప్పీళ్లను ఆమోదిం చలేం. కాబట్టి అప్పీళ్లను డిస్మిస్ చేస్తున్నాం'.. అని డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది.

వివరణ ఇవ్వండి : హైకోర్టు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కింది కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. 2023 అక్టోబర్‌లో పిటిషనర్ పోలీసు అధికారిగా రిటైర్ అయ్యారని, బెయిల్ మంజూరు చేయాలని లాయర్ కోరారు. పోలీసుల వాదనలను ఈనెల 23న వింటామని న్యాయమూర్తి ప్రకటించారు.

మూసీ నీళ్లతో స్నానం చేసే దమ్ముందా?

- ఈటలకు ఎంపీ చామల సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మూసీ ప్రక్షాళన అవసరం లేదంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో జీవిస్తూ...ఆ నీటితో స్నానం చేయాలని సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నేతలు చరణ్ యాదవ్, చారగొండ వెంకటేష్, సంధ్యారెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీలోకి పోయి ఈటల రాజేందర్ కలుషితమయ్యారనీ, అందుకే ఆయన పాత బాస్‌లను గుర్తు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను ఇస్తాంబుల్ చేస్తామన్న కేటీఆర్, హరీశ్‌రావు మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌లాగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పే మనిషి కాదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు అంటూ గోబెల్స్‌లా తప్పుడు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పదేండ్ల పాలనకు, పది నెలల పాలనకు యుద్ధం జరుగుతున్నదని చెప్పారు.

21 వరకు సర్కారుకు డెడ్‌లైన్

- సీఎం పిలవాలి మా సమస్యలు పరిష్కరించాలి
- ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- సీఎస్‌కు చెప్పినా వినడం లేదు
- 22న భవిష్యత్ కార్యాచరణ
- తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాడతాం
- డీఏలు వెంటనే విడుదల చేయాలి : ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగ జేఏసీ డెడ్‌లైన్ విధించింది. ఈనెల 21 వరకు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జేఏసీ నాయకులను పిలిచి చర్చలు జరపాలనీ, సమస్యలను పరిష్కరించాలని కోరింది. లేదంటే తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటాలకు సిద్ధమని హెచ్చరించింది. ఈనెల 22న భవిష్యత్ కార్యాచరణను ప్రకటించాలని ఉద్యోగ జేఏసీలోని భాగస్వామ్య సంఘాలు కోరుతున్నాయని తెలిపింది. శుక్రవారం ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి వి శేషాద్రిని సచివాలయంలో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగదీశ్వర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా పండుగకు డీఏలు విడుదల అవుతాయని ఉద్యోగులంతా ఎదురు చూశారని చెప్పారు. కానీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరించడం లేదని చెప్పారు. పది నెలల నుంచి సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. మెడికల్ బిల్లులు, ఇతర సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఉద్యోగుల సమస్యలను చెప్పేందుకు సీఎం అపాయింట్‌మెంట్ అడిగితే అధికారులు స్పందించడం లేదన్నారు. సీఎస్‌కు చెప్పినా సమస్యలను వినడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఒకటో తేదీన జీతాలు వచ్చేవి కాదనీ, ఈ ప్రభుత్వంలో వస్తున్నాయని వివరించారు. వరద సాయంగా తమ వంతు ఒకరోజు మూలవేతనాన్ని విరాళంగా ప్రకటించామని గుర్తు చేశారు. తమవి గొంతెమ్మ కోర్కెలు కావనీ, ప్రభుత్వం పరిష్కారం చేసే సమస్యలేనని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని చెప్పారు. తమను సీఎం పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్టు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొంతమంది కలెక్టర్లు కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఈనెల 22 వరకు వేచిచూస్తామనీ, సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. 317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని చెప్పారు.

దేవాదాయ భూములను పరిరక్షిస్తాం

దేవాలయాలను భక్తులకు చేరువ చేయడమే లక్ష్యం : మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దేవాదాయ భూములను పరిరక్షించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయాన్ని భక్తులకు చేరువ చేసేందుకు తాము బృహత్తర ప్రణాళికలు చేపట్టామని చెప్పారు. ఇదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దేవాదాయ శాఖలో 30 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలు సరిచేస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 వచ్చిన తర్వాత జోనల్ విధానం ప్రకారం సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను సవరించుకున్నామని అన్నారు. అందులో భాగంగా 2022, నవంబర్‌లో ప్రాథమిక నోటిఫికేషన్‌ను ఇచ్చామని వివరించారు. ఈ ఏడాది జులై తొమ్మిదిన తుది నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. దాని ప్రకారం 33 మందిని గ్రేడ్-3 ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణలోనూ ఎప్పుడూ లేనంతగా పెద్ద సంఖ్యలో 33 మందిని ఈ విధంగా నియమించచడం ఓ రికార్డు అని అన్నారు. దేవాదాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగులను ఆరేండ్ల సుదీర్ఘ కాలం తర్వాత బదిలీలు చేపట్టామన్నారు. దేవాలయాల్లో పనిచేసే సిబ్బందిని 15 ఏండ్ల తర్వాత ఆగస్టులో బదిలీలు చేశామని వివరించారు. దేవాదాయ శాఖ చరిత్రలో ఇది రికార్డు అని అన్నారు. సమ్మక్క సారక్క జాతరను ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించామన్నారు. బోనాల జాతరను అత్యంత వైభవోపేతంగా చేపట్టామని వివరించారు. భద్రాచలం కళ్యాణం ఉత్సవాలకు లైవ్ టెలికాస్ట్ ఇచ్చామని చెప్పారు. దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను దృష్టిలో పెట్టుకుని, ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఇచ్చినట్టు వివరించారు. దేవాలయాల్లో ప్రసాదాల తయారీకి కావాల్సిన నెయ్యి, ఇతర వస్తువులకు సంబంధించి క్రమబద్ధంగా టెండర్లను నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నట్టు చెప్పారు.

దేవాలయ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

దేవాలయ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి కొండా సురేఖ అన్నారు. 34,092 ఎకరాల దేవాదాయ భూములకు జియో ట్యాగింగ్ ఇప్పటికే చేపట్టినట్టు వివరించారు. 57 శాతం దేవాదాయ భూములను ధరణి వెబ్ పోర్టల్‌లో నిక్షిప్తం చేశామన్నారు. దేవాదాయ భూములను ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీల్లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. దేవాదాయ భూములను క్రమబద్ధంగా రికార్డు చేస్తున్నామన్నారు. ఆ భూముల వివరాలను తెలుపుతూ స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తున్నామనీ, ఇప్పటి వరకు నాలుగు జిల్లాల్లో ఈ పనులు పూర్తయ్యాయని వివరించారు. మొదటి దశలో 231 ఎకరాల దేవాదాయ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దేవాదాయ శాఖ భూములను సర్వే చేసి, సైన్ బోర్డులు పెడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో గురుకులాలకే పెద్ద పీట

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి
- గురుకుల పాఠశాల, కళాశాల పరిశీలన



నవతెలంగాణ తొర్రూరు

ప్రజా ప్రభుత్వంలో గురుకులాలకే పెద్ద పీట వేస్తున్నామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, మైనారిటీ సంక్షేమ వసతి గృహాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సదుపాయాలు, చెత్త, మరుగుదొడ్ల నిర్వహణ, సీజనల్ జ్వరాల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ అంతా కలియతిరిగి సమస్యలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులను మందలించారు. సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పేదింటి బిడ్డలకు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రామచంద్రయ్య, వైస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, బిజ్జల అనిల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యాకమిషన్ సభ్యుల నియామకం

- పీఎల్‌వీ, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డికి చోటు
- రెండేండ్లపాటు పదవీకాలం
- ఉత్తర్వులు విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విద్యాకమిషన్ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 194) విడుదల చేశారు. చైర్మెన్ సహా ముగ్గురు సభ్యులు ఈ కమిషన్‌లో ఉంటారని గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీంతో విద్యా కమిషన్ చైర్మెన్‌గా ఆకునూరి మురళిని గతనెల మూడో తేదీన ప్రభుత్వం నియమించింది. తాజాగా విద్యా కమిషన్ సభ్యులుగా టీజేఎస్ నాయకులు పీఎల్ విశ్వేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేశ్, మహిళా కాంగ్రెస్ నాయకులు జ్యోత్స్న శివారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి పదవీకాలం రెండేండ్లపాటు ఉంటుందని వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగంలో చేపట్టాల్సిన మార్పులు, తేవాల్సిన సంస్కరణల గురించి విద్యాకమిషన్ సమగ్రంగా చర్చించి, అందరితో సంప్రదించి నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది.

కేటీఆర్ తెలివిగా మాట్లాడుతున్నారు

- మనం చేస్తే సుందరీకరణ .. అవతలి వారు చేస్తే వేరేదా?
- నల్లగొండ జిల్లా బాగుపడాలంటే ప్రక్షాళన జరగాల్సిందే : శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

మూసీ సుందరీకరణపై మాజీ మంత్రి కేటీఆర్ తెలివిగా మాట్లాడుతున్నారు.. మనం చేస్తే సుందరీకరణ.. అవతలి వారు చేస్తే వేరేదా? అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును స్వాగతిస్తున్నానని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల కోసం నందనవనంలో గతంలోనే వెయ్యికిపైగా ఇండ్లు నిర్మించి ఇచ్చారన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలని కొత్తగా ఏదో చేస్తున్నట్టు వ్యతిరేక ప్రచారం చేయడం సరైంది కాదని అన్నారు. మూసీ ఆధారంగా యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో రైతులు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. పట్టణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి తెలివిగా మాట్లాడుతున్నారని, ఆయన హయాంలో ఇష్టం వచ్చినట్టుగా భారీ అంతస్తులకు అనుమతులు ఇచ్చారన్నారని ఆరోపించారు. డ్రయినేజీ, నాలాల వ్యవస్థలను గాలికి వదిలేశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.16500 కోట్లు కేటాయించి ప్రత్యేక బోర్డు పెట్టి చైర్మెన్‌ను కూడా నియమించింది నిజం కాదా? అని ప్రశ్నించారు.

ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాజ్‌పేయి హయాంలో జరిగిన నదుల ప్రక్షాళన ఈటల రాజేందర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ప్రతిపక్షాల తీరును ఎండగట్టాలని, అవసరమైతే మూసీ ప్రక్షాళన కోసం ఉద్యమానికి దిగాలని సూచించారు. ప్రత్యామ్నాయం చూపకుండా మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను ఖాళీ చేస్తే ప్రశ్నించాలి కానీ, అందరికీ పునరావాసం కల్పిస్తున్నప్పుడు ఆందోళన ఎందుకు? అని అన్నారు. మూసీ ప్రక్షాళనపై పర్యావరణవేత్తలు కూడా దృష్టి పెట్టాలని కోరారు. మూసీని జీవ నదిగా మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఏవీ పరిశీలించకుండా మామూళ్లు తీసుకొని భవనాలకు అనుమతులు ఇస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

చికెన్ సెంటర్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- ఏడు క్వింటాళ్ల కుళ్లిన చికెన్ స్వాధీనం



నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్ బేగంపేట్ ప్రకాష్‌నగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌పై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు, నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బాలయ్య చికెన్ సెంటర్‌ల్లో నిర్వహించిన తనిఖీల్లో కుళ్లిన చికెన్, కొవ్వు పదార్థాలు, కోడి బొక్కలకు కెమికల్స్ కలిపి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కెమికల్స్ కలిపి నిలువ చేసిన చికెన్‌ను పలు బార్లకు.. కల్లు కాంపౌండ్లకు.. ఫుడ్ కోర్టులకు అమ్ముతున్నట్టుగా అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో మొత్తం ఏడు క్వింటాళ్ల కుళ్లిన చికెన్‌ను స్వాధీనం చేసుకుని చికెన్ సెంటర్‌ను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు.

మూసీ ప్రక్షాళన పేరుతో విధ్వంసాన్ని వ్యతిరేకిస్తున్నాం

- 23, 24న ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేల పర్యటన
- 25న తమ పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో చేస్తున్న విధ్వంసాన్ని వ్యతిరేకిస్తున్నామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 23,24 తేదీల్లో ప్రభావిత ప్రాంతాల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పర్యటిస్తారనీ, 25న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. అందులో సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, హైడ్రాపై పార్టీ కార్యక్రమాలు, తదితర అంశాలపై అందులో చర్చించారు. అయితే, ఈ సమావేశానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపీలు డీకే అరుణ, జి. నగేశ్, ధర్మపురి అర్వింద్‌కుమార్, ఎమ్మెల్యే రాజాసింగ్ గైర్హాజరయ్యారు. సమావేశం అనంతరం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సభ్యత్వ నమోదును మరింత ఉధృతంగా చేసేలా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు.

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో వ్యూహాత్మకంగా ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించామన్నారు. త్వరలోనే ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిని తమ పార్టీ ప్రకటిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ అనురిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

మాకెందుకు కాలేదు.. రుణమాఫీ!

- నిబంధనల ప్రకారం అర్హులకూ మాఫీ కాకపోవడంపై రైతుల్లో ఆందోళన
- త్వరగా చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు
- కొత్త రుణమూ రావడం లేదని ఆవేదన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

"రైతు రుణమాఫీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుడిని. అయినా నాకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదు. నాలుగు ఎకరాల భూమి ఉంది. ఎస్‌బీఐ తిమ్మపూర్‌లో పంట రుణం కింద రూ. 1.45 లక్షలు రుణం తీసుకున్న. వడ్డీ, అసలు కలిపి రూ. 2 లక్షలకు లోబడి ఉంది. రుణమాఫీ ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. తెల్లరేషన్ కార్డు కూడా ఉంది. బ్యాంక్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేవు. అన్ని క్లియర్‌గా ఉన్నాయి. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో పంట రుణాలు మాఫీ చేయాలి." అంటూ మున్నూరు పద్మారావు అనే రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు.

"నాకున్నది ఎకరం 10 గుంటలు మాత్రమే. రూ.40వేలు రుణం తీసుకున్న. వడ్డీతో కలిసి అది రూ.45వేలు ఉంది. అయినా రుణమాఫీ కాలేదు. దీనిపై అధికారులను అడిగితే ఎవరి దగ్గర సమాధానం లేదు. బ్యాంకర్లు చెప్పడం లేదు, వ్యవసాయ అధికారులు తెలియదంటున్నారు. బ్యాంక్‌లో అసలుకు వడ్డీ పెరుగుతోంది. ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా ఉంటోంది. ఏమీ చేయాలో దిక్కుతోచడం లేదు." అంటూ మరో రైతు అంజనేయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి ఎంతోమంది రైతులు నిబంధనలకు లోబడి రుణాలు తీసుకున్నప్పటికీ మాఫీ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం అందరికీ రుణమాఫీ చేశామని చెబుతూనే.. కొందరికీ మాత్రమే సాంకేతిక కారణాలతో ఆగిందని.. త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటనలు చేస్తున్నారు. లక్ష లోపు ఉన్న వారికి కూడా రుణమాఫీ కాకపోవడం, వారికి ఎందుకు కాలేదో అధికారులు సమాధానం చెప్పకపోవడం.. రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు 2లక్షలకుపైగా రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ కాని రైతులతో మాట్లాడినప్పుడు వారు అనేక విషయాలను వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకొని మాఫీ చేయాలని కోరుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పంట రుణాలు తీసుకున్న రైతులు సుమారు 3.50 లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వం మూడు విడుతల్లో 1.50లక్షల మందికి రూ.1,428 కోట్లు రుణమాఫీ చేసింది. మరో 2 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంది. వీరికి సుమారు రూ.2 వేల కోట్ల రుణాలు బకాయి ఉన్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో పంట రుణాలు తీసుకున్న రైతులు సుమారు 1.85లక్షల మంది ఉండగా, వారిలో 87,882 మందికి రూ. 660 కోట్లు మాఫీ అయ్యాయి. మరో లక్ష మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంది. వికారాబాద్ జిల్లాలో సుమారు 1.70లక్షల మంది ఉండగా, 91,956 మందికి రూ.768 కోట్లు రుణమాఫీ అయింది. మరో 80 వేల మందికి చేయాల్సి ఉంది. కాగా, ప్రభుత్వ రుణమాఫీ హామీతో.. రైతు భరోసా కోసం ఎదురుచూడని రైతులు రుణాలు మాఫీ అయితే చాలు అన్న ఆనందంలో ఉండగా ఆ రైతుల్లోనూ కొంతమందికి రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులయితే.. రుణమాఫీ అయితే కొత్త రుణాలు వస్తాయి.. పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చుకోవచ్చని భావించి వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చి పంట సాగు చేశారు. కానీ అటు.. రుణమాఫీ గాక, ఇటు రైతుభరోసా అందక రైతులు ఆర్థికంగా చిక్కిపోయారు.

నిబంధనలు బేఖాతరు

రుణమాఫీ ప్రక్రియలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది. వాటి మేరకు ఒక కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని నిర్ణయించింది. అయితే దీన్ని దృష్టిలో పెట్టుకుని రూ.2 లక్షల పైచిలుకు ఉన్న రైతులు అప్పు తెచ్చి మరీ బ్యాంక్‌లో డబ్బులు కట్టారు. కానీ వారికీ రుణమాఫీ కాలేదు. 'ఓ కుటుంబంలో తల్లితోపాటు ఇద్దరు కుమారులు.. ముగ్గురు పంట రుణాలు తీసుకున్నారు. ఆ కుటుంబం పంట రుణం మొత్తం రూ.2.90 లక్షలు ఉంది. ఇందులో 90 వేలు చెల్లిస్తే తప్పా రుణమాఫీ వర్తించదని వ్యవసాయ అధికారులు చెప్పడంతో వారు రూ.90 వేలు చెల్లించారు. అయినా మూడో విడతలో రుణమాఫీ కాలేదు. ఎలాంటి సాంకేతిక లోపాలూ లేవు. ఎందుకు రుణమాఫీ కాలేదు. ఇదే విషయం వ్యవసాయ అధికారులను, బ్యాంక్ అధికారులను అడిగితే వారి వద్ద సమాధానం లేదు.' అనేక కుటుంబాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

రాచకొండలో చర్చనీయాంశంగా మారుతున్న ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

ఒకప్పుడు ఇన్‌స్పెక్టర్ బదిలీకి రెండేళ్లు.. ఇప్పుడు నెలల్లో...

నవతెలంగాణ-హయత్‌నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో తరచూ జరుగుతున్న ఇన్‌స్పెక్టర్ల బదిలీలు చర్చనీయాంశంగా మారురుతుందని పోలీసుల వర్గాల్లో వినిపిస్తున్న మాట. ఎన్నికలు ఉన్న సమయంలో కమిషనరేట్ పరిధిలో పని చేసే పోలీస్ అధికారులను ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, బంధు ప్రీతి, అవినీతి జరగకుండా ఎన్నికల అధికారులు బదిలీలు చేస్తారు. ఎన్నికలు ముగిశాక రాచకొండలో మాత్రం ఇన్‌స్పెక్టర్‌లు బాధ్యతలు స్వీకరించి నెలలు గడవక ముందే.. స్టేషన్ వాతావరణం తెలుసుకునేలోపు బదిలీ వార్త రావడం ఏంటని ఇన్‌స్పెక్టర్లు వాపోతున్నారు. ఇన్‌స్పెక్టర్లు కనీసం ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉంటే పోలీస్ రూల్ ప్రకారం రెండు సంవత్సరాలు విధులు నిర్వహించాలి. ఎస్ఐకి మూడు సంవత్సరాలు. ఏఎస్ఐకి మూడు సంవత్సరాలు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లకు ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించాలి. కానీ ఇన్‌స్పెక్టర్లు నెలలకే బదిలీ కావడంతో ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఎఫెక్ట్. ప్రస్తుతం పొలిటికల్ ఎఫెక్ట్ అని పోలీస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా పోలీసులపై రాజకీయాలు మరవా అంటున్నారు.



అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ- నాగోల్

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం...శుక్రవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో డయల్ 100కి ఫిర్యాదు వచ్చింది. వెంటనే నాగోలు డివిజన్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్ సమీపంలో ఉన్న ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనాస్థలంలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అతడు స్ట్రోక్ లేదా ఏదైనా ఆరోగ్య సమస్యల కారణంగా మరణించి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే..నాగోలు పీఎస్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



'డ్వాక్రా గ్రూపు మహిళలకు' చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - మలక్‌పేట్

మూసీనది ప్రాంతంలో గృహాలు కోల్పోయి డబుల్ బెడ్‌రూం ఇండ్లు పొందిన 110మంది డ్వాక్రా గ్రూపు మహిళలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం అందించిన రూ.రెండు లక్షల చెక్కులను శుక్రవారం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గృహాలు కోల్పోయిన వారు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత ఇచ్చిందని తెలిపారు. పంపిణీ చేసిన చెక్కులలో రూ. 1,60000 వరకు మహిళలు చెల్లించనవసరం లేదని, మిగిలిన నగదును చెల్లించాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ డబుల్ బెడ్ రూంలో అన్ని వసతులు కల్పించడానికి అధికారులు రంగం సిద్ధం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహిద్దీన్, కలెక్టర్ దివ్య, కలెక్టర్ గౌతమి, ఎంఐఎం కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

- రంగా రెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పర్వతాలు

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఆటో డ్రైవర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రంగా రెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కోరారు. ఏఐటీయూసీ సరూర్ నగర్ మండల్ సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్ చౌరస్తాలో ఆటో కార్మికుల స్టాండ్ దగ్గర ఆటో డ్రైవర్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమస్యలపైన తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ అందులో భాగంగా ఎల్బీనగర్ రింగ్ రోడ్ చౌరస్తాకు రావడం జరిగిందన్నారు. ఆటో కార్మికుల జీవితాలు చాలా దుర్భల పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వెహికల్స్ టూ వీలర్, ఓలా, ఉబర్ నడుపుతూ ఆటో కార్మికుల పొట్ట కొట్టే విధంగా ఉందన్నారు. ప్రైవేట్ వెహికల్స్ ఓన్ ప్లేట్‌తో టూవీలర్లు టాక్సీగా ఓలా ఉబర్ని ఉపయోగిస్తూ నగరంలో కొనసాగుతున్నాయని దీని కారణంగా అనేక మంది ఆటో రంగా కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే వాటిని నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని అన్నారు. ఆటో డ్రైవర్లను చలాన్ల పేరుతో ట్రాఫిక్ పోలీసుల వేధింపులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ల ఇం ఢ్లకు అద్దె కట్టుకుంటూ, ఆటో కిరాయి కట్టుకుంటూ, పిల్లల బాగోలు చూసుకుంటూ ఈ పోటీ ప్రపంచంలో ఆటో కార్మికులు నిలదొక్కుకోవడం కష్టతరమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ ఆర్టీసీ రంగం జిల్లా ఆఫీస్ బేరర్ వెంకన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ సరూర్ నగర్ మండల కార్యదర్శి ఎం మద్దిలేటి, సక్రు నాయక్, ఆటో కార్మికులు కృష్ణమూర్తి, రాజు, బాల శేఖర్, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ అడ్డాలో రూ.5 భోజనం ఏర్పాటు చేయాలి



- ఏఐటీయూసీ డిమాండ్

నవతెలంగాణ-హయత్‌నగర్

రంగారెడ్డి జిల్లాలో ఉన్న కార్మికుల అడ్డాలో 5 రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. హయత్ నగర్‌లో ఉన్న లేబర్ అడ్డాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులందరూ కూడా సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.అలాగే బహుళ అంతస్తుల నిర్మాణాల ద్వారా రెండు శాతం సెస్సుని కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన ప్రభుత్వాలు దారి మళ్లించడం కార్మికులను విస్మరించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. భవిష్యత్తులో సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే వెచ్చించాలని, ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ. ఆరు లక్షల నుండి 10 లక్షల వరకు పెంచాలని కోరారు. 55 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికునికి 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, కార్మికుల కోసం ఆయా కేంద్రాలలో అడ్డా స్థలాలను కేటాయించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి అడ్డా కేంద్రంలో ఐదు రూపాయల భోజనం వసతిని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, భవన నిర్మాణ కార్మికుల సంఘం హయత్ నగర్ మండల కన్వీనర్ చెంది వెంకట్, క్యాబ్ డ్రైవర్ యూనియన్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి నీలం నాగేష్ గౌడ్, మధ్ర శోభన్, మధు రామచంద్రం, స్వరూప, రామకృష్ణ వెంకట్, శ్రీధర్ రెడ్డి రాములు గౌడ్, అడ్డా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చింతల రాకేశ్ భవానికి సన్మానం



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందిన డాక్టర్ చింతల రాకేశ్ భవానిని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారంను ఎల్బీనగర్ స్థానిక ఆర్టీసీ కాలనీ వాసికి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కవి, రచయిత, గాయకులు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవాని పనిచేస్తున్నారని తెలిపారు. మేధావులను గౌరవించుకోవడం సమాజానికి అవసరం అన్నారు. డాక్టర్ చింతల రాకేశ్ భవాని సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశేషమైన కృషి చేస్తూ రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకునిగా ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.

పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

పాత పోచంపల్లి రోడ్ (ఆటో నగర్) మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న రోడ్‌ను పునరుద్ధరించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాకేశ్ మోహన్ దొబ్రియల్ (ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి)హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత పోచంపల్లి రోడ్డు విషయంలో గతంలో మిమ్మల్ని కలిసి పలుసార్లు ప్రస్తావన వచ్చిందని దానిలో భాగంగా గతంలో అట్టి ఫారెస్ట్ స్థలంలో రోడ్డు వేయడానికి ఎక్కువ స్థలం అటవీశాఖ వారికి ఉందని తెలియజేసిన నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు చేసిన సర్వే ప్రకారం కేవలం 200 మీటర్ల కంటే తక్కువ స్థలం ఫారెస్ట్ అధీనంలో ఉందని వివరించినట్లు తెలిపారు. అట్టి రోడ్డు విషయంలో తగు నిర్ణయాలు తీసుకొని రోడ్డు విషయంలో 200 మీటర్ల ఫారెస్ట్ స్థలం గురించి తప్పకుండా పలువురు అధికారులచే చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, రవి ముదిరాజ్, అశోకప్ప తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్



539 గ్రాముల గంజాయి, 2వేల నగదు, 2 ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-హయత్‌నగర్

గంజాయి సేవిస్తున్న ఇద్దరిని ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ కు చెందిన సంజు... గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు అమ్మేవాడు. భరత్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న విజయ్ కుమార్ అలియాస్ సోనీ. ఇతని స్వస్థలం మధ్య ప్రదేశ్. నాగోల్ జై పురి కాలనీ, నువ్వుల బండలో నివాసం ఉంటున్న హెమ్ సింగ్ అలియాస్ హేమంత్ ఇతని స్వస్థలం రాజస్థాన్. వీళ్ల బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి మార్బుల్స్ పని చేసేవారు. సంజుతో వారికి ఏర్పడిన పరిచయంతో గంజాయిని సేవించడం, కొన్ని సందర్భాలలో వారితో కలిసి పనిచేసే వారికి అమ్మడం లాంటివి చేసేవారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వారిని పట్టుకుని వారి వద్ద నుండి 539గ్రాముల గంజాయి, 2సెల్ ఫోన్లు, 2వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'డీఆర్ఎస్' స్కూల్‌ను సందర్శించిన భూల్ భూలయ్యా 3 చిత్ర బృందం





నవతెలంగాణ- మేడ్చల్

ప్రముఖ బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ నటించిన చిత్రం భూల్ భూలయ్యా 3 ప్రమోషన్‌లలో భాగంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్‌లో ఆయనతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, ఎడిఫై వరల్డ్ స్కూల్ డైరెక్టర్ ఏ.కే.అగర్వాల్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి కార్తీక్ ఆర్యన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్‌లో కార్తీక్ ఆర్యన్ సైతం డ్యాన్స్ స్టెప్స్ వేసి సందడి చేశారు. స్కూల్ డైరెక్టర్ ఏకె అగర్వాల్ మాట్లాడుతూ కార్తీక్ ఆర్యన్ కొత్త సినిమా భూల్ భూలయ్యా 3 ప్రమోషన్స్‌లో భాగంగా క్యాంపస్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. స్కూల్‌లో క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ క్యారెక్టర్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యతనిచ్చే కళలతో పాటు గ్లోబల్ వేదికపైన ఆదరణ పొందుతున్న సమగ్రమైన విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. అత్యాధునిక సౌకర్యాలు విద్యార్థులకు అందిస్తూ సుసంపన్నమైన కళ, సంస్కృతిలో శిక్షణ పెంపొందించే వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

అరుణోదయ నాగన్నకు జాతీయ పురస్కారం



నవతెలంగాణ-ఎల్బీనగర్

ప్రజా కవి, విప్లవ గాయకుడు కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు ప్రజాకవి సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారాన్ని ఈ నెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా కళాకారుడు గోరేటి రమేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కర్మన్‌ఘాట్ క్రాంతినగర్ గ్రౌండ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుద్దాల హనుమంతు తన జీవితాన్ని ప్రజల కోసం ప్రజాకళల ద్వారా ప్రజల్ని చైతన్యం చేశాడని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ సుద్దాల ఫౌండేషన్ ప్రతి సంవత్సరం ప్రజల కోసం జీవిస్తున్న ప్రజాకళాకారులకు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారని గోరేటి రమేష్ అన్నారు. సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు సినిగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కళ కళ కోసం కాదు అన్నారని అన్నారు. ప్రజలకోసం, ప్రగతికోసం అని అరుణోదయ నాగన్న తన జీవితాన్ని ప్రజల కోసం, కలాన్ని, గళాన్ని పాటలను తూటాలుగా మలిచి తన జీవితంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ.. నిర్బంధాలు అనుభవిస్తూ జైలు జీవితం గడిపాడు అని పేర్కొన్నారు. ఒకటి కాదు రెండు కాదు వందలాది పాటలు పాడి ప్రజల్ని ఉద్యమం వైపు, పోరాటాల వైపు మళ్లించాడు అని అన్నారు. శ్రీకాకుళ పోరాటం, గోదారిలోయ పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటంలో తనదైన ముద్ర వేసుకున్నాడని కొనియాడారు. నిజమైన కమ్యూనిస్టుగా నిరాడంబర జీవితాన్ని గడుపుతూ నేటి, రేపటి తరానికి ఆదర్శంగా నిలుస్తూ జీవిస్తున్నాడు అని వెల్లడించారు. అలాంటి త్యాగమూర్తికి ఈ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి వందలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జె మల్లేష్, శేఖర్ మాస్టర్, గజ్జె రాఘవేందర్, చంద్రకాంత్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ మరచిన 'మధుసూదన్ రెడ్డి'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఈ నెల 16న బడంగ్‌పేట్‌లో నూతనంగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా ఎన్నికైన ఎలుగంటి మధుసూదన్ రెడ్డి... మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ మరిచి గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం ఏమిటని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్ ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ పరిధిలో ఉన్న జర్నలిస్టు కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడంగ్‌పేట్‌లో రంగారెడ్డి జిల్లా నూతన గ్రంథాలయాన్ని నిర్మాణం చేయడంలో ప్రధాన భూమిక పోషించిన మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా నూతనంగా ఎన్నికైన ఏలుగంటి మధుసూదన్ రెడ్డి అధికారికంగా సమాచారం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా నూతనంగా చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం అప్రజాస్వామికమని, బేషరతుగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలను అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి..కమిటీలను ఎన్నిక చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులనే ఇందిరమ్మ కమిటీలను నియామకం చేయడం అనాలోచిత నిర్ణయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలను అన్ని పార్టీల నాయకుల నిర్ణయం మేరకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధి చైర్మెన్‌గా, కమిషనర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, డ్వాక్రా మహిళలు ఇద్దరితో కలిపి 7మందితో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

తక్షణమే అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



నవతెలంగాణ-శామీర్‌పేట

నిబంధనలను పాతరేసి ఉపాధ్యాయులకిచ్చిన అక్రమ డిప్యూటేషన్లు సమంజసం కాదని వాటిని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని జిల్లా పరిషత్తు పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జయసింహా రెడ్డి మాట్లాడుతూ... ఇటీవల జరిగిన బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా మేడ్చల్ జిల్లాకు ఏడుగురు ఉపాధ్యాయులు వేరే జిల్లాల నుంచి అక్రమంగా డిప్యుటేషన్ మీద వచ్చారని, వారి బదిలీలు రద్దు చేసి మేడ్చల్ జిల్లాకు సంబంధించిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సంపాదకులు పి. మాణిక్యం రెడ్డి, జిల్లా కార్యదర్శులు మదన్ రెడ్డి, దేవజ నాయక్, శామీర్‌పేట అధ్యక్షులు తిరుమలేశ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాప్‌లో మద్యం సేవిస్తూ వ్యక్తి మృతి



నవతెలంగాణ - మీర్‌పేట్

వైన్ షాప్‌లో మద్యం సేవిస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ కీసర నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన కేశవరావు(60) కొంతకాలంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్గూడ వినాయక హిల్స్‌లో భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటూ ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కేశవరావు ఇంటికి దగ్గరలో ఉన్న టీచర్స్ కాలనీలోని విజయదుర్గ వైన్స్‌కి వెళ్ళాడు. మద్యం సేవిస్తూ సాయంత్రం ఐదు గంటలు ప్రాంతంలో కేశవ కూర్చున్న చోటే కుప్పకులాడు. అక్కడ ఉన్న కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. మీర్‌పేట్ పోలీసులు అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తర్వాత కేశవరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కీసర నాగరాజు తెలిపారు. కల్తీ మద్యం అమ్మకాలు చేయడం వల్లనే కేశవరావు చనిపోయి ఉండవచ్చుని ప్రజలు, మద్యం ప్రేమికులు ఆరోపించడం గమనార్హం. అందుకే వైన్స్ యాజమాన్యం పోలీసులు రాకముందే కేశవరావు మృతదేహాన్ని పర్మిట్ రూం నుండి బయటకు తీసుకువచ్చి రోడ్డుపై పడవేశారని వైన్స్‌కు తాగడానికి వచ్చిన వ్యక్తులు ఆరోపిస్తున్నారు.

'ఆఫర్'లో ద్విచక్ర వాహనం అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

దసరా, దీపావళి ఆఫర్లలో ఏమ్ఐ మొబైల్ కొనుగోలు చేసిన ఓ వ్యక్తికి అదృష్టం తలుపు తట్టింది. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ పట్టణంలోని వాసవీ మొబైల్స్ షాపులో ఏమ్ఐ, షోమి కంపెనీ వారు వినియోగదారులకు అందుబాటులో ఉంచినటువంటి దసరా, దీపావళి ఆఫర్‌ను వినియోగించుకుని చాంద్ పాషా అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేశాడు. కాగా అతడికి స్క్రాచ్ కార్డు ద్వారా సుమారు రూ.2లక్షలు విలువచేసే రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని దక్కించుకున్నారు. శుక్రవారం వాసవి మొబైల్ షాప్ వేదికగా అన్నపూర్ణ ఏజెన్సీ ఏమ్ఐ మొబైల్ డీలర్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా విజేతకు రాయల్ ఎన్ఫీల్డ్ వాహనాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. షోమీ డీలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంచినటువంటి దసరా,దీపావళి ఆఫర్లలో తమ డీలర్ షిప్‌లో కొనుగోలు చేసిన వ్యక్తికి బహుమతి దక్కడం ఆనందంగా ఉందన్నారు. దీపావళి ఆఫర్లలో మరికొందరు గిఫ్ట్ కింద కారు కూడా గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోమీ తెలంగాణ స్టేట్ హెడ్ భాస్కర్, జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్, వాసవి మొబైల్స్ యజమాని దూదా రాం, నిర్వాహకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

● ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శేషాద్రికి ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్), సత్యనారాయణ, నరేష్, వెంకట్, శ్రీనులతో కలిసి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈనెల 22 నాటికి తమ పెండింగ్ సమస్యలను పరిష్క రించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీఇచినట్టు వారు తెలిపారు.

మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-శంకర్‌పల్లి

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలు పరిశుభ్రంగా ఉండే విధంగా కృషి చేయాలని కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చౌరస్తా నుంచి రైల్వే రోడ్డు వరకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిది లోని అన్ని కాలనీలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు మెరుగైన సేవలు అందిం చాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి హెచ్.ఓ. డిలకు సూచించారు. శుక్రవారం అన్ని విభాగాల హెచ్ఓడీలతో కమిషనర్ ఇంటరాక్టివ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయా విభాగాలు నిర్వహిస్తున్న పనులు, కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల హెచ్.ఓ. డీలు తమ తమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న కార్యక లాపాల గురించి కమిషనర్‌కు వివరించారు. ఈ సం దర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆయా విభా గాల అధికారులు సమర్థవంతంగా పని చేయాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెటా లని, నగరవ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాల హెచ్ఓడీలు తమ అనుబంధ శాఖలతో రెగ్యులర్‌గా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమా వేశంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయు డు, స్నేహ శబరీష్, నళిని పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సామ్రాట్ అశోక్, యాదగిరిరావు, అలివేలు మంగతాయారు, సత్యనారాయణ, సరోజ, చీఫ్ ఇంజనీర్లు భాస్కర్ రెడ్డి, అనిల్ రాజ్, దేవానంద్, ఎస్ ఈ కోటేశ్వర్ రావు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ ఎంట మాలజిస్ట్ రాంబాబు, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైసర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వం'

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యార్థుల ఫీజురియంబర్స్‌మెంట్ పథకాన్ని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి విమర్శించింది. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎంతో మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్నారని, కానీ నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి పెండింగ్ లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.గత 3 ఏండ్ల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తయిన కళాశాలల యాజమాన్యాలు వారి ధ్రువపత్రాలు ఇవ్వక పోవడంతో పై చదువులకు, ఉద్యోగాలకు వెళ్లలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం పాత బకాయిలు ఇవ్వకపోవడం వల్ల విద్యా సంస్థలు నడుపలేమని డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘాలు తరగతులు బహిష్కరించి నిరవధిక బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. నాలుగు రోజుల బంద్ నిర్వహించిన అనంతరం గురువారం ప్రభుత్వం తరుపున విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వేంకటేశం డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి ప్రభుత్వం త్వరలోనే పెండింగ్ బకాయిలు చెల్లిస్తుందని చెప్పడంతో వారు నిరవధిక బంద్ వాయిదా వేసుకోవడం జరిగిందన్నారు.కావున అన్ని కోర్సులలో ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలుపుకుని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, వంశీవర్ధన్ రెడ్డి, అరుణ్, హరీష్, వినోద్, వెంకట్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించండి

● బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కల్పన



నవతెలంగాణ-ముషీరాబాద్

రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించాలని ఆ పార్టీ స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శి కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే రెండు సార్లు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పని చేశానన్నారు. ప్రతి సారి పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిని రాంనగర్ డివిజన్‌లో ఒక ప్రాంతానికి సంబంధించిన వారికే ఇస్తున్నారన్నారు. ఈ సారి బాగ్‌లింగంపల్లి ప్రాంతానికి చెందిన తనకు అధ్యక్షురాలిగా అవకాశం ఇవ్వాలని, ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డిలను కోరారు. పార్టీకి ఎంతో సేవలు చేసినా సరైన గుర్తింపు ఇవ్వడంలేదని, ఒకే ప్రాంతానికి చెందిన వారికే పదవులను కట్టబెడుతున్నారన్నారు. నూతనంగా వేసే బీఆర్ఎస్ పార్టీ రాంనగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా తనను నియ మించాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు.



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్

చట్టం ఎవరికీ అతీతం కాదు

● సనత్‌నగర్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

ఇటీవల సికింద్రాబాద్‌లోని ఒక ఆలయంలో జరిగిన విధ్వంసానికి నిరసనగా బీజేపీ దాని అనుబంధ సంస్థలు బంద్‌కు పిలుపునిచ్చాయి. పోలీసు విచారణ కోసం వేచి ఉండాలని, తగిన ప్రక్రియను గౌరవించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ యూనిట్ ఆప్రాంత పౌరులను కోరింది. సనత్‌నగర్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ చట్టం ఎవరికీ అతీతం కాదని, బెదిరింపులు, ఒత్తిళ్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించలేమన్నారు. హైదరాబాద్ లాంటి శాంతియుత, సామరస్య పూర్వకమైన నగరంలో విభజన ప్రలోభాలకు తావివ్వకూడదని ఆమె అన్నారు. బంద్ పిలుపుతో సామాన్య పౌరులు, వ్యాపారాలు, సామాన్య ప్రజలు ఎవరూ ఇబ్బంది పడకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు సమిష్టిగా నిర్ణయించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్ పౌరులు ఇలాంటి సంఘటనలను మతతత్వ శక్తులు నిర్దేశిస్తే, సత్యం, న్యాయం దెబ్బతింటాయని గుర్తించాలని డాక్టర్ నీలిమ ఒక ప్రకటనలో కోరారు. విధ్వంసానికి పాల్పడిన వ్యక్తులెవరో విచారణ తర్వాత బహిర్గతమౌతుందని ఆమె అన్నారు. రాజ్యాంగాన్ని అణగ దొక్కే ప్రయత్నాల గురించి పౌరులు తెలుసుకోవాలని డాక్టర్ నీలిమ కోరారు. 'మతతత్వ శక్తులు కోరే న్యాయం న్యాయం కాదు, ప్రజల భావోద్వేగాలను ప్రేరేపించే విషయాలను సమర్థించకూడదు' అని ఆమె అన్నారు. 'భారత రాజ్యాంగం రిపబ్లిక్‌గా గుర్తించి స్వేచ్చను, హక్కులను అందిస్తుంది. కులమతాలకు అతీతంగా పౌరులందరూ సమానమని ప్రకటించేదే అసలైన రాజ్యాంగమన్నారు. 'మన రాజ్యాంగాన్ని, తప్పు చేసిన వారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావడానికి చట్టం నిర్దేశించిన ప్రక్రియను మనం గౌరవించాలని డా.కోట నీలిమ కోరారు.

డ్రయినేజీ, పొల్యూషన్, వాటర్ సమస్యను పరిష్కరించండి

● కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ

● వాటర్ వర్క్ ఎండి అశోక్ రెడ్డికి వినతిపత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

కవాడిగూడ డివిజన్‌లో డ్రయినేజీ పొల్యూషన్ వాటర్ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ రచన శ్రీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వాటర్ వర్క్ ఎండి అశోక్ రెడ్డిని తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచన శ్రీ మాట్లాడుతూ కవాడి గూడ డివిజన్ వ్యాప్తంగా డ్రయినేజీ సమస్య కలుషిత మంచినీరు సమస్య ఎక్కువగా ఉందన్నారు. మంచినీరు కలుషితం అవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్య పాలవుతు న్నారని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. డివిజన్ లో మెయిన్ రోడ్ నుండి మస్జిద్ లైన్, శివాజీ చౌక్, మల్లయ్య హెూటల్, భాగ్యలక్ష్మి నగర్ చిత్రాల్ నగర్ వరకు నూతన శివరేజ్ పైప్ లైన్ వెయ్యాలని అందు కు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసి డెంట్ మహేందర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మూసీ నది పై పుస్తక ప్రచురణకు రచనల ఆహ్వానం



నవతెలంగాణ-ధూల్‌పేట్

మానవ మనుగడకు, నాగరికతలకు మూలం నదులే. అందుకే మూసీ నదిపై త్వరలో "చంద్రికా గ్రంథ మండలి' ద్వారా పుస్తకం వెలువరించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎస్. విజయ భాస్కర్, డాక్టర్ వేముల నారాయణలు ఓ ప్రకటనలో తెలిపారు. మూసీ నది పై కవిత, కథ, పద్యం, గేయం ఏదైనా సాహిత్య ప్రక్రియలో రాసి అక్టోబర్ 30 లోపు cgmts2017 @gmail.com కు మెయిల్ పంపాలని వారు కోరారు. విశ్వనగరమైన మన భాగ్యనగరంలో ప్రవహి ంచు మూసీ నది సుందరీకరణ, మూసీ ప్రక్షా ళన, మూసీ పునరుజ్జీవం ఈ విధంగా జరుగుతున్న వాద ప్రతివాదాల నేపథ్యంలో మానవ మనుగడకు గాలి తర్వాత నీరే అవ సరం. అటువంటి నీటిని సమకూర్చు వాగులు వంకలు, నదులు, జీవనదుల ప్రాధాన్యతను సాహిత్య రూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

'డీఈఓ రోహిణిపై చర్యలు తీసుకోవాలి'

● దివ్యాంగుడు, ఎస్జీటీ టీచర్ బూర శ్రీనివాస్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ రోస్టర్ పాయింట్‌తో అక్ర మాలు జరిపి తనకు రావలసిన ప్రమోషన్ ను అక్రమంగా అడ్డుకోవడమే కాకుండా తనను సస్పెండ్ చేయడానికి కుట్రలు చేస్తున్న హైదరాబాద్ జిల్లా డీఈఓ ఆర్.రోహిణితో పాటు ఎంఈఓ ఎండి.ముస్తఫాలపై హైదరాబాద్ కలెక్టర్ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని దివ్యాంగుడు, ఎస్జీటీ టీచర్ బూర శ్రీనివాస్ డిమాండ్ చేశారు.న్యాయం చేయకపోతే ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించి, రాష్ట్ర గవర్నర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ మేరకు శుక్రవారం హైదర్ గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ తాను ఆసిఫ్ నగర్ లోని సీసీ నగర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఇంగ్లీష్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తనకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ విషయంలో ఉన్నతాధికారులు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. తన ప్రమోషన్ విషయంలో హైకోర్టును ఆశ్రయించానని, కోర్టు పదోన్నతి ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. డీఈఓ ఆర్.రోహిణి అవినీతిపై గతంలో తాను లోకాయుక్త లో ఫిర్యాదు చేసినందుకు కక్షగట్టి తనను నానా ఇబ్బందు లకు గురి చేస్తుందని ఆరోపించారు. కలెక్టర్ వీరిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ కార్యాల యం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్.సమ్మయ్య పాల్గొన్నారు.

ఆలయాల దాడులపై సిఎం స్పందించాలి

● ఎంపీ ఈటల రాజేందర్



నవతెలంగాణ బేగంపేట్

హైదరాబాద్ నగరం ఉన్మాదులు, ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని, సికింద్రాబాద్ ముత్యా లమ్మ గుడి ఘటనే అందుకు నిదర్శ నమని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సమావేశాలు నిర్వహిస్తూ ఆలయాలపై దాడులు జరుగుతుంటే నిఘా విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన చండీ హెూమంలో రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షపురంలో భూలక్ష్మి అమ్మవారు, ఉప్పుగూడ దేవాయం, మైలార్‌దేవ్పల్లి ఆలయం, నాంపల్లి ఎగ్జి బిషన్ గ్రౌండ్‌లో దుర్గా మాత విగ్రహం, తాజాగా ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంపై దాడి జరిగిందని, కాంగ్రెస్ పార్టీ హయాంలో దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా ఈ దాడులు ఎందుకు జరుగుతున్నాయనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

బస్తీలో డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరచండి



● కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

మూసీ సుందరీకరణకు ముందుగా బస్తీలలోని రోడ్లు డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరచడని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ముషీరాబాద్ నియోజక వర్గంలోని గాంధీనగర్ డివిజన్ హరిత అపార్ట్మెంట్ లైన్ వద్ద రూ.54 లక్షల వ్యయంతో నూతన సేవరేజీ పైప్ లైన్ పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో నానాటికి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తద్వారా తేలికపాటి వర్షానికి వరద నీరు రోడ్లపై ప్రవహిస్తూ శిథిలా వ్యవస్థలో ఉన్న డ్రైనేజీ పైప్లైన్ల వలన మంచినీరు కాలుష్యం అవుతుందన్నారు. ఈ సమస్యను దశలవారీగా పరిష్కరించాలని డ్రైయినేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ హైదరాబాద్ అభివృద్ధి జరగదన్నారు. జీహెచ్ఎంసీ వాటర్ వర్క్ కు అరకొర నిధులు కేటాయించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ అంటే కేవలం గచ్చిబౌలి, బంజారాహిల్స్, మాదాపూర్ ఏ కాదని ముషీరాబాద్, అంబ ర్‌పేట, గౌలిపుర సనత్ నగర్ సికింద్రాబాద్ కూడా అని ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసి సమస్య రహితంగా చేయాల న్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాణానికి రచించాలని కోరారు. మూసీ సుందరీకరణ పేరున ఏండ్ల తరబడి మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న పేదల ఇండ్ల జోలికి వెళ్ళవద్దని పేదల ఇండ్లు కూల్చకుండా మూసీ సుందరీకరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహినుద్దీన్, వాటర్ వర్క్ డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, ఏ ఎమ్ హెచ్ ఓ డాక్టర్ ప్రవీణ, ముషీరాబాద్ ఎమ్మార్వో రాణా ప్రతాప్ సింగ్,బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ బి ఆర్ ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్, మీడియా ఇంచార్జ్ మచ్చకుర్తి ప్రభాకర్, కార్యదర్శి శ్రీకాంత్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఓకే కులస్తులుగా పరిగణించాలి


● తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని కమ్మర, వడ్రంగి, కంచర, శిలా శిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరినీ ఓకే కులస్తులుగా పరిగణిం చాలని తెలంగాణ విశ్వబ్రా హ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీ కమిషన్, ప్లానింగ్ బోర్డుకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.వేములవాడ మదన్ మోహన్, గౌరవ అధ్యక్షు లు డా.లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి మాట్లాడుతూ గతంలో జరిగిన జనాభా ఎన్యుమరేషన్ లో వృత్తులనే కులాలుగా భావించిన ప్రభుత్వాల వల్ల విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేయబడ్డారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనైనా జరగబోతున్న బీసీ కులగణన ఎన్యుమరేషన్‌లో కమ్మర, వడ్రంగి, కంచర, శిల్పి, స్వర్ణకార పంచదాయ వృత్తిదారు లందరిని కలిపి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలుగా ఓకే కులస్తులుగా గుర్తించాలని బీసీ కమిషన్, ప్లానింగ్ బోర్డుకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసి నట్లు వారు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వాటా తమకు దక్కాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు పులిగిళ్ళ శ్రీనివాసచారి, దేవర కొండ వీరాచారి, నాగారం భాస్కరాచారి, లక్ష్మీ రామాచారి, శశిధర్ శిల్పి, రంగు లక్ష్మణచారి, బ్రహ్మచారి, ఉట్కూరి కిషన్, చెన్నోజు రవికిరణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

దీపావళి సందర్భంగా పాతబస్తీలోని బస్తీల లో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసే దుకాణ దారులకు సౌత్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఉప్పు కూడా ధనరాజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా పాల్గొన్నారు. దీపావళి సందర్భంగా బాణసంచా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసే దుకాణదారులకు సూచనలు చేస్తూ తమ పరిది లోని పోలీస్‌స్టేషన్ నుండి ప్రతి దుకాణదారు తాత్కాలిక దుకాను లైసెన్స్ తీసుకోవాలని లేని పక్షాన వారిపై కేసు నమోదు చేయడం జరుగు తుందని లేనిపక్షలో దుకాణం నిర్వహించుకోవడా నికి అర్హులుకారని డీసీపీ స్నేహమేహ్రా అన్నారు. అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ మాట్లాడుతూ దుకాణదారులు ప్రతి షాప్ దుకాణానికి దుకాణా నికి మధ్యల గ్యాప్ ఉండాలన్నారు. దుకాణ దారులు ఏర్పాటు చేసే దుకాణానికి పైకప్పు రేకులతో వేయాలని ప్లాస్టిక్ పేపర్లతో టెంట్ హౌస్ లాగా వేయకూడదని దుకాణానికి సంబం ధించి కరెంటు జాగ్రత్తగా వాడాలని ఎక్కడ వైరు లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. సమీపంలో నీరు, గోన సంచులు లాంటి ప్రమాదం జరిగిన వెంటనే ఆర్పేయడానికి సంబంధించిన వస్తువుల న్నీ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన తాత్కాలి కంగా దుకాణలు నిర్వహించుకోబడే దుకాణ దారులు ఉప్పు కూడా గౌలిపుర శాలిబండ అలి యాబాద్ లాల్ దర్వాజా అరుంధతి కాలనీ పలు ప్రాంతాల వారు వచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, అడిషనల్ డీ సీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఫలక్నుమా చంద్రా యనగుట్ట ఏసీపీ, సీఐ, ఎస్సైలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ నిధులపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలి

● దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులు రూ.2 లక్షల కోట్ల దుర్విని యోగంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జి చేత న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ సీఎం ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ గత 10 ఏండ్లలో దళిత జాతుల అభి వృద్ధి కోసం కేటాయించిన నిధులను దారి మళ్ళి ంచారని ఆరోపించారు. సబ్ ప్లాన్‌కు సంబంధం లేని విభాగాలకు ఖర్చు చేసి నిధులను దుర్విని యోగం చేశారని విమర్శించారు.మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శిలు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దోచుకున్నారని ఆరోపిం చారు. తద్వారా దళితుల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని దోపిడీ కుల పాలకులు అడ్డుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మొత్తం నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్య మంత్రులకు రాజకీయ పాలేర్లుగా, ప్రధానంగా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, సీతక్క, ఎమ్మెల్యేలు జి.వివేక్ వెంకటస్వామి లాంటి దళిత ప్రజా ప్రతినిధులు జాతి పక్షాన గళం వినిపించకుండా ప్రవర్తించ డం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధుల దుర్విని యోగంపై రాష్ట్ర గవర్నర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చొరవ చూపాలని కోరారు. ఈ సమా వేశంలో రాష్ట్ర నాయకులు మాతంగి హనుమం తు, మద్దెల ప్రవీణ్ కుమార్, చిప్పరి సుబ్బారావు, గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమణకు గురైన ఫుట్ పాత్, అక్రమ పార్కింగ్ తొలగింపు

నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో రోప్ ఆపరేషన్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఎం.సత్య నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్ నగర్ స్ట్రీట్ నెంబర్ 9 నుండి నారాయణగూడ ఎక్స్ రోడ్ వరకు రోప్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ రోప్ ఆపరేషన్ లో భాగంగా ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సంపత్ కుమార్ పర్యవేక్షణ లో హిమాయత్ నగర్ డివిజన్‌లో అక్రమణకు గురైన ఫుట్ పాత్‌లు, అక్రమ పార్కింగ్ లను ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ జానీ పాషా, ట్రాఫిక్ సిబ్బంది సహాయంతో తొలగిం చారు. అక్రమ పార్కింగ్‌కు పాల్పడ్డ వాహన దారులకు జరిమానాలు విధించి, పాదచారుల కు, ప్రజలకు అసౌకర్యం కల్పించరాదని వాహన యజమాను లను వారు హెచ్చరించారు.

గ్రూప్ -2, 3 పరీక్షలపై వీసీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2,3 పరీక్షలపై సచివాలయం నుంచి చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, టీజీపీఎస్సీ ఛైర్మెన్ మహేందర్ రెడ్డి, సభ్యులు వారి కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కార్యాలయము నుంచి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ హాజరయ్యారు. నవంబరు 17, 18 తేదిలలో నిర్వహించనున్న గ్రూప్ 3 పరీక్షకు గాను జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో 71,356 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డిఆర్ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

బిల్డర్ శ్రీనివాసులు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రముఖ బిల్డర్ మర్లపల్లి శ్రీనివాసులు జన్మదిన వేడుకలు శుక్రవారం మిత్రుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీనివాసులుకు పూల బొకే అందజేసి.. శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, నాగేశ్వరరావు, జూపల్లి జనార్దన్ రావు, ప్రభాకర్ రావు, వెంకట్ రెడ్డి, విద్యాసాగర్, రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తా



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

అల్లాపూర్ డివిజన్‌లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ ప్రజల సమస్యలపైన స్థానిక కార్పొరేటర్ సబిహ గౌసుద్దీన్ ఆధ్వర్యంలో.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి సమస్యలు ఉన్నాయని, హైడ్రా పేరుతో రాజీవ్ గాంధీ నగర్, సఫ్దార్ నగర్ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఉంటున్న ఇండ్లపై చేసే అపోహలను లెక్కచేయవద్దని రాజీవ్ గాంధీ నగర్, సఫ్దర్ నగర్ ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని అన్నారు. నివాసాలు ఉంటున్న నిరుపేదల జోలికి వస్తే తాను అండగా నిలబడతానని అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, బాబా, పలు కాలనీ అసోసియేషన్ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో పర్యటించిన అపూర్వ చౌహాన్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాల నేపథ్యంలో.. దోమల నివారణలో భాగంగా జోనల్ కమిషనర్ ఆల్విన్ కాలనీ ఫేస్ వన్ ఎంటమలాజీ ఏఎల్ఓ టీమ్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంటమాలాజీ టీం విధులు నిర్వహిస్తున్న విధుల గురించి, స్థానిక ఇంటి యజమానులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు కూడా, ఇంటి ఆవరణలో, ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధుల గురించి ఇంటి యజమానులకు తెలియజేశారు. ప్రతి శుక్రవారం తమ తమ ఇండ్లలో పూల కుండీలు, డ్రమ్ములు వంటి వాటిలో ఉన్నటువంటి నీటి నిల్వలను తనిఖీ చేసి, నిలువ ఉన్న నీటిని పారబోసి, మరలా నీటిని నింపుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడేగా పాటించాలన్నారు. అదేవిధంగా ప్రజలందరూ కూడా ప్రతి కాలనీలోకి వచ్చే ప్రతి ఇంట్లో, నీటి నిల్వలను తనిఖీ చేసే ఎంటమాలాజీ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ జీహెచ్ఎంసీ అధికారులు, ఎంటమాలజి సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి, పర్యటించి డ్రయినేజీ మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం డ్రయినేజీ కంట్రోల్ ట్యాంక్ పొంగి, కాలనీలోకి వరద నీరు రావడం జరిగింది. అయితే ఇప్పుడు ఆ వరద నీరు పూర్తిగా క్లియర్ చేసినప్పటికి, భవిష్యత్తులో సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా మ్యాన్ హోల్స్ పూర్తిగా క్లియర్ చేసి, డ్రయినేజీ లైన్‌ను శుభ్రం చేయాలని సూచించారు. అలాగే కాలనీలో పెద్ద డ్రయినేజీ లైన్ నిర్మించి, నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, జి.రవి, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.


సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ చేయని..

అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసింది

- టీపీసీసీ అధికార ప్రతినిధి

డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్



తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో రూ.80 వేల కోట్లు అప్పులు చేసారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ... బుధవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ 9 నెలల్లోనే రూ.80 వేల కోట్ల అప్పులు చేసి, ఈ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి మీద రూ. 2 లక్షల అప్పుకు కారణం కేసీఆర్ పాలన కాదా అని సూటిగా సత్యం శ్రీరంగం ప్రశ్నించారు. ముఖ్యమంత్రిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగని అరిచినట్లుందన్నారు. పదేండ్లు ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసిందని, పదేండ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినపుడు మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రూ.7వేల లక్షల కోట్ల పై చిలుకు అప్పులు చేసి ఈరోజు ప్రతి వ్యక్తి మీద రూ.2లక్షల అప్పుకు కారణం మీరు కాదా అన్నారు. మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ. 69 వేల కోట్లు అప్పు అయితే దాంట్లో యాభై వేల కోట్లు దాదాపుగా మీ గత ప్రభుత్వ అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, అందులో రూ.20 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసింది మీ కళ్ళకు కనపడుతుంటే అసలు మీరు మాటలు అనడానికి మీకు నోరెలా వచ్చిందని అన్నారు. హైదరాబాద్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా నటిస్తూ అనేక అక్రమాలకు తెరలేపి అక్రమ జీవోలతో బిల్డర్స్‌కు ఎక్కువ ఎస్ఎఫ్టీకి ఇచ్చి అక్రమాలకు పాల్పడిందన్నారు. మూసి ప్రక్షాళన మొదలు పెట్టింది మీరు కాదా కేటీఆర్‌ను ప్రశ్నించారు. అప్పుకు కాదు ఏది అనర్హం అన్నట్లుగా ప్రతి దాని మీద అప్పుల కుప్పగా ఈ రాష్ట్రాన్ని తాయారు చేశారని తెలిపారు. మీరు చేసిన పాపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడిగే ప్రయత్నం చేస్తుంటే ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయమందించిన జిల్లా గణేష్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ కేటీఆర్ కాలనీలో నివాసం ఉండే, సలీం కూతురు ముస్కాన్ బేగం వివాహానికి, రూ.10,000 వేలు ఆర్థిక సహాయాన్ని జిల్లా గణేష్ నేత అందించారు. ఆల్విన్ డివిజన్ కేటీఆర్ కాలనిలో నివాసం ఉండే ముణ్ణి అల్లుడు మైనారిటీ సోదరుడు సలీం క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని.. ఎమ్మెల్యే గాంధీ ఆదేశాలతో, సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత వారి నివాసం వెళ్లి ఆరోగ్య పరిస్థి తెలుసుకొని వివాహానికి 10,000 వేలు ఆర్థిక సహాయాన్ని జిల్లా గణేష్ నేత అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గౌస్, వెంకటకృష్ణ, మెమహేష్ కార్తీక్,అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేట్ కేబుల్ ఫీడర్ లో కొత్త సర్వీస్ కనెక్షన్లు మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 11.30 గం నుంచి మధ్యాహ్నం 12.00 గం వరకు బౌరంపేట్ విలేజ్, టౌన్ షిప్, షికారా స్కూల్ రోడ్‌లలో అలాగే ఉదయం 10.00 గం నుంచి మధ్యాహ్నం 2.00 గం వరకు డిఆర్‌కే ఇంజినీరిగ్ కళాశాల, కేపేల్ విశ్వవిద్యాలయం, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృదావనం, నెస్ట్ విల్లాస్, ఎస్‌బిఐ కాలనీలలో బహదూర్ పల్లి ఫీడర్ లో మధ్యాహ్నం 11:30 గం నుంచి 12.00 ని వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, శ్రీ రామ్ నగర్,క్రిష్ణ నగర్ కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించా లని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి. సాయి కిరణ్ తెలిపారు.

మల్కాజిగిరి జిల్లా హాస్పిటల్‌లో

ప్రపంచ ప్యాలియేటివ్ కేర్, హాస్పిస్ దినోత్సవ వేడుకలు



నవతెలంగాన-సిటీబ్యూరో

ప్రపంచ ప్యాలియేటివ్ కేర్, హాస్పిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి, జిల్లా స్థాయి ఎన్‌సిడి కార్యక్రమాధికారి డాక్టర్ మల్లీశ్వరి, అదనపు కార్యక్రమాధికారి డాక్టర్ కౌశిక్ మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రిలోని ప్యాలియేటివ్ కేర్ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు రోగులతో మాట్లాడి, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలు, అవగాహన కల్పన, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న రోగుల జీవిత నాణ్యతను మెరుగుపరిచే ప్యాలియేటివ్ కేర్ ప్రాముఖ్యతను వివరించారు. హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్, శ్వాస సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులు, హెచ్ఐవి, ఎయిడ్స్, మూత్రపిండాల వైఫల్యం, కాలేయ సంబంధ వ్యాధులు, మల్టిపుల్ స్కెరోసిస్, పార్కిన్సన్ వ్యాధి, నరాల రుగ్మతలు, జన్యు లోపాలు, ఔషధ నిరోధక క్షయ వ్యాధులపై అవగాహన చాలా ముఖ్యం అన్నారు. అవగాహన, విద్య ద్వారా ఈ వ్యాధులను నివారించడానికి ముందస్తు చర్యలు తీసుకోవచ్చు అని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత, తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అవగాహన కలిగిన తరం, దీర్ఘకాలిక వ్యాధుల పెరుగుతున్న తరంగాన్ని ఎదుర్కొనటానికి అవసరమని ఆయన పేర్కొన్నారు.

డిసెంబర్‌లో గాయని కెఎస్ చిత్ర 'చిత్రామృతం'



నవతెలంగాన-సిటీబ్యూరో

ఎస్ ఛాంట్ మీడియా, ఎమ్-3 ఎంటర్టైన్‌మెంట్ నిర్వహణలో డిసెంబర్ 22న శిల్పకళా వేదికలో ప్రముఖ గాయని కెఎస్ చిత్ర... 'చిత్రామృతం' మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించనున్నారు. ప్రముఖ గాయని కేఎస్ చిత్ర 45 ఏండ్ల ప్రస్థానానికి స్మరణార్థంగా నిర్వహించనున్న ఈ చిత్రామృతం ప్రెస్ మీట్ జూబ్లీహిల్స్‌లోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో కేఎస్ చిత్ర, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ పాల్గొని కన్సర్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇందులో ఇండియన్ ఐడల్ తెలుగు నుండి రజిని, ధృతి, రజిని పూర్ణిమ, కీర్తన, శ్రీకీర్తి, వల్లభ, కుశాల్, సాయి మాధవ్ లు చిత్ర ప్రసిద్ధ పాటలను ఆలపిస్తూ హృదయపూర్వకమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్, చిత్రతో కలిసి పని చేసిన అనుభవాన్ని పంచుకొని, ఆమె వినయం, వృత్తిపరమైన నిబద్ధత గురించి పేర్కొన్నారు. ఎస్‌ఛాంట్ మీడియా, ఎమ్3 ఎంటర్టైన్‌మెంట్ చిత్రామృతం కచేరీ డిసెంబర్ 22న శిల్పకళా వేదికలో జరగనుంది. టికెట్లు ఇప్పటికే బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయి. ఈ కచేరీ చిత్ర అమరగానాలు, సహగాయనుల నివాళులతో నిండిన రాత్రిని ఆహ్వానిస్తోంది. ఈ వేడుకను నిర్వహించిన ఎస్ ఛాంట్ మీడియా, ఎమ్3 ఎంటర్టైన్ మెంట్ వారు చిత్రకి ఈ అద్భుతమైన ఉత్సవం ద్వారా ఆమెను గౌరవించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, రాబోయే కచేరీపై తమ ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ అండ్ రీక్రియేషనల్ అరేనా-ది లీగ్ షురూ



నవతెలంగాన-సిటీబ్యూరో

ది లీగ్ హైదరాబాద్ అతిపెద్ద స్పోర్ట్స్ అరేనా, ఉత్తేజకరమైన అనుభవాలను, వినోద సౌకర్యాలను అందిస్తూ.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. శ్రీ వెంకటేశ్వర హోటల్స్ గ్రూప్ ప్రాజెక్ట్ ది లీగ్, ఇది అతిథులకు నాలుగు దశాబ్దాల ఆలోచనాత్మకమైన ఆతిథ్యం, సౌకర్యం, విలాసవంతమైన అనుభవాల వారసత్వంను అందిస్తుంది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ హోటల్స్ భాగస్వామి ఆర్‌వి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ "మా అభిమానుల అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా మేము నిరంతరం ఆవిష్కరణలను చేస్తూనే, ఉత్తేజకరమైన ఉత్పత్తులను అందిస్తున్నాము. 'ది లీగ్' అనేది ఐటి హబ్‌లో ఉన్న అత్యుత్తమ వినోద జోన్‌గా రూపొందించబడింది. ఉత్సాహభరితమైనప్పటికీ ప్రశాంతతతో కూడిన ఆతిథ్య అనుభవంతో పాటు క్రీడల మానసికోల్లాసం అందించడానికి అత్యాధునిక వేదికను కోరుకునే ఆధునిక ప్రపంచ పౌరుల అవసరాలను తీరుస్తుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సహోద్యోగులతో వినోదం, ఆహారం, విశ్రాంతి, ప్రత్యేకమైన, ఉల్లాసకరమైన అనుభవాన్ని పొందడానికి మా అతిథులకు ప్రాధాన్య వేదికగా మారాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. మా అతిథులకు గొప్ప అనుభవాలు అందించటంతో పాటుగా చిరునవ్వుతో ప్రాంగణం వీడే అనుభూతులను అందించాలని మేము కోరుకుంటున్నాము" అని అన్నారు.


టీఈఎంఐపీఎల్‌తో రాపిడో ఒప్పందం



నవతెలంగాన-సిటీబ్యూరో

ప్రముఖ బైక్, ఆటో, క్యాబ్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫారమ్ అయిన రాపిడో, తమ ఆటో కెప్టెన్ల ఆదాయాలు, ఆరోగ్యంను పెంచడానికి టోటల్ ఎనర్జీస్ మార్కెటింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో భాగస్వామ్యం చేసుకుంది. ఇది 12శాతం వరకూ తక్షణ ఇంధన ఆదాతో ప్రారంభమవుతుంది. హైదరాబాద్‌లో ఆటో ఎల్‌పిజిని స్వచ్ఛమైన ఇంధనంగా ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తుంది.

ఈ సందర్భంగా రాపిడో సహ-వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ "రాపిడో విజయానికి కేంద్రంగా మా ఆటో కెప్టెన్లు ఉన్నారు. ఈ భాగస్వామ్యం వారి జీవనోపాధిని మెరుగుపరచడంలో మా అంకితభావాన్ని నొక్కి చెబుతుంది. తక్షణ ఇంధన పొదుపు, వాహన నిర్వహణ వంటి మద్దతుల ద్వారా , హైదరాబాద్‌లోని మా కెప్టెన్‌లు ఎక్కువ ఆదా చేయడమే కాకుండా దీర్ఘ కాలంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన వనరులను కూడా పొందేలా మేము నిర్ధారిస్తున్నాము. ఈ భాగస్వామ్యం ఆర్థిక, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే డ్రైవర్-ఫస్ట్ ప్లాట్‌ఫారమ్‌ను నిర్మించాలనే మా లక్ష్యంని ప్రతిబింబిస్తుంది" అని అన్నారు.



పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొపెసర్ జీ.ఎన్. శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ హెచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు ఎరవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్‌లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యూనివర్సిటీల వీసీల జాబితాలో జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ప్రొపెసర్ జీ.ఎన్. శ్రీనివాస్ పాలమూరు యూనివర్సిటీ వీసీగా నియామకం చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో అయన ఛాంబర్‌లో శాలువా, పుష్ప గుచ్చంతో సన్మానం చేశారు. జేఎన్‌టీయూ హెచ్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ఎరవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్, విద్యార్థులు హేమంత్ రీఛార్డ్, సన్నీ ఇమ్మానుయేలు, తిరుపతి, లోకేశ్వర్, సాత్విక్, అబిలాష్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉద్యోగులకు వెంటనే

5 డీఏలు విడుదల చేయాలి

- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్



నవతెలంగాన-సిటీబ్యూరో

ఉద్యోగులకు వెంటనే ఐదు డిఏలు విడుదల చేయాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఉద్యోగులకు డిఏలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఒకపక్క ప్రజా పాలన అంటూ చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగుల రెగ్యులర్ డిఎలను గత ప్రభుత్వం రెండు పెండింగ్ డీఏలు పెడితే ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్యోగ కుటుంబాలు అధికారంలోకి తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం రెగ్యులర్‌గా డిఏలు ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సింది. కానీ గత ప్రభుత్వము అనుసరించిన విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వము ఉద్యోగుల పట్ల అనుసరించే విధానం ఒకటేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి చెక్క భజనలు, పాలాభి షేకాలు వత్తాసు పలకడం వలన పాలకులు ఉద్యోగస్తులను చులకనగా చూస్తున్నార న్నారు. ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యమత్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగస్తులకు ఇస్తానన్న హామీలను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు ప్రజాసంఘాల మద్దతు ఉంటుందని తెలిపారు. ఐదు డీఏలు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నూతన సీఐ నరసింహారాజుకు శుభాకాంక్షల వెల్లువ..



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ బాలానగర్ జోన్ పరిధిలోని బాలానగర్ స్టేషన్ సిఐ గా నరసింహారాజు ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం సీపీఐ(ఎం) బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ మాజీ సంయుక్త కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ తదితరులు కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. అదేవిధంగా అన్ని వర్గాల వారిని దృష్టిలో ఉంచుకుని సమన్యాయం జరిగేలా ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా పోలీసులకు సహకరిస్తామని ఆయన తెలిపారు.

నల్ల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రా నగర్‌లో నల్ల పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలు ఎలాంటి సమస్యలు తలెత్తినా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇంద్రా నగర్‌లో తాగునీరు, డ్రయినేజీ సమస్యలు తలెత్తుతున్నాయని కొందరు స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. బస్తీలలో నెలకొన్న మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్ ఆధ్వర్యంలో.. జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమ్మవారి కృపతో ఆలయ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పూర్తి చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ లక్ష్మయ్య, ప్రకాష్ ముదిరాజ్, శివ చౌదరి, రమణ, కనకయ్య, జ్యోతి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్ర ప్రసాద్‌ను పరామర్శించిన 'బండి'



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఇటీవల సిని నటుడు రాజేంద్ర ప్రసాద్ కూతురు గాయత్రి మృతి చెందడంతో.. శుక్రవారం సాయంత్రం కూకట్‌పల్లిలోని హిందూ విలాస్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆయనను కలిసి పరామర్శించారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాయత్రి మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, ప్రవీణ్, దినేష్ కుమార్, గంధం రాజు, అప్పారావు, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు వినతి



నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతూ కో-ఆపరేటివ్ రాష్ట్ర చైర్మెన్ రవీందర్‌రావుకు వినతి పత్రం అందజేసినట్టు డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్ కడ్తాల్ మండలాల పీఏసీఎస్ చైర్మెన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. శుక్రవారం జరిగిన రాష్ట్ర కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని వినతి పత్రం అందించినట్టు వెల్లడించారు. ఈ విషయంపై మేనేజింగ్ కమిటీ సానుకూలంగా స్పందించినట్టు ఆయన పేర్కొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.10ల నాణాల చెల్లుబాటుపై అవగాహన



నవతెలంగాణ హైదరాబాద్:

రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని కృష్ణానగర్ యాక్సిస్ బ్యాంకు బ్రాంచీ ఆధ్వర్యంలో రూ. 10ల నాణాల చెల్లుబాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొందరు పది రూపాయల నాణాలు చెల్లుబాటు కావడం లేదు అంటూ, వాటిని నిరాకరిస్తున్నారని, అది చట్టరీత్యా చెల్లుబాటు కాదని, అన్ని బ్యాంకులలో రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కృష్ణానగర్ బ్రాంచ్ పరిధిలోని వివిధ షాపుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంకు కృష్ణానగర్ బ్రాంచ్ హెడ్ బి. శాంతి ఆపరేషన్స్ హెడ్ ప్రసాద్ రెడ్డి మరియు బ్యాంకు సిబ్బంది ప్రవీణ్, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ 26వ వీసీగా ప్రొ.కుమార్

- గురి చూసి గోల్ కొట్టిన ప్రొ.కుమార్
- కలిసిరానున్న పరిపాలనా అనుభవం
- అకాడమీక్ అనుభవం సాంకేతిక పరిజ్ఞానం దిశగా అడుగులు..



నవతెలంగాణ, ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం 26వ, వీసీగా తొలి ఓయూ దళిత వీసీగా ఓయూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ యం.కుమార్ నియమితులయ్యారు. ప్రొ.కుమార్ సమర్థ అనుభవం తోపాటుగా సముచిత గౌరవం వందేళ్ల వైభవ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వ విద్యాలయం కొత్త వైస్ ఛాన్సలర్ గా సీనియర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పదవులకు వన్నెతో పాటుగా అపార అనుభవం..

ప్రస్తుతం రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌కు డైరెక్టర్‌గా ఉన్న ప్రొ.కుమార్ సివిల్ ఇంజినీరింగ్ రంగంలో అపార అనుభవశాలి. ఈ రంగంలో బోధన, పరిశోధనాంశాల్లో 29ఏండ్లకు పైగా వివిధ హెూదాల్లో సేవలు అందిస్తున్నారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే బ్యాచిలర్స్ డిగ్రి, జేఎన్‌టీయూ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రతిష్టాత్మక ఐఐటీ బాంబే నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. అక్కడ బోధన, పరిశోధన విభాగాల్లో తనదైన చెరగని ముద్ర వేశారు. ప్రొ. కుమార్ రాసిన 100కు పైగా పరిశోధన పత్రాలు అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్, కాన్ఫరెన్స్‌ల్లో ప్రచురితం అయ్యాయి. 90 మందికి పైగా ఎంటెక్, 10కి పైగా పీహెచ్‌డీ విద్యార్థుల డిసర్టేషన్, థీసిస్‌లకు పర్యవేక్షణ వహించారు.

సేవాలకు అవార్డ్స్

ఆయన సేవలకు గాను అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. 2018లో తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపకుడిగాను పురస్కారం తీసుకున్నారు. అదే ఏడాది ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్‌గాను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్, తెలంగాణ ప్రభుత్వం నుంచి అవార్డు తీసుకున్నారు. 2019లో స్మార్ట్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ నుంచి మోక్షగుండ విశ్వేశ్వరయ్య ఉత్తమ అధ్యాపకుడిగానూ పురస్కారం లభించింది. 2010 నుంచి 2014 మధ్య జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆయన అనేక పరిశోధన పత్రాలు విశేష గుర్తింపు పొందాయి.

పాలనలో కొత్తదనం.. ప్రత్యేక మార్క్

ప్రొ. కుమార్ అనేక పాలనా పరమైన బాధ్యతల్లో కూడా పాలు పంచుకున్నారు. 2019, 2020 టీఎస్ -పీజీసెట్‌కు కన్వీనర్, ఓయు అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్, ఓయూ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ విభాగం సంచాలకుడిగా, ఓయూ ఎగ్జామ్స్ సెల్, డైరెక్టర్ ఆఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధిపతిగా, ఓయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, ఓయు వైస్ ప్రిన్సిపాల్‌గానూ పనిచేశారు. ఎఫ్ఆఈ, ఐఆర్‌సీ, ఐయూటీ, సీటీఆర్‌జీ, ఐఐబీఈ, డబ్ల్యూసీటీఆర్, టీఆర్‌జీ వంటి పలు పరిశోధనా సంస్థల్లో జీవితాకాల సభ్యుడిగా కొనసాగుతున్నారు.

కంట్రోలర్‌గా ఆన్‌లైన్‌కు ఆధ్యం..

ప్రొ. కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేన్స్‌గా రెండేళ్ల పాటు పని చేశారు. ఆ సమయంలో పరీక్షల విభాగంలో అనేక డిజిటల్ సంస్కరణలు ప్రవేశ పెట్టారు. అక్కడి వ్యవస్థలు విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు తగిన స్థాయిలో మొత్తాన్ని ఆధునీకరించారు. దేశంలోనే పేరున్న ఉస్మానియం విశ్వవిద్యాలం ప్రిన్సిపాల్‌గా 2018-21 మధ్య సాంకేతికతంగా సంస్కరణల్లో ముందు వరసలో నిలిపారు. కళాశాల ప్రక్రియలు మొత్తం ఆటోమేషన్‌లోకి మర్చి యూజీ, పీజీ కోర్సులకు తిరిగి ఎన్‌బీఏ గుర్తింపు తీసుకుని రావడం లో విశేష కృషి చేశారు. ఇన్ని సేవలకు గుర్తుగానే తెలంగాణ ప్రభుత్వం ఆయనను ఉస్మాని యా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సావాల నిర్వాహక కమిటీలో సభ్యుడిగా నియమించింది. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎం.ఈ. ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ కోర్సు ప్రవేశ పెట్టడంలో ప్రొ.కూమార్ కీలకమైన పాత్రపోషించారు. ఆయన పరిశోధనా కార్యక్రమాలకు యూజీసీ, ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు, భారత ప్రభుత్వం, ఎస్ఈఆర్‌బీ, డీఎస్‌టీ నుంచి అనేక విధాల ఆర్థికసాయం అందించాయి. ప్రపంచవ్యాప్తంగా 15 దేశాల్లో 20నగరాల్లో పర్యటించి పరిశోధన పత్రాలు సమర్పించారు ప్రొ.కుమార్. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై లెక్కలేనన్ని కీలక ఉపన్యాసాలు ఇచ్చారు. చర్చ కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. అనేక సాంకేతిక, పరిశోధన సంస్థల్లో ప్రొ.కుమార్ క్రియాశీలక సభ్యుడిగా ఉన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ వారు నిర్వహించిన లీప్, మోనాష్ విశ్వవిద్యాలయం, హెచ్‌సియూ, వివిధ ఐఐఎంలు, ఐఎస్‌బీ నిర్వహించిన పలు నాయకత్వ శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాలు పంచుకున్నారు. ఆయన 2022 -24 మధ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఫాకల్టీ డీన్‌గా అత్యు న్నత స్థానంలో పనిచేశారు. ఆ సమయంలో ఎంతో విలువైన సేవలు అందించారు. సమిష్టి కృషి ఓయూ అభివృద్ధి యే లక్ష్యం గా ముందుకు సాగుతునాని తనను నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు ఉదయం 10 గంటలకు వీసీ గా బాధ్యతలు స్వీకరించనున్నారు.పలువురు ప్రొపెసర్స్ ,ఉద్యోగులు, విద్యార్థులు ప్రో.కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



నవ తెలంగాణ కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అస్మత్ పెట్ హిందూ స్మశాన వాటిక అడుగుతున్న పనులను పనులను బోయిని చెరువులో జరుగుతున్న కాలువ పనులను కార్పొరేటర్ ముద్దం పరిశీలించారు. కార్పొరేటర్‌తో ఈ గోవర్ధన్ గౌడ్ ఏ ఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపం ఉండకూడని ఎక్కడ రాజీపడదని ఆదేశించారు. అలాగే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

బంజారాహిల్స్‌లో 'టెలీటాస్క్' కార్యాలయం ప్రారంభం

- ఏడాది వ్యవధిలో 25 నగరాల్లో విస్తరణ లక్ష్యం
- గ్లోబల్ సీఈవో జాన్ వాండర్ బెకెన్



నవతెలంగాణ-బంజారా హిల్స్

అత్యాధునిక ఆటోమేషన్ సాంకేతికతకు ప్రసిద్ధి చెందిన 'టెలీటాస్క్' తన భారతీయ కార్యాలయాన్ని బంజారాహిల్స్‌లో బుధవారం ప్రారంభించింది. ఇది ప్రొడక్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా కూడా కస్టమర్లకు అందుబాటులో ఉంటుందనీ సంస్థ గ్లోబల్ సీఈవో జాన్ వాండర్ బెకెన్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఆటోమేషన్ ఉత్పత్తులలో ముందంజలో ఉన్నామని చెప్పారు. వీటిని నివాస, వాణిజ్య సముదాయాలలో సులభంగా ఉపయోగించవచ్చన్నారు. లైటింగ్, హెచ్‌వీఏసీ, మోటరైజ్డ్ కర్టెన్స్, బ్లైండ్స్, పవర్ సాకెట్స్, ఆడియో, సెక్యూరిటీ, యాక్సెస్ కంట్రోల్ వంటి వ్యవస్థలను సులభంగా స్మార్ట్ వాతావరణంలోకి మార్చుతుందని చెప్పారు.ఇవి కొత్త కట్టడాలు, పునర్నిర్మాణ ప్రాజెక్టులకు సులభంగా సరిపోతాయని తెలిపారు. 1984 నుంచి హెూమ్ ఆటోమేషన్ సొల్యూషన్స్‌లో అగ్రగామిగా ఉన్నామన్నారు. అధునాతన హెూమ్ ఆటోమేషన్ సొల్యూషన్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభతరం చేస్తాయన్నారు. జీవన అనుభవాన్ని మరింత ఉన్నతంగా మారుస్తాయని తెలిపారు. లైటింగ్, వాతావరణ నియంత్రణ, భద్రత, వినోద వ్యవస్థలను సమన్వయం చేస్తూ వినియోగదారులకు సౌకర్యవంతమైన ఇంటర్‌ఫేస్‌ను అందిస్తున్నామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్, కనెక్ట్ అయిన ఇంటిని ఆస్వాదించవచ్చని వివరించారు. బెల్జియంకు చెందిన టెలీటాస్క్ భారతదేశంలోని 12 ప్రధాన నగరాలలో విస్తరించిందన్నారు. వచ్చే ఏడాదికి 25 ప్రాంతాలకు విస్తరించడానికి ప్రణాళికలు ఉన్నాయన్నారు.2050 తర్వాత అవసరాలను కూడా తీర్చగలవన్నారు. విద్యుత్ స్మార్ట్ గ్రిడ్‌తో సమర్థవంతంగా అనుసంధానం కానున్నాయన్నారు. గాలి నాణ్యతను పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు ఎయిర్ ప్యూరిఫైయర్లను స్వయంచాలకంగా ప్రారంభిస్తాయన్నారు. ఇవన్నీ మానిషి అవసరం లేకుండా జరుగుతాయనీ తెలిపారు.

ప్రపంచ పీడీయాట్రిక్ బోన్ అండ్ జాన్ డే

ప్రాథమిక దశలోనే పిల్లల్లో ఎముకల బలహీనతలను గుర్తించాలి డాక్టర్ విద్యాసాగర్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రాథమిక దశలోనే పిల్లల్లో ఎముకల బలహీనతలను గుర్తిస్తే శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండానే సరి చేయవచ్చునని కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. భారతదేశ జనాభాలో 25శాతం మంది పిల్లలు ఉన్నారని ఎదుగుతున్న పిల్లల్లో తుంటి తొలగిపోవడం, విటమిన్ డి డెఫిషియన్సీ వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండానే చిన్నారుల ఎదుగుదలను ప్రోత్సహించవచ్చునన్నారు. శుక్రవారం బేగంపేట్ కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డైను పురస్కరించుకొని పిల్లల తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. పిల్లలు సాధారణంగా ఇంట్లో ఆడుకునే సమయంలో సాధారణ గాయాల బారిన పడకుండా ఉండేందుకు ఇంట్లో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని, మొబైల్ ఫోన్లు, ట్యాబ్ స్క్రీన్ సమయాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడంతో పాటు సన్ లైట్‌కు ఎక్స్పోజ్ అయ్యేలా శారీరకదారుఢ్యానికి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు బహిరంగంగా ఆడటం వలన పిల్లల్లో ఎముకల అభివృద్ధికి దోహదపడుతుందని ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు.

పేదలకు వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి



- ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

నిరుపేదలకు వైద్య సేవలను అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండిలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 55 మందికి రూ.20 లక్షల మేరకు విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం అందించారు. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలను వెనుదన్నుగా నిలవాల్సిందన్నారు. వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ప్రస్తుత రోజుల్లో పేదలు ఇబ్బంది పడకుండా తమ వంతు సహకరిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ శ్రీకాంత్, రాసూరి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫలమండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రభుత్వం పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్. బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంలను తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ (టీజీఏయూపీటీఏ) టిజిఆప్త కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి వారికి హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 13 యూనివర్సిటీలో పనిచేస్తున్నటువంటి పార్ట్ టైం లెక్చర్ల యొక్క సమస్యలు వివరించారు. ప్రతి పార్ట్ టైం లెక్చరర్‌కు కాలం, క్లాసులతో సంబంధం లేకుండా నెలకు రూ.50వేలు, 12 నెలలు ఇవ్వాలని తెలిపారు. సమస్యలు విన్న చైర్మెన్, వైస్ చైర్మెన్లు ప్రభుత్వంతో మాట్లాడి త్వరలో మీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఆప్త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.కుమార్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.శ్రీలక్ష్మి,డా వెంకట్ రెడ్డి, డా.కంచి రాజేష్, డా.మంచాల లింగ స్వామి, డా. శేఖర్, డా రాము, డా.భిక్షపతి, డా విఠల్, డా మాధవి, డా .ఎండి ఖాన్. డా. భీమ్ రావు, డా. పల్లవి, డా. వేణుగోపాల్ శ్రీ వైష్ణవ, డా గంగాధర్, డా ఏడుకొండల్, డా శంకర్, డా యూగంధర్, డా.రంజిత్, డా. రమేష్, శారీన్, పాల్గొన్నారు.

లాడ్జి -హెూటల్స్ నిర్వాహకులు పోలీసుల నిబంధనలు పాటించాలి

వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎస్ఆర్ నగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలోని లాడ్జిలు, హెూటల్స్, ఓయో లాడ్జిల్ల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నియమ నిబంధనలు పాటించాలని, శుక్రవారం అమీర్పేటలోని ధరంకరం రోడ్డులో గల వివేకానంద కమ్యూనిటీ హాల్స్, హెూటల్స్ యజమానులతో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ హెూటల్స్ యజమానులకు కొన్ని సూచనలు తెలియపరుస్తూ ,హెూటల్స్ కు వచ్చి రూములు ఎవరు తీసుకున్న, వారి ఆధార్ నంబర్, ఫ్యాన్ నెంబర్, ప్రస్తుతం ఉంటున్న ఇంటి నంబరు కంపల్సరీగా తీసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. మైనర్లు వస్తే రూములు ఇవ్వవద్దని, రూములు తీసుకున్న వారు పేకాట ఆడిన, మద్యం, గంజాయి డ్రగ్స్ సేవించిన, లాడ్జిలో రూమ్ తీసుకుని గంజాయి అమ్ముతున్న వెంటనే పోలీసులకు తెలియపరచాలని, సీసీ కెమెరాలు తప్పని సరిగా ఉండాలని, కెమెరాలు పనిచేయని యెడల హెూటల్ యజమానులే బాధ్యులు అవుతారని తెలిపారు. జ్యోతిష్యులు, మత ప్రచారం చేసేవారు రూముల్లో ఉన్న యెడల వెంటనే పోలీసులకు తెలియపరచాలని, ప్రతి రోజు బుకింగ్ అయిన రూముల వివరాలు, ఖాళీగా ఉన్న రూముల వివరాలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలని హెచ్చరించారు. రూములలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరిగిన యజమానులుగా మీరే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, బోరబండ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకు బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే

- ఎంబీబీఎస్ విద్యార్థి ఇంటికి వెళ్లి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్‌కి చెందిన జంగ రవి కూతురు జంగ రీతు ప్రసన్న లక్ష్మి అరుంధతి మెడికల్ కాలేజీ దుండిగల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజు రూ.29,000ల చెక్కు వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి ,కాలేరు నవీన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీవీ చారి , మాజీ ప్రధాన కార్యదర్శి సోమి రెడ్డి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ మాజీ ప్రిన్సిపాల్ ప్రొ.సత్యనారాయణ మృతి



నవతెలంగాణ, ఓయూ

ఓయూ విశ్రాంతి ప్రొఫెసర్ సత్యనారాయణ మృతి చెందారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిజి కల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ విశ్రాంత ప్రొఫెసర్ వడ్డేపల్లి సత్యనారాయణ (60) శుక్రవారం గుండెపోటుతో అకాల మృతి చెందారు. గజ్వేల్ లోని ఒక ప్రయివేటు యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ నియామకాల కోసం జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఉదయం12 గంటల 30 నిమిషాలకు ఆకస్మికంగా గుండెపో టుతో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజికల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1997లో చేరారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా, కాలేజీ ప్రిన్సిపాల్‌గా, విభాగం హెడ్ బిఓఎస్‌గా 6 సంవత్సరాలు పిఈ సెట్ కన్వీనర్‌గా, సెకెరేటరిగా వివిధ హదాల్లో ఆయన సుదీర్ఘ సేవలందించారు. రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్)2019 నుంచి 22 వరకు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌గా గత జులై నెలలో పదవి విరమణ చేశారు. పలువురు విద్యార్థులు అయిన వద్ద పీహెచ్డీలు పూర్తి చేశారు. ప్రొఫెసర్ సత్యనారాయణ అకాల మృతి పట్ల పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్, రాష్ట్రం డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సోమన్న, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. బాలరాజ, తెలంగాణ జూని యర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పర్వతాలు గౌడ్, రాష్ట్ర ఫిజికల్ ఎడిషన్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సోమేశ్వ రరావు, ఓయూ ప్రొఫెసర్ దీప్లా, ప్రొఫెసర్ సునీల్ కుమార్, విశ్రాంత ప్రొఫెసర్ పి. వెంకట్ రెడ్డి, ప్రొఫెసర్ ప్రభాకర్, డాక్టర్ జగన్మోహన్ తదితరులు ప్రొపెసర్ సత్యనారాయణ అకాల మృతి పట్ల వారు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు. నేడు వరంగల్ లోని అయిన స్వగ్రామమైన వడ్డేపల్లిలో అయిన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అయిన భార్య ,కుమార్తె, కుమారుడు, కుటుంబ సభ్యులు కన్నీరుమ న్నీరుగా విలపిస్తున్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి



నవతెలంగాణ-ఓయూ

ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కంటెస్టడ్ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటున్నారని నరేంద్ర మోడీ, కిషన్‌రెడ్డి నాయకత్వం బీజేపీ ప్రభుత్వం రావాలని తెలంగాణ ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్ బావి నందు సభ్యత్వంలో పాల్గొన్న మేకల సారంగపాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఆశలు వదులుకున్నారని ఎప్పుడు ఎన్నికలు పెట్టిన బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని మేకల సారంగపాణి అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని నియోజకవర్గంలో అభివృద్ధి జాడనేలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మారావు కనబడడం లేదని గతంలో మంత్రిగా డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన కూడా నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదని, పేదలకు ఆశలను నీరుగార్చాలని పద్మారావు ఈసారి డిపాజిట్ దక్కదని ప్రజలంటున్నారని మేకల సారంగపాణి అన్నారు. పద్మారావు నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరు చేసుకోవాలని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 50,000 మెంబర్షిప్ చేస్తామని దానికి అందరూ నాయకులు కార్యకర్తలు కష్టపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవుడు కుమార్, ఈ ఎల్ ప్రతాప్ కుమార్, సాయి వరుణ్ పాల్గొన్నారు.

నాణ్యతలేని ఆహార పంపిణీ ఎలా చేస్తారు!



నవతెలంగాణ-బంజారా హిల్స్

నాణ్యతలేని ఆహార పంపిణీ ఎలా చేస్తారు! పిల్లల ఆరోగ్యం పట్ల కొంచెం కూడా శ్రద్ధ వహించరా? వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మనీ కవితా రెడ్డి శుక్రవారం డివిజన్ పరిధిలోని అంగన్వాడి సెంటర్లను సందర్శించి చిన్నపిల్లలకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లను స్వయంగా తానే వలిచి పిల్లలకు తినిపిస్తూ గుడ్లను ఉడకబెట్టిన తర్వాత వెంటనే పొట్టు తొలగించి వేడివేడిగా తినిపించాలని అంగన్వాడి ఆయా టీచర్లను ఆదేశించారు. పిల్లలు తినే వివిధ రకాల ఆహార పదార్థాలను సంచుల్లో నింపి పెట్టడం దానికి దారాలు కట్టి అలాగే ఉంచడం వల్ల ఓ రకమైన దుర్గంధం వస్తుందని తెలిసి కూడా పిల్లలకు ఎలా తినడానికి ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ తీరు మార్చుకోకపోతే మరో మారు రిపీట్ అవుతే జోనల్, జీహెచ్ఎంసీ కమిషనర్లాకు సంబంధిత మంత్రికి సైతం ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ - జవహర్ నగర్

సీలింగ్ రాడుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం రేపని స్వామి (22) వృత్తి రీత్యా వైఫై కనెక్షన్ పనిచేస్తూ తల్లిదండ్రులతో కలిసి శ్రీ రామ్ నగర్ కాలనీ, బాలాజీనగర్‌లో సొంత ఇంట్లో ఉంటున్నారు. అతడి తల్లిదండ్రులు తరుచూ ఇంట్లో గొడవలు పడుతుడుండంతో అతను కౌన్సెలింగ్ ఇచ్చేవాడు. తన తల్లిదండ్రుల వల్ల కాలనీలో తన ఇమేజ్ తగ్గుతోందని భావించేవాడు. గురువారం సాయంత్రం తన పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి తల్లిదండ్రులు గొడవ పడుతుడుండంతో వారికి సర్ది చెప్పి రాత్రి భోజనం చేయకుండా గదిలో నిద్రపోయాడు. శుక్రవారం ఉదయం 4 గంటలకు అతని తల్లి లక్ష్మి, నిద్రలేపడానికి తలుపు కొట్టగా తలుపు తీయలేదు. కిటికీలోంచి గదిలోకి చూసే సరికి చీరతో ఉరేసుకుని ఉన్నాడు. వెంటనే స్థానికుల సహకారంతో తలుపులు పగలగొట్టి చూడగా స్వామి మృతి చెందినట్లు గుర్తించారు. శుక్రవారం స్వామి సోదరుడు రేపని వెంకటేష్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

22 న మహాత్మా గాంధీజీ స్ఫూర్తి పురస్కార ప్రదానం

నవతెంగాణ-కల్చరర్

ఈ నెల 22 వ తేదిన శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ అర్ అర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సీల్ వెల్ శ్రుతి లయమహాత్మా గాంధీజీ స్ఫూర్తి పురస్కారాలు ధరణి రుణ మాఫీ చైర్మన్ ఎం కోదండ రెడ్డికి, తెలంగాణ స్వాతంత్ర సమర యోధుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏటుకూరి కృష్ణ మూర్తికి బహుకరిస్తున్నామని సంస్థల ప్రతినిధులు బండారు సుబ్బారావు బొక్క భీం రెడ్డి పత్రికా విలేఖరులు తెలిపారు. ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా శాసన సభ్యుడు కూనంనేని సాంబశివ రావు లు పాల్గొని సంస్థ పక్షాన పురస్కారాలు బహుకరిస్తారని తెలిపారు.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొలేటి దామోదర్ , పన్నాల బాల్ రెడ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భం గా సీల్ వెల్ సినీ సుస్వరాలు 64 పేరిట సినీ గీతాలు ప్రముఖ గాయకులు ఆమని సుభాష్ శ్రీనివాస్ రాజన్, అనుష, నవిత, అరుణ, వెంకటేశ్వర్లు ఆలపిస్తారు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి





- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను అత్యంత ప్రాముఖ్యతతో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో గ్రూప్-1 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన కో-ఆర్డినేషన్ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 27 వరకు నగరంలో జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు 8 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి అన్ని కేంద్రాలకు పోలీసు బందోబస్తు, పర్యవేక్షణ మధ్య రూట్స్ వారిగా ప్రశ్నాపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు కేంద్రాలకు వెళ్లేటప్పుడు వారికి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో లైటింగ్, తాగునీరు, శానిటేషన్, కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. మహిళ, పురుష అభ్యర్థులకు వేరువేరుగా మొబైల్, బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రూప్-1 పరీక్షలకు 5,613 అభ్యర్థులు హాజరు కానున్నారని, 261 మంది పీడబ్ల్యూడీ అభ్యర్థులకు బేగంపేట ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల 'ఏ' లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలని, ఎగ్జామ్స్ సెంటర్స్‌లో నిరంతరం విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఒరిజినల్ ఐడీతో కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఈ.వెంకటాచారి, డీసీపీఎస్.భాస్కర్, ఏసీపీ అశోక్ కుమార్, ఎస్.భాస్కర్, సీహెచ్. అశోక్ కుమార్, భాస్కర్, ఆర్డీవోలు మహిపాల్ రెడ్డి, దశరథ్ సింగ్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్టుమెంట్, ఐడెంటిఫికేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్-2024

- అలంకృత రిసార్ట్‌లో ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేశ్ శర్మ

నవతెలంగాణ-శామీర్‌పేట



ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్-2024ను ఆలంకత రిసార్ట్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ప్రకతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్' అనే ఇతివత్తంతో ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్ ది అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ (ఏఓఐ ఎస్ జెడ్) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరగనుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మెన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ సాంకేతికత ఈఎన్‌టీ సేవలను ఎలా మారుస్తుందో అన్వేషించే కీలకమైన పరిస్థితులను సూచిస్తుందన్నారు. ఈ రంగం వేగంగా అభివద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్య సంరక్షణను విప్లవాత్మకంగా మార్చబోతుందని తెలిపారు. ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ ఎస్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో నర్వ్ స్టిమ్యులేషన్ వంటి కొత్త చికిత్సలను ప్రదర్శించడానికి, వివిధ అలర్జీలకు అధునాతన చికిత్సలను చర్చించనున్నారని తెలిపారు. ఈ ఈవెంట్ లక్ష్యం, రోగి సంరక్షణను మెరుగుపరచడం, చికిత్సా ఖర్చులను తగ్గించడం, ఆధునిక పరిష్కారాలను అందించడం అన్నారు. ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డీ ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణాది ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుల సదస్సు ప్రతి ఏడాదీ ఏదో ఒక రాష్ట్రంలో జరుగుతుందనీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇది రెండో సారి అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజులు జరగనున్న ఈ ఈవెంట్ ఈఎన్‌టీ నిపుణుల మధ్య సహకారం, జ్ఞానాన్ని పంచుకోవడం లక్ష్యంగా ఉంది. తద్వారా నైపుణ్యం, తాజా పురోగతులపై అవగాహన పెరుగుతుంది. వర్క్‌షాపులు, ఉపన్యాసాలు, పరస్పర చర్చలతో కూడిన సమగ్రమైన శిక్షణా అనుభవం లభిస్తుంది. సంప్రదాయ వైద్యం, ఆధునిక సాంకేతికత మధ్య వారధిగా ఈ ఈవెంట్ నిలిచింది. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ట్రాన్స్ జెండర్ మృతి

నవ తెలంగాణ - జవహర్ నగర్



సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఓ ట్రాన్స్ జెండర్ మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధోంతి బాలమణి (21), సంతోష్ (31)లకు 2012న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వారి సంతానంగా యోగేశ్వర్ (8) బాబు ఉన్నాడు. సంతోష్ నాలుగేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్‌గా మారి సరిత అని పేరు మార్చుకొని బాలాజీనగర్‌లోని వికలాంగుల కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ అప్పుడప్పుడు వచ్చేవాడు. సంతోష్‌కు తన తల్లి విజయలక్ష్మితో విభేదాలు రావడంతో ఆమె ఇల్లు వదిలి కుషాయిగూడలోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. కాగా శుక్రవారం ఉదయం సంతోష్ భార్య బాలమణి అతడికి ఫోన్ చేసి కొంతసేపు (సంతోష్ అలియాస్ సరితతో) మాట్లాడింది. ఆ తర్వాత 11:30 గంటలకు సంతోష్ వికలాంగుల కాలనీలోని తన అద్దె ఇంటికి వెళ్లి భార్యకు వీడియో కాల్ చేసి జాగ్రత్తగా చూసుకుంటానని, వెంటనే ఇంటికి రావాలని పట్టుబట్టాడు. రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని చున్నీ చూపించి బెదిరించాడు. బాలమణి వెంటనే పక్కింటి వారికి ఫోన్ చేయగా వారు ఇంటికి వెళ్లి తలుపులు తెరిచి చూడగా సంతోష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసు కున్న బాలమణి సంఘటనా స్థలానికి వెళ్లి అతడిని కిందికి దించి చూడగా మృతి చెందాడు. దీంతో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శాస్త్రీయ నృత్యం వల్ల ఎన్నో లాభాలు

నవతెలంగాణ-కల్చరర్

శాస్త్రీయ నృత్యం వల్ల మానసిక ఆనందమే కాక మరెన్నో లాభాలు వున్నాయని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు నాట్యం. నేర్చుకున్న వారిలో ఐ. క్యూ ఎక్కువ అని జిమ్ యుగా వారికి అవసరం లేదని ఆయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ నాట్య సంస్థ నృత్య కిన్నెర నిర్వహణలో విఖ్యాత కూచిపూడి నాట్య గురువు వేదాంతం జగన్నాథ శర్మ 42 వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అర్ ప్రసన్న రాణి కి పురస్కారం ప్రధాన సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వేణు గోపాలాచారి పురస్కారం బహుకరించి మాట్లాడారు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ నృత్యం మార్పు చెందాలని నేటి తరం కు ఆసక్తి కలిగించాలని కోరారు ప్రసన్న రాణి వందల మంది శిష్యులకు శిక్షణ ఇచ్చారని అభినందించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ వేదాంతం జగన్నాథ శర్మ కూచిపూడి నాట్య ప్రక్రియను ఉన్నత స్థానానికి నిలిపిన ప్రముఖులు అని వివ రించారు. అయన శిష్యురాలు ఉషా గాయత్రి గురువు సంస్మరణ గా ప్రతి ఏటా నృత్య గురువులను సత్కరించటం గురు పరంపర కు ఉదాహరణ అన్నారు ప్రసన్న రాణి సినీ నటన కన్న .నాట్యానికి ప్రాధాన్యత ఇచ్చి ఎందరో నృత్య కళా కారుల ను తయారు చేస్తున్నారు అని అభినందించారు. ప్రముఖ నాట్య గురువు వోలేటి రంగ మణి పురస్కార గ్రహీత ప్రసన్న రాణి వివరాలు పరిచయం చేశారు స్వాగతం పలికిన కిన్నెర రఘు రాం గతం లో ప్రఖ్యాత నాట్య గురువులు సుమతీ కౌశల్. శోభా నాయుడు తదితరులు ఈ పురస్కారం అందుకున్నారు అని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు తొలుత జగన్నాథ శర్మ రూప కల్పన చేసిన నృత్య అంశాలు డాక్టర్ ఉషా గాయత్రి శిష్య బృందం నర్తించారు

ప్రజల కోసం పోరాడే పోలీసులను గౌరవించడం బాధ్యత

- నేడు పోలీస్ అమరవీరుల దినోత్సవం
- ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే పోలీసుల విధులు భిన్నం
- అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నా విధులను మరువని పోలీసులు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకు గౌరవం చూపడం మనందరి బాధ్యత.ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీస్ మేల్కొని, శాంతి, భద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు.ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండుగ, పబ్బాలను మరిచి, ప్రజల కోసం జీవించి, తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించే ఒకే ఒక వ్యక్తి పోలీస్.పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడమే నేడు పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకోవడానికి ప్రధాన ఉద్దేశం.పోలీస్ విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది.ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయ్యేది కాదని, 24 గంటల ఉద్యోగం ఒక పోలీస్ ఉద్యోగమేనని, పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం, ప్రతిఒక్కరు ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసే, అన్ని పరిస్థితుల్లో, వేళల్లో పోలీసులే ముందుంటారు.సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతిఒక్కరూ ప్రతి అవసరానికి సాయం కోరేది పోలీసులనే దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను రక్షించేది పోలీసులే.శాంతి భద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్లను నియంత్రించడం పోలీస్ కర్తవ్యం.అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు.నిద్రాహారాలు మానీ డ్యూటీలు చేసే పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్న చూపే, సమయపాలన లేని విధులు, పై అధికారులతో తిట్లు, జనంతో చీత్కారాలు ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. అన్ని సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న ఎవరు గుర్తించడం లేదని చాలా మంది పోలీసులు వాపోతున్నారు.పోలీసులకు విశ్రాంతి కావాలనే విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు.

ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పోలీసులు

పోలీసులకు పని గంటలతో సంబంధం ఉండదు, నిత్యం అప్రమత్తంగా ఉండవలసిందే ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రతిక్షణం ఆలోచించవలసిందే దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.ఈ ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.పోలీసులు అందరినీ పరిగణలోకి తీసుకుంటే 70 శాతం మంది తల నొప్పి, బీపీ, మధుమేహం, మెడ, వెన్ను నొప్పి ఇలా ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. హెూంగార్డ్, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ళ పరిస్థితి మరి దారుణం.డ్యూటీకి వచ్చింది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేంత వరకు విరామం లేకుండా పని చేయవలసిందే, బందోబస్తు డ్యూటీల్లో పాల్గొనే వారి పరిస్థితి మరి దారుణం, సిబ్బంది కొరత కారణంగా సెలవులు మంజూరు కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రోజు 40 మంది సిబ్బంది అనారోగ్యంతోనే విధులకు హాజరవుతున్నట్లు సమాచారం.ట్రాఫిక్ డ్యూటీలు నిర్వహించే సిబ్బంది కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు.ట్రాఫిక్ సిబ్బంది అనారోగ్యకర వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నందున ప్రభుత్వం వారికి అదనపు వేతనం చెల్లిస్తున్న సరైన ఆరోగ్య పరీక్షలు లేని కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.ఇన్ని సమస్యల మధ్య సమాజానికి ఇంత సేవా చేస్తున్న పోలీసులను గౌరవించడం మనందరి బాధ్యత.

ఎంబీబీఎస్ విద్యార్థి చదువుకు ఉప్పల్ ఎమ్మెల్యే చేయూత



నవతెలంగాణ-కాప్రా త

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్‌వీ నగర్ కాలనీకి చెందిన శీతల విజయ్ కుమార్ కుమార్తె అఖిల ప్రతిమ మెడికల్ కాలేజీ వరంగల్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అలాగే వస్పతి శ్రీనివాస్ కుమారుడు జీవన్ కుమార్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజు రూ.29వేల చెక్కును మాజీ మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, వాసు, దయాకర్ రెడ్డి, నెమలి రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్‌పేట వ్యవసాయ సేవా సహకార సంఘం పరిధిలోని లక్ష్మాపుర్, ఉద్దమర్రి, కేశ్వాపూర్ గ్రామాలలో డీసీఎంఎస్ వైస్ చైర్మెన్, శామీర్‌పేట సొసైటీ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్‌రెడ్డి శుక్రవారం వరి ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకట్ రెడ్డి, వ్యవసాయాధికారి రమేష్, శామీర్‌పేట సొసైటీ వైస్ చైర్మెన్ ఐలయ్య యాదవ్, సీఈవో నర్సింహులు, డైరెక్టర్లు భూమి రెడ్డి, నర్సింహులు, భిక్షపతి,బావు సింగ్, ప్రతాప్ రెడ్డి, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, ఉద్దమర్రి మాజీ ఎంపీటీసీ దోసకాయల వెంకటేష్, విష్ణుగౌడ్, ఇంద్ర సేనా రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- క్షేత్రస్థాయిలో సమాచారంపై దృష్టి కేంద్రీకరించండి
- మీరిచ్చే సమాచారంతోనే ఉన్నతాధికారులపై చర్యలు
- స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పనితీరుపై సీపీ సీవీ ఆనంద్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ నిఘా విభాగం (స్పెషల్ బ్రాంచ్) సిబ్బందిని ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏడు జోన్ల స్పెషల్ బ్రాంచ్ అధికాలు, సిబ్బందితో సీపీ బంజారాహిల్స్‌లోని సీసీసీలో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి సీపీ మాట్లాడారు. పోలీసు శాఖలో నిఘా విభాగము(స్పెషల్ బ్రాంచ్) ఎంతో కీలకమైందన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో సమాచారం సేకరణపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి ఇవ్వడం వల్లనే ఇన్‌స్పెక్టర్ నుంచి ఉన్నత స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పోలీస్ శాఖకు స్పెషల్ బ్రాంచి విభాగము ఒక ముఖ్యమైన ఒక స్తంభం లాంటిదన్నారు. స్పెషల్ బ్రాంచిలో విధులు అంటే కొందరు పనిష్‌మెంట్‌గా భావిస్తుంటారని, ఆవిధంగా ఏ మాత్రం అనుకోవద్దన్నారు. ఇక్కడ పనిచేసినంత కాలం అంకితభావంతో పనిచేయాలని, మీ సర్వీసులో ఇందులో పనిచేసిన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానిక ప్రజలు, పెద్దలు, నాయకులతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ ఏ చిన్న సమాచారాన్ని సైతం నిర్లక్ష్యం చేయకుండా తక్షణం ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. ఎస్బీ సిబ్బంది, అధికారులు తమకు వచ్చే సమాచారం ఎక్కడి నుంచి వస్తుందనేది ఎప్పుడు కూడా బహిర్గతం చేయొద్దని, సోర్స్‌ను కాపాడుకుంటేనే మరింత ఎక్కువ సమాచారం, ఎక్కువ కాలంపాటు ఉంటుందన్నారు. బయటి నుంచి కొత్తగా వచ్చే వారిపై నిరంతర నిఘా అవసరమన్నారు. ఎక్కడైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నా, కొత్త వారు వచ్చినా వారికి సంబంధించిన హోటళ్లు, బస్తీ, కాలనీ వాసుల నుంచి సమాచారం వచ్చేవిధంగా సోర్స్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మరీ ముఖ్యంగా మన సరిహద్దు దేశాలనుండి నుంచి హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఎక్కువగా ఉంటారని, అలాంటి వారిపై నిరంతరం నిఘా అవసరమని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి సభలు, సమావేశాలు, క్లాసులు ఏర్పాటు చేసే వారి విషయంలో నిరంతరం సమాచారం వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీస్ సమర్థవంతంగా పనిచేయడంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది అత్యంత కీలకమైందనే విషయాన్ని ఎప్పుడు మర్చిపోవద్దని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో నిజాయితీతో, ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా పనిచేయాలని అలాంటప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందన్నారు. నిష్పక్షపాతంగా పనిచేయాలని, అవసరమైనప్పుడు నిర్దాక్షిణంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు కూడా ఎలాంటి పరిస్థితుల్లోనైనా పనిచేసేలా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ ఎస్. చైతన్య కుమార్‌తోపాటు ఎస్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె ఆదిత్య శ్రేయారెడ్డిల వివాహానికి హాజరు కావాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను ఘట్కేసర్ మున్సిపాలిటీలోని మర్రిపల్లి గూడ గ్రామ పెద్దలు, ఘట్కేసర్ మండల రైతు సమన్వయ కమిటీ ఉపాధ్యక్షులు చిలుకూరి మంకయ్య, సహకార బ్యాంక్ డైరెక్టర్ ధర్మారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిలుకూరి లక్ష్మణ్, వార్డు మెంబర్లు మేకల సాయికుమార్, చిలుగూరి ఆనంద్, పల్లపు శ్రీకాంత్, నాయకులు నక్కలపల్లి శ్రీశైలంలకు అందజేశారు. వివాహానికి హాజరై తన మనవరాలిని ఆశీర్వదించాలని మల్లారెడ్డి కోరారు.

నాగిళ్ల బాల్‌రెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ-కాప్రా

మల్కాజిగిరి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన నాగిళ్ల బాల్ రెడ్డిని శుభోదయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి, కంచికట్ల మల్లేష్, పలుగుల శీను, తోటకూర సురేష్ రెడ్డి, కృష్ణ, హరినాయి, రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

లలిత పరమేశ్వర దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



- పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆనంద్‌బాగ్ లలిత పరమేశ్వరి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు శుక్రవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఇన్‌స్పెక్టర్‌గా మోహన్ రెడ్డి, ఆలయ చైర్మెన్‌గా దాసరి లింగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా శారద, శ్యామల సాయినాథ్, వలపు ఏడుకొండలు, ములుగు రాజేష్, రాగం రాజు యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు జీఎన్‌వీ. సతీష్ కుమార్, జీడి సంపత్ గౌడ్, టీకే. శ్రీనివాస్, కొండగౌడ్, సంతోష్ రాందాస్, నరేందర్ గౌడ్, మహేందర్ గౌడ్, సానాది శంకర్, వినయ్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, ఫరీద్, కన్నెమల్ల నాగరాజు, సురేష్ సింగ్, చారి, బాలరాజు యాదవ్, కన్నా, సందీప్ గౌడ్, రఘు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

20న ముదిరాజుల అలయ్..బలయ్



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన చక్రిపురం క్రాస్‌రోడ్డులోని సిరి గార్డెన్‌లో ముదిరాజ్ బంధుమిత్రుల అలై బలై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్టల నాగరాజు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ ముదిరాజ్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నీలం మధు ముదిరాజ్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, దొంతర బోయిన మహేశ్వరి ముదిరాజ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్, ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు చప్పరి శంకర్, సురేందర్ బాబు, మోర రవికాంత్, పండుగ బాలు, దొంతర బోయిన కృపా సాగర్, బన్నాల ప్రవీణ్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డల పాండు ముదిరాజ్, జడల శంకర్ ముదిరాజ్, కొలిపాక కనకయ్య ముదిరాజ్, చింతల శేఖర్ ముదిరాజ్, కూర యాదగిరి ముదిరాజ్, కోల్కురి శ్రీకాంత్ ముదిరాజ్, పిట్టల భరత్ ముదిరాజ్, పిట్టల రాజు ముదిరాజ్, సారా ప్రశాంత్ ముదిరాజ్, సిహెచ్ బాలేష్ ముదిరాజ్, సిహెచ్ మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

కొనుగోలుదారులకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించేందుకు షాప్ యజమానులు కృషి చేయాలని ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ఏర్పాటు చేసిన జై భవానీ జ్యువెల్లర్ షాప్‌ను శుక్రవారం ప్రారంభిం టచారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ..ఘట్కేసర్ మున్సిపాలిటీతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మాధవ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ స్టీఫెన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్.కె షౌకత్, మాజీ వార్డ్ సభ్యులు జంగా రెడ్డి, సుధాకర్, రహీం, నాయకులు బొక్క విష్ణు వర్ధన్ రెడ్డి, మంకం రవి, జైపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణారెడ్డి , హరికిషన్ రెడ్డి , వేముల సాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను వినియోగించుకోవాలి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- లబ్దిదారులకు చెక్కు అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీఎంఆర్ఎఫ్‌ను అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు వినియోగించుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురైన నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన రాజ్ కిరణ్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.28500, విఘ్నేష్ గౌడ్‌కు మంజూరైన రూ. 60 వేల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ నంది కంటి శ్రీధర్, రావుల అంజయ్య, కరంచంద్, జి .కె హనుమంతరావు, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బేబీ పాండ్ రిటైనింగ్ పనులు పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ సఫిలగూడ లేక్ పార్క్‌లో దాదాపు రూ.59 లక్షలతో చేపట్టిన బేబీ పాండ్ రిటైనింగ్ పనులను శుక్రవారం కార్పొరేటర్ శ్రవణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలో పనులు పూర్తి చెయ్యాలని, పూర్తి స్థాయిలో లేక్‌ను తీర్చిదిద్దడానికి మరిన్ని నిధులు అవసరమని తెలిపారు. వెంటనే పాండ్‌ను విస్తరించడానికి నిధులు మంజూరు చెయ్యాలని అధికారులను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ నవీన్, రమేష్, నాగయ్య, వేణు యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు తూంకుంట విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆటపాటలతో పాటు చదువులోను ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి విద్యార్థులకు సూచించారు. తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలలో పాల్గొని గ్రూప్ డాన్స్ విభాగంలో జిల్లాలోనే మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర కళా ఉత్సవ పోటీలకు ఎంపికైన విద్యార్థులు సాయిహర్షిత, సంధ్య, పార్వతి, అనుష్క, శిరీష్ లను అభినందించారు. కొరియోగ్రాఫర్ రవిని శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమలేష్ ,అన్నపూర్ణ, నాగశారద వనజ, రజిని, వరలక్ష్మి ,శ్రీదేవి ,మంజుల ,పద్మ భాగ్యరేఖ ,మహేష్, ప్రియాంక , అనుష తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జ్ఞాన సరస్వతి దేవాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జ్ఞాన సరస్వతి దేవాలయం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు శుక్రవారం ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ చైర్మెన్‌గా కోకల హరీష్ కమిటీ సభ్యులుగా రాఘవేంద్రచారి, గోపీనాథ్, బాలస్వామి, మంగమ్మ, శ్రీకాంత్, బుచ్చిబాబు, ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాంగ్రెస్ మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు, నాయకులు జి ఎస్ వి సతీష్ కుమార్, ఉమేష్ సింగ్, బి కే శ్రీనివాస్, బాబు, సత్యానారాయణ, సంతోష్ రాందాస్, పివి సత్యనారాయణ, సందీప్ గౌడ్, రఘు యాదవ్, కన్నెమల్ల నాగరాజు, సురేష్ సింగ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, బాలరాజు యాదవ్, పంజా శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన రిసోర్స్ పర్సన్స్



నవతెలంగాన-సిటీబ్యూరో

జవహర్ నగర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్ శుక్రవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ మాట్లాడుతూ ఏండ్ల తరబడి పట్టణాల్లో ఉన్న మహిళలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కోట్ల కొద్ది రూపాయలు బ్యాంకుల్లో జమచేసి పేదరిక నిర్మూలనలో తమ వంతు కృషి చేస్తున్న ఆర్పిలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యూనిఫామ్ ఏర్పాటు చేయాలని, రాజకీయ నాయకుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆర్పీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్ బాలమణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనేక రకాల వాగ్దానాలు చేసి కాలయాపన చేసి ఆర్పీలను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వమైనా ఆర్పీల సమస్యలను పట్టించుకోవాలని ఆవేదన తెలిపారు. ఆర్పీల సేవలను నేటికీ ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే కాలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఐ రమేష్, జవహర్ నగర్ ఆర్పీలు వినోద అనురాధ, పద్మ, రజిత సుజాత, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చొక్కాలు విప్పించిన సెంట్ మేరీస్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-మేడ్చల్

హోంవర్క్ చేయలేదని, ఫీజులు కట్టలేదని విద్యార్థుల చొక్కాలు విప్పించి మోకాళ్ళపై నిలబెట్టిన సెంట్ మేరీస్ స్కూల్ గుర్తింపును రద్దు చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ..మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని సెంట్ మెరిస్ స్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థులు దసరా సెలవుల్లో హోంవర్క్ పూర్తి చేయలేదని, ఫీజులు చెల్లించలేదని వారి చొక్కాలు విప్పించి మోకాళ్లపై కూర్చోబెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యా బుద్ధులు నేర్పించాల్సిన యజమాన్యం విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్ పై జిల్లా విద్య అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. హోంవర్క్ చేయకపోయినా, ఫీజులు చెల్లించక పోయినా విద్యార్థుల తల్లిదండ్రులతో యజమాన్యం మాట్లాడాలి కానీ వారి పై దౌర్జన్యం ప్రయోగించొద్దని హెచ్చరించారు. ప్రయివేట్, కార్పొరేటు విద్యా సంస్థలపై స్వయంగా కలెక్టర్ పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల ఆత్మగౌరవని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న స్కూల్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. డీఈవో, ఎంఈవోలు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులతో కుమ్మక్కై, వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు,ఎస్ఎఫ్ఐ నాయకులు మనీష్,రాహుల్,దినేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం : ఎంఈవో రంగాచారి

సెంట్ మేరీస్ స్కూల్‌లో విద్యార్థుల చొక్కాలు విప్పి మోకాళ్లపై నిలబెట్టిన శిక్షించిన ఘటన తన దృష్టికి వచ్చిందని ఎంఈవో రంగాచారి తెలిపారు. ఈ ఘటనపై శనివారం స్కూల్‌ను సందర్శించి విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్కూల్‌లో ఇంకా ఏమైనా ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈటలను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటేష్ నాయక్



నవతెలంగాణ-శామీర్ పేట

బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ వెంకటేష్ నాయక్ తన జన్మదినం సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈటల వెంకటేష్ నాయక్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగం సుజిత్ పాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

నవతెలంగాణ-శామీర్‌పేట

కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. జీనోమ్ వ్యాలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 29న మూడుచింతలపల్లి మండలం జగంగూడ గ్రామానికి చెందిన కృష్ణ కుమార్ అనే వ్యక్తి తుర్కపల్లి పరిధిలోని భారత్ బయోటెక్ దగ్గర గొడవ జరుగుతుందని 100 నెంబరుకు డయల్ చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న జీనోమ్ వ్యాలీ పోలీసులు ఆలస్యంగా వచ్చారని మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదానికి దిగి వారిపై దాడి చేశాడు. ఈ దాడిలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన జీనోమ్ వ్యాలీ పోలీసులు పలుమార్లు అరెస్టు చేయడానికి వెళ్తితే అనారోగ్యంతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలుపారు. కాగా గురువారం కృష్ణ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌హెచ్ఓ యాదయ్య తెలిపారు.

పలు ప్రాంతాల్లో ఈడీ పర్యటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ 3 పరిధిలోని గుడిమల్కాపూర్, నవోదయ కాలనీల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ శుక్రవారం పర్యటించారు. ఆ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, సప్లై లెవల్స్, మురుగు నీటి నిర్వహణ తదితర పనుల్ని పరిశీలించారు. ఈడీ వెంట డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులున్నారు.

జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు -2024 పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాన-సిటీబ్యూరో

చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు - 2024 పోస్టర్ ను రాధిక గుప్తా తన ఛాంబర్‌లో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్ర ప్రచారం, శాస్త్ర దృకథం పెంపొందించడం బాధ్యతగా స్వీకరించి ఎంతో కృషి చేస్తున్న ఏకైక సంస్థ జనవిజ్ఞాన వేదిక అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయ కుమారి మాట్లాడుతూ బాల్యదశ నుంచే విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను తొలగించి, సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు, విద్యార్థి దశలో ఎంతో ఉపయోగకరమని అన్నారు. జన విజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నవంబర్ 7న, మండల స్థాయిలో నవంబర్ 21న , జిల్లా స్థాయిలో నవంబర్ 28న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 14,15,16 తేదీల్లో అదిలాబాదులో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా నాయకులు జెన్నీ, రామ్ మోహన్ రావు పాల్గొన్నారు.

పెద్దలు తమ పిల్లల జీవితం హాయిగా ఉండాలని ఎంతో ఆలోచించి పెండ్లి చేస్తారు. పిల్లలు కూడా ఎన్నో ఆలోచనలతో, ఆశలతో తమ జీవిత భాగస్వామితో తమ అందమైన జీవితాన్ని ఊహించుకుంటూ కొత్త జీవితంలోకి అడుగు పెడతారు. అయితే ఊహలకు, నిజ జీవితానికి ఎంతో తేడా ఉంటుంది. భార్యాభర్తల బంధం అంటే సినిమాల్లో చూపించినట్టు ఉండదు. సినిమాకూ, జీవితానికి చాలా తేడా ఉంటుంది. ఒకరి నుండి ఒకరు ఎన్నో ఆశిస్తుంటారు. వారు ఆశించినది దొరకనపుడు కుంగిపోతారు. అక్కడి నుండే ఇద్దరి మధ్య గొడవలు మొదలవుతాయి. అలాంటి ఓ జంట కథే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...

పడుకునే ముందు...

శరీరానికి మంచి నీరు ఎంతలా మేలు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జీవక్రియలన్నీ సక్రమంగా పనిచేయాలంటే కచ్చితంగా తగినంత నీరు తీసుకోవాలని చెబుతుంటారు. వైద్యుల సూచన ప్రకారం ప్రతీ రోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీటిని తీసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. శరీరంలో




అన్నిభాగాలు సక్రమంగా పనిచేయాలన్నా, డీహైడ్రేషన్‌కు గురికాకుండా శరీరం నిత్యం హైడ్రేట్‌గా ఉండాలన్నా కచ్చితంగా నీటిని తీసుకోవాలని చెబుతుంటారు. అయితే గోరువెచ్చని నీరు తాగడం వల్ల కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెబుతుంటారు. ప్రతీ రోజూ రాత్రి ఒక గ్లాసు గోరు వెచ్చిన నీరు తాగడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక వారం రోజులు గోరు వెచ్చని నీరు తాగితే చాలు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చెబుతున్నారు. ఇంతకీ గోరు వెచ్చని నీరు తాగడం వల్ల ఎలాంటి లాభాలు ఉంటాయో ఇప్పుడు చూద్దాం..

గోరువెచ్చని నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం డిటాక్స్‌ను పొందుతుంది. బరువు తగ్గడమే కాకుండా శరీరంలోని వ్యర్థ పదార్థాలన్నీ తొలగిపోతాయి. రాత్రి భోజనం చేసిన అరగంట తర్వాత, నిద్రించడానికి ముందు గోరువెచ్చని నీటిని తాగితే.. శరీర జీర్ణక్రియ మెరుగవుతుంది.

గోరువెచ్చని నీటిని తీసుకోవడం వల్ల రోజంతా శరీరం చురుకుగా ఉంటుంది. అలాగే గోరువెచ్చని నీటిలో 2 చుక్కల నిమ్మరసం కలిపితే శరీరానికి మరింత శక్తి అందుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మంచి నిద్ర సొంతమవుతుంది. ఒత్తిడి, డిప్రెషన్ తగ్గుముఖం పడతాయి. చర్మంపై ముడతలు దూరమవుతాయి. చర్మం బిగుతుగా మారుతుంది.

దగ్గరైతేనే దూరం తగ్గేది



విక్రమ్‌కు 28 ఏండ్లు ఉంటాయి. ఉన్నత చదువులు చదివాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. హైదరాబాద్‌లో రెండు ఇండ్లు ఉన్నాయి. ఊళ్లో నాలుగు ఎకరాల పొలం ఉంది. మంచి కుటుంబం. ఇంట్లో కూడా అందరూ బాగా చదువుకుని ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగాలు చేసి రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం వారిద్దరూ సమాజం కోసం ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ వయసులో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

విక్రమ్‌కు నీలిమతో పెండ్లి జరిగి ఏడాది అవుతుంది. అతనికి ఓ అక్క, అన్న ఉన్నారు. అక్క ఆంధ్రప్రదేశ్‌లో, అన్న బెంగుళూరులో స్థిరపడ్డారు. తల్లిదండ్రులు మాత్రం విక్రమ్‌తో ఉంటారు. నీలిమ కూడా ఉద్యోగం చేస్తుంది. ఉదయం ఇద్దరూ ఆఫీసుకు వెళ్ళి సాయంత్రం వస్తారు. ఇంట్లో పనులు చేయడానికి ఓ అమ్మాయి ఉంటుంది. వంట విక్రమ్ వాళ్ల అమ్మ చేస్తుంది. నీలిమకు వంట, ఇంట్లో పనులు చేయడం పెద్దగా అలవాటు లేదు. పెండ్లి తర్వాత నెమ్మదిగా నేర్చుకుంటుందిలే అంటూ అత్తమామలు ఆమెను సపోర్ట్ చేసేవారు. నీలిమను కోడలిగా కాకుండా సొంత కూతురిలా చూసుకుంటారు. అంతా బాగానే ఉంది కదా ఇంకేంటి సమస్యా... అనుకుంటున్నారా!

నీలిమ ఉద్యోగం చేస్తుంది కాబట్టి వచ్చిన జీతం మొత్తం తన దగ్గరే ఉంచుకుంటుంది. దానితో పాటుగా విక్రమ్ కూడా ప్రతి నెలా ఖర్చుల కోసం ఇరవై వేలు ఆమెకు ఇస్తాడు. అయినా ఆమెకు కావల్సిన బట్టలు, నగలు, బ్యూటీ ప్రొడెక్ట్స్ అన్నీ తనే ఇప్పిస్తాడు. అన్ని ఖర్చులు తనే చూసుకుంటాడు. భార్య అవసరాలన్నీ తీర్చడం తన బాధ్యత అని అనుకుంటాడు. కానీ నీలిమ ఎందుకో ఎప్పుడూ మూడీగా ఉంటుంది. విక్రమ్‌తో ప్రేమగా ఉండదు. ఆమె కోసం ఇంకేం చేయాలో అతనికి అర్థం కావడం లేదు. పైగా విక్రమ్‌ను అసలు దగ్గరకు రానీయదు. 'ఇప్పుడే నాకు ఇష్టం లేదు' అని దూరం పెడుతుంది.



> నీలిమ ఉద్యోగం చేస్తుంది కాబట్టి వచ్చిన జీతం మొత్తం తన దగ్గరే ఉంచుకుంటుంది. దానితో పాటుగా విక్రమ్ కూడా ప్రతి నెలా ఖర్చుల కోసం ఇరవై వేలు ఆమెకు ఇస్తాడు. అయినా ఆమెకు కావల్సిన బట్టలు, నగలు, బ్యూటీ ప్రొడెక్ట్స్ అన్నీ తనే ఇప్పిస్తాడు.

ఇలాంటి పరిస్థితుల్లోనే అతను ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చి 'నీలిమతో ఏదైనా సమస్య వుంటే కూర్చొని మాట్లాడుకుందాం. అవసరమైతే డాక్టర్ దగ్గరకు వెళదాం అన్నా నా మాట వినదు. ఈ విషయాలేవీ ఇంకా మా ఇంట్లో వాళ్లకు తెలియదు. ఎలా చెప్పాలో నాకు అర్థం కావడం లేదు. చెబితే నీలిమను ఎలా అర్థం చేసుకుంటారో అనే భయంతో చెప్పడం లేదు. కానీ సమస్యకు పరిష్కారం కావాలి' అంటూ బాధపడ్డాడు.

అంతా విన్న తర్వాత మేము నీలిమకు ఫోన్ చేసి పిలిపించాము. విక్రమ్ చెప్పిన విషయాల గురించి ఆమెతో మాట్లాడితే ఆమె ఆశ్చర్యకరమైన సమాధానం చెప్పింది. 'నాకు ఇప్పుడే పిల్లలు వద్దు. అందుకే విక్రమ్‌ను దూరం పెడుతున్నాను. పైగా నేను అతనికి దగ్గరైతే నన్ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంటాడు. ఆయన చెప్పింది నేను చేయాలంటాడు. అదే నేను విక్రమ్‌ను దూరం పెడితే నాకు ఏం కావాలంటే అది చేసిపెడతాడు. అవసరమైతే ఎక్కువగానే చేస్తాడు. ఇప్పుడు నాతో అలాగే ఉంటున్నాడు. నేను అడక్కపోయినా అన్నీ చేసిపెడుతున్నాడు. నాకు ఇలాగే బాగుంది' అంటూ చెప్పుకొచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

ఆమె చెప్పింది విన్న తర్వాత మేము ఇద్దరినీ కూర్చోబెట్టి 'పెద్దలు పిల్లలకు పెండ్లి చేసేది వారి భవిష్యత్తు బాగుండాలని. కుటుంబ వ్యవస్థ ముందుకు నడవాలని. ఇద్దరు జంటగా బతుకుతుంటే వారి వల్ల మంచి సమాజ నిర్మాణం జరగాలి. పెండ్లి తర్వాత ఇద్దరూ అనుభవించే సుఖం కేవలం తాత్కాలికమైనది. కానీ ఇద్దరూ కలిసి సంతోషంగా జీవితం గడపాలి. దీని వల్ల మానసికంగా, శారీరకంగా సంతోషంగా ఉండగలుగుతారు. మీ మధ్య ఉన్న మనస్పర్థలు దూరమవుతాయి. నువ్వు దూరం పెట్టడం వల్ల నీకు అతను అన్నీ చేసి పెడుతున్నాడని అనుకుంటున్నావు. మీ మధ్య బంధం ఇలాగే ఉంటే ఇలా ఎక్కువ కాలం సాగదు. అతను నిన్ను సంతోష పెట్టడానికి ఎన్నో చేస్తున్నాడు. అలాగే అతని ఆనందం గురించి కూడా నువ్వు ఆలోచించాలి కదా! లేదంటే మీ మధ్య సమస్యలు మొదలవుతాయి. ఇప్పటికే విక్రమ్ చాలా బాధపడుతున్నాడు. అందుకే మా దగ్గరకు వచ్చి తన బాధ చెప్పుకున్నాడు. అదే వాళ్ల ఇంట్లో చెబితే పరిస్థితి ఎలా ఉంటుంది. మీ అత్తమామలు నిన్ను తమ సొంత బిడ్డలా చూసుకుంటున్నారు. కానీ నువ్వు వాళ్ల కొడుకుని దగ్గరకు రానీయకుండా ఇబ్బంది పెడుతున్నావు. ఇప్పటికైనా బాగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకో. నీ భర్తతో సంతోషంగా ఉండు. భర్తకు దగ్గరవడం అంటే అతనికి లొంగి పోవడం కాదు. మీ ఇద్దరి మధ్య బంధం మరింత బలపడడం.

పిల్లలు ఇప్పుడే వద్దనుకుంటే ఇద్దరూ కలిసి దానికి కావల్సిన జాగ్రత్తలు తీసుకోండి. అంతే కానీ దూరంగా ఉండడం మీ భవిష్యత్తుకు మంచిది కాదు. అలా కాదని నువ్వు ఇంకా దూరం పెట్టాలని చూస్తే రేపు అతని ఆలోచనలు మరోలా మారిపోవచ్చు. తన దారి తను చూసుకోవచ్చు. అప్పుడు ఇబ్బందులు పడేది నువ్వే. నీకు మంచి కుటుంబం, భర్త దొరకారు. అనవసరమైన ఆలోచనలతో నీ జీవితాన్ని నువ్వే పాడుచేసుకోకు' అని అర్థమయ్యేలా చెప్పాము.



> అదే నేను విక్రమ్‌ను దూరం పెడితే నాకు ఏం కావాలంటే అది చేసిపెడతాడు. అవసరమైతే ఎక్కువగానే చేస్తాడు. ఇప్పుడు నాతో అలాగే ఉంటున్నాడు. నేను అడక్కపోయినా అన్నీ చేసిపెడుతున్నాడు. నాకు ఇలాగే బాగుంది'

అంతా విన్న తర్వాత 'మీరు చెప్పింది కూడా నిజమే మేడమ్. ఈ విధంగా నేను ఆలోచించలేకపోయాను. ఎంత బాధపడుతుంటే విక్రమ్ మీ దగ్గరకు వచ్చి ఉంటాడు. నేను చేస్తున్న పొరపాటు ఏంటో అర్థమయ్యింది. ఇకపై విక్రమ్‌ను ఇబ్బంది పెట్టను. ఇద్దరం సంతోషంగా ఉంటాము' అని చెప్పి భర్తతో వెళ్లిపోయింది.

- వై వరలక్ష్మి
9948794051

సుప్రీంకోర్టుకు గ్రూప్-1 అభ్యర్థులు

21న విచారిస్తాం : సీజేఐ ధర్మాసనం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరీక్షల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కాలేదని, అత్యవసరంగా ఈ పిటిషన్‌ను విచారించాలని కోరారు. శుక్రవారం అభ్యర్థుల తరపున మోహిత్‌రావు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ఎదుట స్పెషల్ మెన్షన్ చేశారు. తక్షణం ఈ పిటిషన్‌ను విచారించలేమని, 21న విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం అభ్యర్థులు ఢిల్లీ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పిటిషన్‌పై సోమవారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. తీర్పు వచ్చే దాకా గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, అదే రోజు గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పార్టీ ఫిరాయింపుదారులపై కేసులు వేశా

అందుకే నన్ను చంపేస్తామని బెదిరింపులు : ప్రజాశాంతి అధ్యక్షుడు కేఏ పాల్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై కేసులు వేశానని.. వారు డిస్‌క్వాలిఫై అయ్యే అవకాశాలున్నాయని ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ అన్నారు. అందుకే వారి నుంచి చంపేస్తానని బెదిరింపులు వస్తున్నట్టు ఆయన ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తనకు దేవుడే సెక్యూరిటీ అని, తనను చంపాలనుకున్న వారు కలలో కూడా బాగుపడరని ఫైర్ అయ్యారు. 'నన్ను చంపాలని ప్రయత్నిస్తున్న ప్రతీ ఒక్కరు చస్తారు. నేను అనాథలు, వితంతువులను ఆదుకున్నాను. యువతకు ట్రైనింగ్ ఇప్పించాను. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు ఆపి శాంతిని నెలకొల్పాను' అంటూ తనదైన శైలిలో మాట్లాడారు. తెలంగాణాలో గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని.. వాళ్లకు నెల, రెండు నెలలు సమయం ఇస్తే తప్పేంటని పాల్ ప్రశ్నించారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి పెద్ద డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఈవీఎంలు వద్దని, ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ ఉపయోగించాలని సుప్రీం కోర్టులో పిల్ వేయబోతున్నట్టు తెలిపారు.

సీఎం ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీస్ జులుం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీసులు జులుం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అశోక్‌నగర్‌లో గ్రూప్ 1 అభ్యర్థులపై పోలీసుల లాఠీ ఛార్జీని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ తెలంగాణ ఉద్యమం నాటి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అమ్మాయిలని కూడా చూడకుండా ఇంత దుర్మార్గంగా వ్యవహరించిన రేవంత్ సర్కార్ను తెలంగాణ ప్రజలు క్షమించరని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చిన రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పత్తా లేకుండా పోయారని విమర్శించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను, గ్రూప్ 1 అభ్యర్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేపటితరం కోసమే మూసీ ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

వివిధ రకాల వ్యాపారాల్లో భాగస్వాముల్ని చేస్తామని తెలిపారు. మూసీ నది నుంచి పునరావాసం పొందిన వారి పిల్లలకు అన్ని రకాల విద్య, వైద్య సదుపాయాలను కల్పిస్తామన్నారు.

బ్యూటిఫికేషన్ కాదు..లూటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

పూర్వోత్తరాలను పేర్కొంటూ, తమ ప్రభుత్వ హయాంలో దాని ప్రక్షాళన కోసం చేపట్టిన చర్యలను అంకెలు, సంఖ్యలతో సహా ఆయన వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి రేవంత్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇందుకు సంబంధించి సీఎం రోజుకో మాట మాట్లాడుతూ ప్రజల్ని గందరగోళంలో పడేస్తున్నారని విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో బడే భాయ్ (ప్రధాని మోడీ) కూడా ఈ రకంగానే వ్యవహరించి, జనాన్ని వంచించారని దుయ్యబట్టారు. ఇప్పుడు చోటే భాయ్ (ముఖ్యమంత్రి రేవంత్) కూడా అదే బాటలో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ పరీవాహక ప్రాంతంలో ఎలాంటి సర్వే చేయలేదని అన్నారు. ప్రాజెక్టు వ్యయాన్ని తొలుత రూ.50 వేల కోట్లుగా చెప్పిన సీఎం, ఆ తర్వాత దాన్ని రూ.లక్షన్నర కోట్లకు పెంచారని విమర్శించారు. ఈ అంశంపై సర్కారును ప్రశ్నిస్తే... నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు గావు కేకలు, పెడబొబ్బలు పెడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ మాదిరిగా అవగాహనారాహిత్యంతో కాకుండా విషయం తెలుసుకుని మాట్లాడాలంటూ వారికి చురకలంటించారు.

తమ ప్రభుత్వ హయాంలో మూసీ ప్రాజెక్టు కోసం రూ.16 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. అందులో భాగంగా కొన్ని పనులను కూడా చేపట్టామని తెలిపారు. మురుగు నీటి శుద్ధి కోసం 31 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీలు)ను మంజూరు చేశామన్నారు. వాటన్నింటినీ పూర్తి చేస్తే నల్లగొండకు స్వచ్ఛమైన నీటిని అందించవచ్చని వివరించారు. మరోవైపు గత పదేండ్లలో ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలాల అభివృద్ధి పథకం)ని చేపట్టటం ద్వారా హైదరాబాద్‌లో వాన నీటిని నిలవకుండా చేయగలిగామని అన్నారు. అలాంటి ఎస్ఎన్‌డీపీ రెండో దశను కాంగ్రెస్ సర్కారు రద్దు చేయటం శోచనీయమన్నారు. మూసీ సుందరీకరణ కోసం తమ ప్రభుత్వం ప్రపంచస్థాయిలోని తొమ్మిది కంపెనీలతో డిజైన్లు రూపొందించిందని గుర్తు చేశారు. ఇప్పుడు రేవంత్ సర్కార్ వాటిని వదిలేసి, కొత్త డిజైన్ల కోసం ప్రజాధనాన్ని వృధా చేసేందుకు ప్రయత్నించటం సరికాదని విమర్శించారు. అయినా మూసీ పరివాహక ప్రాంతంలోని వారికి లేని ఇబ్బంది ప్రభుత్వానికెందుకని ప్రశ్నించారు. బుల్డోజర్లు పంపి పేదల ఇండ్లను ఎందుకు కూల్చుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు తెలంగాణ గుర్తుకొస్తుందనీ, ఆ క్రమంలో ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పేరిట రూ.లక్షన్నర కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేయబోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో రాహుల్‌కు వాటాలున్నాయనే అనుమానాలొస్తున్నాయని వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ వివరణివ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఎంచుకున్న 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి పాకిస్తాన్ సర్కార్ రెడ్ కార్నర్ నోటీసులిచ్చిందనీ, జార్ఖండ్ ప్రభుత్వం సైతం బ్లాక్ లిస్టులో పెట్టిందని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కూడా అదే పని చేసిందని అన్నారు. అలాంటి కంపెనీకి పనులు అప్పజెప్పటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. శాసనసభ, మండలిలో ఇలాంటి అంశాలను లేవనెత్తేందుకు అవకాశమివ్వకుండా తమ గొంతు నొక్కుతున్నారని వాపోయారు. రేవంత్ రెడ్డి మీద కేసులున్నాయనీ, అందుకే ఆయన ప్రధానికి దాసోహమంటూ దామగుండం అడవులను కేంద్రానికి అప్పజెప్పారని కేటీఆర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వానికి దమ్ముంటే మల్లన్న సాగర్ నిర్వాసితులకు బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని మూసీ నిర్వాసితులకు అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సవాల్ చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని వెకిలి దాడి చేసినా తాము ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. పలు నదులు నగరాల మధ్య నుంచి వెళ్తున్న సంగతి కూడా సీఎంకు తెలియదని ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు తాము 4,000 ఇండ్లు కట్టిస్తే ఒక్క ఇల్లు నిర్మించలేదని అబద్ధం చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుందరీకరణ, పునర్జీవం వేరు వేరనీ, రెండింటిని చెప్పింది సీఎం రేవంత్ రెడ్డియేనని తప్పుపట్టారు.

రూ,3,800 కోట్లతో 31 ఎస్టీలను మంజూరు చేసి మూసీ నదిని పునర్జీవనం చేసే ప్రయత్నం చేశామనీ, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.1,100 కోట్లతో ముత్తంగి జంక్షన్ వద్ద గోదావరి నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ద్వారా మూసీ శుద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించామని తెలిపారు. గోదావరి నది జలాలను మూసీ నదికి తెచ్చేందుకు వాప్కోస్ కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపిఆర్ కూడా సమర్పించిందని గుర్తుచేశారు. మల్లన్న సాగర్ నుంచి మూసికి నీళ్ళు తెచ్చేందుకు రూ.4,000 కోట్లు ఖర్చు పెట్టడం కేవలం కాంట్రాక్టర్లకు లాభం చేసే కుట్రని విమర్శించారు.

మూసీ పునర్జీవంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇండస్ట్రియల్ ఏరియాల నుంచి వచ్చు వ్యర్థాలను రాకుండా ఆపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో పరిశ్రమలను ఫార్మాసిటీకి తరలిస్తే వ్యర్థాలను తగ్గించవచ్చని సూచించారు. మల్లన్నసాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో ప్రజలతో మాట్లాడేందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు. హైకోర్టులో ఫార్మాసిటీ కొనసాగుతుందని చెప్పి బయట ఫోర్త్ సిటీ అని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.

మూసీపై ప్రతిపక్షానిది రాజకీయం : మంత్రి దామోదర రాజనర్సింహ

మూసీపై ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం 2016లో మూసీ రివర్ డెవలప్‌మెంట్ బోర్డు కోసం జీవో తెచ్చిందనీ, సరిహద్దులను నిర్ణయించిందని గుర్తుచేశాట్కరు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసి డైరెక్షన్ మినట్స్ ఇచ్చి వారే రాజకీయం చేస్తున్నారని తెలిపారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. మల్లన్నసాగర్‌లో 14 గ్రామాలు మునిగితే భూనిర్వాసితులకు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు.

అటు కొనుగోళ్లు..ఇటు నిరీక్షణ

(మొదటిపేజీ తరువాయి)

తాము ఎక్కువ ఇస్తూ, మూడు రోజుల్లో డబ్బులు ఇస్తామని హామీ ఇవ్వడంతో ధాన్యం ఎండబెట్టలేని పరిస్థితిల్లో ఉన్న రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ధాన్యంకొనుగోలు కేంద్రాలకు రైస్‌మిల్లుల కేటాయింపు ఇప్పటికీ జరగకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని సొసైటీ కార్యదర్శులు అంటున్నారు. ఇదే విషయాన్ని శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో కార్యదర్శులు చెప్పి.. వెంటనే కేటాయింపులు జరపాలని విన్నవించినట్టు తెలిసింది.

- అకాల వర్షంతో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టార్పలిన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భీమదేవర మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం కొనుగోలు జరగడం లేదు. మండలంలో దొడ్డు ధాన్యాన్ని రైతుల నుంచి క్వింటాల్‌కు రూ2వేల చొప్పున మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు.

- కరీంనగర్ జిల్లాలో వరికోతలు ప్రారంభమయినా.. కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. మరోపక్క వర్షం పడుతుండటంతో ధాన్యం తడిసిపోతోంది. కేంద్రాలకు టార్పలిన్లు చేరలేదు.

- మహబూబ్‌నగర్ జిల్లాలో వరికోతలు ప్రారంభం కాకపోవడంతో కొనుగోలు కేంద్రాలనూ ప్రారంభించలేదు. కోతలు సిద్ధం అయితే కేంద్రాలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

హామీ లేని 'ఉపాధి'

(మొదటిపేజీ తరువాయి)

కూడా తక్కువగా పడుతున్నాయి. రూ.125 సగటు కూలి పడుతున్నది. బయట పనికెళ్తే రోజు కూలి రూ.300 నుంచి రూ.700 వరకు దక్కుతున్నది. మరోవైపు ఆ అరకొర వేతనాలనూ పెండింగ్‌లో పెడుతున్న పరిస్థితి. ఉపాధి హామీ పనులకు పోతే వేతనాలు సరిగా రావు అనే అభద్రతాభావం కూలీల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఫలితంగా పనులకు రావడానికి కూలీల్లో అనాసక్తి కనిపిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యాలకు నీళ్లొదిలి వ్యవసాయానికి అనుసంధానం చేసే ప్రక్రియ ఊపందుకున్నది. వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదనే సాకును పాలకులు చూపెడుతున్నారు.

ఎన్ఈపీని అమలు చేస్తామనడం దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేస్తామనీ, అలా చేస్తేనే యూజీసీ నిధులు వస్తాయంటూ ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి ప్రకటించడం దుర్మార్గమని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దేశంలో ప్రయివేట్ విద్యావిధానాన్ని ప్రోత్సహించి, వ్యాపారమయం చేయడం నూతన విద్యావిధానం లక్ష్యమని పేర్కొన్నారు. పేదలకు విద్య అందకుండా పోయే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల మూసివేత, విశ్వవిద్యాలయాల పాత్ర తగ్గించడం, విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహిస్తున్న ఎన్ఈపీని రాష్ట్రంలో అమలు చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయానికి పాతరేసి ఉన్న విద్యా అవకాశాలు కూడా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు లేకుండా చేసి అసమానతలను సృష్టించే నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్నతవిద్యను బలోపేతం చేయాలనీ, విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై కేంద్రీకరణ చేయాలని సూచించారు.

మూసీపై ప్రభుత్వ ప్రతిపాదనను అఖిలపక్షం ముందుంచాలి

(మొదటిపేజీ తరువాయి)

కూడా రాతపూర్వకంగా ఇస్తామంటున్నదని తెలిపారు. ఇది అప్రజాస్వామిక ధోరణి, ఏకపక్షంగా ప్రభుత్వమే ఒక నిర్ణయానికొచ్చి, దానిమీద సందేహాలు ఏమైనా ఉంటే అడగాలంటున్నదని విమర్శించారు. పైగా చర్చలు కాకుండా, లేఖల రూపంలో సమాధానమిస్తామంటున్నదని పేర్కొన్నారు. ఈ ఏకపక్ష ధోరణి సరైనదికాదని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ ప్రతిపాదనను రాజకీయ పార్టీలకు అందజేసి, అధ్యయనానికి తగు సమయమిచ్చి, అఖిలపక్ష సమావేశాన్ని పిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రూప్-1 అభ్యర్థులపై విరిగిన లాఠీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ జీవో రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదని, రిజర్వేషన్లలోనూ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించి దాదాపు 22 కేసులు కోర్టులో ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా పరీక్ష నిర్వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయపరమైన సమస్యలన్నీ తీరాకే పరీక్ష నిర్వహించాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమానుషం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను 55 జీవో ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జీ చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న 29 జీవో ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థిని జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణించడం వల్ల ఇతర రిజర్వ్‌డ్ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. కావున 29 జీవోను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లను ఆన్సర్ బుక్‌లెట్లపై ముద్రించి అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జీ చేయడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అభ్యర్థులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

జమిలీ ఎన్నికలు దేశానికి నష్టం

ధరల పెరుగుదలకు మోడీ ప్రభుత్వానిదే బాధ్యత

- లౌకిక విలువలు, మూలాలను నరికే ప్రయత్నం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

జమిలీ ఎన్నికలు దేశానికి నష్టమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లో 'జమిలి ఎన్నికలు - ఒకే దేశం- ఒకే ఎన్నిక, కేంద్ర ప్రభుత్వం- ప్రజా వ్యతిరేక విధానాల'పై సదస్సు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పి.సత్యం అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్.వీరయ్య మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా జమిలీ ఎన్నికలు నిర్వహించాలని చూస్తోందన్నారు. అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం రాష్ట్రాల హక్కులను హరించడమేనన్నారు. రాష్ట్రాలను మోడీ ప్రభుత్వం ఖాతరు చేయడం లేదన్నారు. విధానాలన్నీ కేంద్రమే నిర్ణయిస్తూ, రాష్ట్రాల చేతుల్లోకి నెడుతుందని చెప్పారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రాలపై రుద్దేస్తోందన్నారు. జీఎస్టీ పేరుతో వనరులన్నీ కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎమర్జెన్సీని మించి నియంతృత్వ పాలన అమల్లోకి వస్తోందని, ఇందుకు వ్యతిరేకంగా జనం కదలాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

'జమిలీ ఎన్నికలు - ఒకే దేశం.. ఒకే ఎన్నిక, కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల'పై సదస్సు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. దేశంలో రోజుకు 86 లైంగిక దాడులు, గంటకు 44 నేర పూరిత దాడులు మహిళలపై జరుగుతున్నట్టు కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక బరితెగించి మరీ మహిళలపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని లౌకిక విలువలు, మూలాలను నరికే ప్రయత్నం జరుగుతోందన్నారు. నిత్యావసరాల ధరలు పెరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. క్రుడాయిల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు, రసాయనాల ధరలు, నిత్యావసరాల ధరలు పెరుగుతాయన్నారు. 2014లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ధరల నియంత్రణను తొలగించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరలను కట్టడి చేయడం లేదని అన్నారు. మోడీ హయాంలో ధరలను నియంత్రించక పోగా.. సెస్సులు, పన్నుల ద్వారా కేంద్రం తన ఖజానాను నింపుకుంటోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నా.. దేశంలో తగ్గడం లేదని, ఇందుకు మోడీ ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు ఒకే స్థాయికి రావడం ఇదే తొలిసారి అన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక అంబానీ, అదానీ, బిర్లాలు, టాటాలే లాభపడుతున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం కొత్త పరిశ్రమల గురించి మాట్లాడుతుంది తప్పితే, మూతబడుతున్న పరిశ్రమల ప్రస్తావన తేవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా చిన్న, సూక్ష్మ పరిశ్రమలు మూతబడ్డాయన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని, నిరుద్యోగం పెరుగుతోందని, యూనియన్లు తగ్గిపోతున్నాయని, ఇవన్నీ పెట్టుబడిదారులు దోచుకోవడానికి అనుకూలతను కల్పిస్తున్నాయని వివరించారు. ఈ సదస్సులో సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రవి, జె.చంద్రశేఖర్, ఎ.అశోక్, నాయకులు జి.శ్రీనివాసులు, ఐ.రాజశేఖర్, ఎన్.శ్రీనివాస్, ఆర్.సంతోష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆధునీకరణతోనే కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు

తాటి ఉత్పత్తి పరిశ్రమలకు సర్కారు సహకరించాలి

- కల్లు ఉపయోగాలపై ప్రభుత్వం హోర్డింగులు పెట్టాలి
- వనాల కోసం ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమివ్వాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆదరణ కోల్పోతున్న కల్లుగీత వృత్తికి జీవం పోసేందుకు ఆ వృత్తిని ఆధునీకరణ చేయాల్సిన అవసరముందని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. విద్యావంతులైన యువత కోసం తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. అందుకనుగుణంగా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోషక విలువలున్న కల్లు తాగడంపై కార్పొరేట్ సంస్థలు ప్రతికూల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లు తాగితే కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం విరివిరిగా హోర్డింగులు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్లో లభించే కూల్‌డ్రింక్స్ కంటే కల్లు తాగడం వందల రెట్లు మేలని గుర్తు చేశారు. గీత వృత్తికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రతి సొసైటీకి జీవో 560 ప్రకారం ఐదెకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆ సంఘం 67వ వార్షికోత్సవాల సందర్భంగా 'తెలంగాణలో పదేండ్ల ప్రయాణం- కల్లు గీత వృత్తి ఉపాధి అవకాశాల'పై ఆ సంఘం అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు పోవాలన్నారు. ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ కోసం గతంలో 300 దరఖాస్తులకు మాత్రమే పరిమితి ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని వెయ్యికి పెంచిందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అన్ని అంశాలను అమలు చేసేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. బీసీ కులగణన సమయంలో కేజీకేఎస్ కీలకంగా పని చేసి అన్ని వివరాలు సమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. 'కాటమయ్య రక్షణ కవచం' పథకం గీత కార్మికుల ప్రాణాలను కాపాడుతోందన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి : కేజీకేఎస్ రాష్ట్రస్థాయి సెమినార్‌లో వక్తలు

టాడీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల హక్కుల కోసం నాయకులు నిబద్ధత, అంకితభావంతో పోరాడుతున్నారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో గీత వృత్తి నిరాధరణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునీకరించకపోవడం వల్ల ఆ వృత్తి కనుమరుగయ్యే పరిస్థితులు వచ్చాయన్నారు. తాటిలో నూతన వంగడాలు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆధునిక పనిముట్లు లేకపోవడంతో ప్రతి ఏటా ఆరేడు వందల మంది గీత కార్మికులు చనిపోతున్నారని చెప్పారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ కవచంపై తాను చైర్మెన్‌గా ఉండగానే ప్రయత్నాలు మొదలు పెట్టానని గుర్తు చేశారు. బీసీ కమిషన్ సభ్యులు రంగు బాల లక్ష్మి మాట్లాడుతూ వృత్తిపై ఆధారపడుతున్న కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వృత్తిదారులు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రతి ఇంట్లో కల్లు విలువను తెలియ జేయాలన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు యం.వి. రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని కోరారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి భూమి, కల్లుకు మార్కెట్ సౌకర్యం, నీరా తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వృత్తి చేసే వారందరికీ సేఫ్టీ కిట్టులు, ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మెన్ బాలగోని బాలరాజ్ గౌడ్, సుప్రజ ఆస్పత్రి ఎమ్‌డీ శిగ విజయ్ కుమార్‌గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు చింతల మల్లేశం గౌడ్, సమన్వయ కమిటీ కన్వీనర్ ఆయిలి వెంకన్న గౌడ్, ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ సదానందం గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జిక్కి వీరస్వామి గౌడ్, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేములయ్యగౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు మాట్లాడారు. అంతకు ముందు ఆ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మాటూరి బాల్‌రాజ్‌గౌడ్ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కల్లుగీత కార్మిక ఉద్యమ అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సంఘం నిర్వహించిన ఉద్యమాల ఆల్బమ్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు సెమినార్‌లో ప్రవేశ పెట్టిన 22 డిమాండ్ల పత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సబికులను ఆకట్టుకున్నాయి. 105 మంది సేఫ్టీ కిట్ ట్రైనర్స్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ సంస్థకు నో

పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : భారత్‌లో ఓటీటీలు, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను పర్యవేక్షించి, నియంత్రించే నియంత్రణ సంస్థ అవసరంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)ను భారత సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ పిల్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై చంద్రచూడ్, జస్టిస్ జె.బి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. "పిల్స్‌తో వచ్చే సమస్య ఇదే. అవన్నీ ఇప్పుడు పాలసీలో ఉన్నాయి. మనం మన నిజమైన పిల్స్‌ను కోల్పోతాం" అని ధర్మాసనం తెలిపింది. థియేటర్లలో చూపించే సినిమాలలా కాకుండా.. ఓటీటీలో విడుదల కావటానికి ముందు కంటెంట్‌కు ఒక సర్టిఫికేషన్ ప్రక్రియ ఉండదు. ఇది ఎలాంటి సరైన హెచ్చరికలు లేని కారణంగా.. స్పష్టమైన దృశ్యాలు, హింస, దూషణ, ఇతర చెడు కలిగించే కంటెంట్‌కు కారణమవుతున్నదని పిల్ వేసిన అడ్వొకేట్ శశాంక్ శేఖర్ వాదించారు. ఓటీటీ వేదికల స్వీయ నియంత్రణ కోసం కేంద్రం ఐటీ నిబంధనలు 2021ని తీసుకొచ్చిన అది చాలటం లేదని వివరించారు. వీటితో పాటు పలు అభ్యంతరాలను ఆయన లేవనెత్తారు. ఓటీటీ, స్ట్రీమింగ్, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో కంటెట్‌పై పర్యవేక్షణ, నియంత్రణ కోసం తగిన బోర్డు, సంస్థ, అసోసియేషన్ ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలంటూ పిటిషన్ కోరింది. భారత్‌లోని వీక్షకుల కోసం వివిధ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే వీడియోలను నియంత్రించటానికి, కంటెంట్లను పర్యవేక్షించి, ఫిల్టర్ చేయటానికి ఒక స్వతంత్ర సంస్థ లేదా బోర్డును ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ పిటిషన్‌లో ఆయన కోరారు. ఈ బోర్డుకు తప్పనిసరిగా ఒక ఐఏఎస్ అధికారి నేతృత్వం వహించాలనీ, ఇందులో మూవీ, సినిమాటోగ్రఫీ, మీడియా, డిఫెన్స్, లీగల్ ఫీల్డ్ ఇలా వివిధ రంగాల నుంచి సభ్యులు ఉండాలని సూచించాడు. అయితే, పిల్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.





సాత్విక్, రచిత మహాలక్ష్మి

నవచిత్రం

తల్లి మనసుకి ప్రతిబింబం

'తల్లి గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రేమ మూర్తిగానే కాదు త్యాగమూర్తిగా కూడా ఆమెకు సాటి రారు మరెవ్వరు. అలాంటి ఓ తల్లి మనసు ఎలాంటి భావోద్వేగాలకు గురైంది. అందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాల సమ్మేళనంతో 'తల్లి మనసు' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.
రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దీని ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. ఇటీవల షూటింగ్ పార్ట్‌తోపాటు డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. మిగతా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ, సింగిల్ షెడ్యూల్లో షూటింగ్ పూర్తి చేశాం. సోషల్ మీడియాలో గురువారం టీజర్ విడుదల చేశాం. అద్భుతమైన స్పందన లభిస్తోంది' అని చెప్పారు.
'మా బ్యానర్‌లో మంచి కథ, కథనాలతో ఓ చిత్రం చేయాలని సంకల్పించి, ఈ చిత్రం చేశాం. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని సమర్పకులు ముత్యాల సుబ్బయ్య అన్నారు.
దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథ ఇది. ఆమె ఎలాంటి సంఘర్షణలకు గురయ్యింది అనే అంశాలతో ఆద్యంతం ప్రేక్షకులను అలరింపజేసేలా తెరకెక్కిస్తున్నాం' అని తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్, సాహిత్య, వైష్ణవి, దేవిప్రసాద్, ఆదర్శ్ బాలకృష్ణ, శాంతకుమార్, గౌతం రాజు, దేవిశ్రీ, జబర్దస్త్ ఫణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మూల కథ: శరవణన్, కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య, మరుధూరి రాజా, మాటలు: నివాస్, పాటలు: భువనచంద్ర, సంగీతం: కోటి, డి.ఓ.పి: ఎస్.సుధాకర్ రెడ్డి, ఎడిటింగ్: నాగిరెడ్డి, ఆర్ట్: వెంకటేశ్వరరావు, సమర్పణ: ముత్యాల సుబ్బయ్య, నిర్మాత: ముత్యాల అనంత కిషోర్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్ (సిప్పీ).

కర్రి బాలాజీ దర్శకత్వంలో డర్టీ లవ్

సమాజంలో పేరుకుపోతున్న 'డర్టీ లవ్' ముసుగులో ప్రైవేట్ రూముల్లో శృంగారంతో, రేవ్ పార్టీల్లో విలాసాలతో, పబ్బుల్లో జల్సాలతో యువత మత్తులో ఎలా తూగుతున్నారో తెలిపే చిత్ర కథతో ఎ2బి ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ 'డర్టీ లవ్ ' చిత్రం రూపొందించనుంది. గతంలో 'అన్ స్టాపబుల్' అనే నాన్ స్టాప్ కామెడీ ఎంటర్టైనర్ తీసిన నిర్మాత రంజిత్ రావు, తన తదుపరి చిత్రాన్ని 'బ్యాక్ డోర్' అనే సందేశాత్మక చిత్రాన్ని తీసిన దర్శకుడు, నంది అవార్డు గ్రహీత కర్రి బాలాజీ దర్శకత్వంలో నిర్మించబోతున్నారు.
ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ మొత్తం పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రానికి కొత్త కథానాయకుడు, నాయికల కోసం అన్వేషిస్తున్నారు. ప్రముఖ నటీ నటులు, సాంకేతిక నిపుణులుతో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలో మొదలవుతుంది.
వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో సినిమాలను తెరకెక్కించే దర్శకుడు కర్రి బాలాజీ దర్శకత్వంలో ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ట్రెండ్‌కి అనుగుణంగా ఉన్న కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని నిర్మాత రంజిత్‌రావు అన్నారు.



కర్రి బాలాజీ

అద్భుతంగా తెల్లారు పొద్దుల్లో..

ఫీల్ గుడ్ లవ్ స్టోరీలకు ప్రేక్షకుల సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. అలాంటి ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో దర్శకుడు పి.ఎల్.విఘ్నేష్ 'ప్రణయగోదారి' చిత్రాన్ని రూపొందించారు. దీన్ని పారమళ్ళ లింగయ్య నిర్మించారు. సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన కంటెంట్ అందరిలోనూ ఆసక్తిని పెంచింది. ఈ చిత్ర గ్లింప్స్, పోస్టర్లు, పాటలు ఆడియెన్స్‌లో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి.
తాజాగా మరో పాటను చిత్రయూనిట్ విడుదల చేసింది. 'తెల్లారుపొద్దుల్లో' అంటూ సాగే ఈ మెలోడియస్, రొమాంటిక్ పాటను కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాటకు మార్కండేయ బాణీ, సాహిత్యం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ధనుంజయ్, అదితి భావరాజు ఆలపించిన ఈ పాట ఎంతో శ్రావ్యంగా ఉంది.
శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ, 'పాట చూశాను. చాలా బాగుంది. దర్శక, నిర్మాత విఘ్నేష్ ఎంతో ప్యాషన్‌తో సినిమా తీశాడని అర్థం అవుతోంది. మోహన్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేశారు. అరకులో అందంగా ఈ పాటను చిత్రీకరించారు. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.
సాయికుమార్ కీలక పాత్ర పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం:మార్కండేయ, కెమెరా:ఈదర ప్రసాద్, ఎడిటర్:కొడగంటి వీక్షిత వేణు, ఆర్ట్:విజయకృష్ణ.



ఆటలు

రోహిత్, కోహ్లి, సర్ఫరాజ్ అర్ధసెంచరీలు

- భారత్ 231/3
- న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్

బెంగళూరు: తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన టీమిండియా.. రెండో ఇన్నింగ్స్‌లో సమిష్టిగా రాణించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్ అర్ధసెంచరీలతో కదం తొక్కారు. దీంతో టీమిండియా మూడోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 231పరుగులు చేసింది. న్యూజిలాండ్ కంటే ఇంకా 125పరుగులు వెనుకబడి ఉంది. చిన్నస్వామి స్టేడియంలో రెండో రోజు తమను వణికించిన న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ బౌండరీల వర్షం కురిపించారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించగా తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన సర్ఫరాజ్ ఖాన్(70నాటౌట్), విరాట్ కోహ్లి(70) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ(52) కూడా విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించి కివీస్ బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. సర్ఫరాజ్-విరాట్ కోహ్లి కలిసి మూడో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. నాలుగో రోజు తొలి సెషన్ కీలకం కానుంది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(35) ఉన్నంత సేపు ధనాధన్ ఆడాడు. అయితే.. అజాజ్ పటేల్ ఓవర్లో ఫ్రంట్‌ఫుట్ వచ్చి స్టంపౌట్ అయ్యాడు. 72 వద్ద తొలి వికెట్ పడినా కెప్టెన్ రోహిత్ శర్మ(52) జోరు తగ్గించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో హడెలెత్తించిన మ్యాట్ హెన్రీ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాదేసి హిట్‌మ్యాన్ అర్ధ శతకం సాధించాడు. కానీ, ఆ కాసేపటికే అజాజ్ పటేల్ ఓవర్లో ఊహించని విధంగా అతడు బౌల్డ్ అయ్యాడు. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడినా విరాట్ కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్‌లు ఒత్తిడికి లోనవ్వలేదు. కోహ్లి కాస్త నిదానంగా ఆడితే.. సర్ఫరాజ్ మాత్రం కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 136 పరుగులు జోడించింది. అయితే.. మూడో రోజు గ్లెన్ ఫిలిప్స్ వేసిన ఆఖరి ఓవర్.. చివరి బంతికి కోహ్లి వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. న్యూజిలాండ్ బౌలర్లు అజాజ్ పటేల్‌కు రెండు, ఫిలిప్స్‌కు ఒక వికెట్ దక్కాయి.



9వేల పరుగుల క్లబ్‌లో కోహ్లి

టీమిండియా రన్ మెషీన్, విరాట్ కోహ్లి మరో మైలురాయికి చేరుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 9వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ.. టెస్టుల్లో 31వ అర్ధసెంచరీని 9 వేల పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. విలియం ఓర్కీ బౌలింగ్‌లో మిడాన్ దిశగా సింగిల్ తీసిన కోహ్లి 53 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనతకు చేరువయ్యాడు. దాంతో, ఈ ఫీట్ సాధించిన నాలుగో భారత క్రికెటర్‌గా క్రికెటర్‌గా రికార్డుల్లో కెక్కాడు. సచిన్ టెండూల్కర్(15,921), రాహుల్ ద్రావిడ్(13,265), సునీల్ గవాస్కర్(10,212)లు ఈ మైలురాయిని అధిగమించారు.

రవీంద్ర సెంచరీ

న్యూజిలాండ్ యువకెరటం రచిన్ రవీంద్ర(134) సెంచరీతో కదం తొక్కాడు. ఓవర్ నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 180పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన న్యూజిలాండ్‌ను రవీంద్ర, మాజీ సారథి టిమ్ సౌథీ(65) మెరుపు హాఫ్ సెంచరీతో భారత బౌలర్లను ఆదుకున్నారు. అంతకుముందు ఓపెనర్ డెవాన్ కాన్వే(91) సైతం అర్ధ శతకం బాదగా.. న్యూజిలాండ్ 402 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు మూడేసి, సిరాజ్‌కు రెండు, బుమ్రా, అశ్విన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఇండియా తొలి ఇన్నింగ్స్ : 46ఆలౌట్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్‌బి) కుల్దీప్ 15, కాన్వే (బి)అశ్విన్ 91, యంగ్ (సి)కుల్దీప్ (బి)జడేజా 33, రవీంద్ర (సి) ధృవ్ జురెల్ (బి)కుల్దీప్ 134, మిఛెల్ (సి)జైస్వాల్ (బి)సిరాజ్ 18, బ్లండెల్ (సి)రాహుల్ (బి) బుమ్రా 5, ఫిలిప్స్ (బి)జడేజా 14, హెన్రీ (బి) జడేజా 8, సోథీ (సి)జడేజా (బి)సిరాజ్ 65, అజాజ్ పటేల్ (ఎల్‌బి)కుల్దీప్ 4, రూర్కే (నాటౌట్) 0, అదనం 15. (91.3ఓవర్లలో ఆలౌట్) 402పరుగులు.

వికెట్ల పతనం: 1/67, 2/142, 3/154, 4/193, 5/204, 6/223, 7/233, 8/370, 9/384, 10/402

బౌలింగ్: బుమ్రా 19-7-41-1, సిరాజ్ 18-2-83-2, అశ్విన్ 16-1-94-1, కుల్దీప్ 18.3-1-99-3, జడేజా 20-1-72-3.

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్) బ్లండెల్ (బి) అజాజ్ పటేల్ 35, రోహిత్ శర్మ (బి) అజాజ్ పటేల్ 52, కోహ్లి (సి)బ్లండెల్ (బి)ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ ఖాన్ (బ్యాటింగ్) 70, అదనం 4. (49ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 231పరుగులు.

వికెట్ల పతనం: 1/72, 2/95, 3/231

బౌలింగ్: సౌథీ 7-1-22-0, హెన్రీ 11-1-52-0, రూర్కే 11-1-48-0, అజాజ్ పటేల్ 12-2-70-2, ఫిలిప్స్ 8-1-36-1.

తెలుగు టైటాన్స్ శుభారంభం

- సూపర్ టెన్ తో అదరగొట్టిన పవన్
- ప్రొ కబడ్డీ లీగ్ 2024

హైదరాబాద్ : సొంత అభిమానుల సమక్షంలో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌ను ఘన విజయంతో ఆరంభించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ (13 పాయింట్లు) రైడింగ్‌లో సూపర్ టెన్, డిఫెండర్ క్రిషన్ ధుల్ (6) హైఫైవ్ సాధించడంతో శుక్రవారం జీఎంసీ బాలయోగి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో 37- 29తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. జట్టును ముందుండి నడిపించిన పవన్ సెహ్రావత్ ప్రొ కబడ్డీ లీగ్‌లో 1200 రైడ్ పాయింట్ల మైలురాయి చేరుకున్నాడు. బెంగళూరు జట్టులో డిఫెండర్ సురీందర్ దహల్ ఐదు, రైడర్ జతిన్ నాలుగు పాయింట్లతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. స్టార్ రైడర్ కెప్టెన్ పర్దీప్ నర్వాల్ (3) నిరాశ పరిచాడు. ఈ మ్యాచ్ లో టైటాన్స్ ప్రత్యర్థిని రెండుసార్లు ఆలౌట్ చేయగా.. బుల్స్ ఒకసారి ఆలౌట్ చేసింది. కాగా, టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి బాలీవుడ్ నటులు కార్తీక్ ఆర్యన్, విద్యా బాలన్ హాజరై సందడి చేశారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పోస్టాఫీస్‌లో
రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

బెంగళూరు : బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరులోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్ వద్ద నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ కస్టమ్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో దాదాపు 606 డ్రగ్స్ పార్శిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిని అమెరికా, బెల్జియం, యుకె, థాయ్‌లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌లో హైడ్రో గంజాయి, ఎల్ఎస్‌డి, ఎండిఎంఎ క్రిస్టల్స్ తదితర మత్తు పదార్థాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. వీటిని బెంగళూరులో అధిక ధరలకు విక్రయించేందుకు నిందితులు ఇండియన్ పోస్టల్ సర్వీస్ ద్వారా దిగుమతి చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు.

ఫైనాన్షియర్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫైనాన్సియర్ వేధింపులు తాళలేక చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 6వ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుజూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని నెహ్రూ నగర్‌కు చెందిన షేక్ ఖయ్యూం (48) మూడు సంవత్సరాల క్రితం ఓ ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై మార్టిగేజ్ లోన్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన పక్షవాతంతో అనారోగ్యానికి గురయ్యాడు. మూడు నెలలుగా ఫైనాన్స్ కట్టకపోవడం తో ఫైనాన్స్ కంపెనీ వారు ఇంటికి వచ్చి ఇంటిని జప్తు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడినట్టు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఖయ్యూం ఈ నెల 16న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా అశోక్‌సాగర్ గట్టుపై అతని చెప్పులు, చొక్కా కనిపించడంతో చెరువులో గాలించగా గురువారం మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పిడుగుపాటుకు 40 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-నేరేడుచర్ల



పిడుగు పడి 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బోడల్ దిన్న గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపూల లింగయ్య, యాలకాని ఆంజనేయులుకు చెందిన గొర్రెల మందను పొలాల్లో మేతకు తోలుకెళ్లారు. అకస్మాతుగా వర్షం రావడంతో గొర్రెల మంద చెట్టు కిందికి వెళ్లింది. ఆ సమయంలో మందపై పిడుగు పడటంతో 40 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని, తాము నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

దుబాయిలో క్యాన్సర్ ఇండియాలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- గల్ఫ్ మృతునిగా పరిగణించి
- ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సోదరుని వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దుబాయిలో క్యాన్సర్ వ్యాధి బారినపడి ఇండియాలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఎరవేణి విజయ్‌ను 'గల్ఫ్ మృతుడు'గా పరిగణించి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అతని సోదరుడు అజయ్ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' లో వినతిపత్రం సమర్పించారు. అతని వెంట టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బి.ఎం.వినోద్ కుమార్, కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ఉన్నారు. మృతుని సోదరుని వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా పెద్ద కల్వల గ్రామస్తుడు, గీత కార్మిక కుటుంబానికి చెందిన విజయ్ (27) బతుకు దెరువు కోసం మార్చిలో దుబాయికి వెళ్లాడు. మే నెలలో క్యాన్సర్ బారిన పడ్డారు. మెరుగైన చికిత్స కోసం జూలై 24న ఇండియాకు తిరిగి వచ్చాడు. చికిత్స పొందుతూ ఆగస్టు 17న మృతిచెందాడు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ క్రిష్ణ చొరవ తీసుకొని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజయ్ సోదరుడు అజయ్ విజ్ఞప్తి చేశారు. దుబాయికి వెళ్ళడానికి చేసిన అప్పు, క్యాన్సర్ చికిత్సకు చేసిన అప్పు తీర్చలేని పరిస్థితి ఉన్నదని ఆయన వాపోయారు. మృతుడికి తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి ఉన్నారు.

ప్రజావాణిలో సమస్యలకు తక్షణ పరిష్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజావాణికి సమస్యలతో వస్తున్న పలువురికి ఊరట లభిస్తున్నది. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు నుంచి 627 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య అర్జీలను స్వీకరించారు. పలువురి సమస్యలను ఓపికగా విన్న చిన్నారెడ్డి ఆ సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ దరఖాస్తులపై ఎండార్స్ చేసి తక్షణ పరిష్కారం కోసం కృషి చేశారు. దరఖాస్తుల్లో 185 ఇండ్ల కోసం, సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 108, రెవెన్యూ శాఖకు 60, విద్యుత్ శాఖ 57, ప్రవాసి ఎన్.ఆర్.ఐ. విభాగానికి సంబంధించి 4, ఇతర శాఖలకు చెందిన 213 దరఖాస్తులున్నాయి. వీటన్నింటినీ ఆన్‌లైన్ ద్వారా సీఎం ప్రజావాణి పోర్టల్ నుంచి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. వివిధ శాఖలకు చెందిన నోడల్ అధికారులు చిన్నారెడ్డి, దివ్యలకు సహకారాన్ని అందించారు.

భూమి పట్టాదారు పాస్‌బుక్ వచ్చింది

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం వల్ల మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్ కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామానికి చెందిన కుటుంబానికి మూడు నెలల కాలంలోనే భూమి పట్టాదారు పాసు పుస్తకం అందింది. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఏదులాబాద్ గ్రామానికి చెందిన వేణుగోపాలచారి, రుక్మిణీ దంపతులు వచ్చి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ధరణి తప్పిదాల వల్ల 2021 నుంచి 16 గుంటల విలువైన భూమికి సంబంధించి అధికారులు తమకు పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నారని రుక్మిణీ తెలిపారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నామనీ, ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య చూపిన చొరవతో పట్టాదారు పాసు పుస్తకం అందిందని ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రజావాణి అధికారులకు రుక్మిణీ ధన్యవాదాలు తెలిపారు. సమస్యల పరిష్కార కేంద్రం ప్రజావాణి అని, ఇక్కడ సమస్యలు చెప్పుకుంటే పరిష్కారం దొరుకుతుందని దరఖాస్తుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోరు ఆగదు

తేల్చి చెప్పిన హమాస్ డిప్యూటీ చీఫ్ ఖలీల్

బందీలను విడిచిపెట్టిన మరుక్షణం యుద్ధం ముగింపు : నెతన్యాహు వ్యాఖ్యలు


(ఫైల్)

గాజా, బీరుట్ : దక్షిణ గాజాలోని రఫా నగరంలో సైనిక బలగాల ఆపరేషన్‌లో హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ సాయుధ బలగాలు (ఐడిఎఫ్) ప్రకటించాయి. ఇజ్రాయిల్ జైల్లో వున్నప్పుడు తీసుకున్న డిఎన్ఎ నమూనాలతో సరిపోల్చి మరీ ఈ మృతి వార్తను నిర్ధారించుకున్నాయి. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై జరిపిన దాడికి ప్రధాన సూత్రధారి సిన్వర్ అని ఇజ్రాయిల్ భావిస్తోంది. మొత్తంగా హమాస్‌ను నిర్మూలించడమే గాజా ఆపరేషన్ అంతిమ లక్ష్యమని చెబుతూ వస్తున్న ఇజ్రాయిల్‌కు సిన్వర్ మృతి కీలకమైన పరిణామమే. సిన్వర్ మృతి చివరి క్షణాలకు సంబంధించి డ్రోన్ తీసిన ఫుటేజీని ఐడిఎఫ్ పంచుకుంది. సాధారణ అపరేషన్‌గా భావించిన ఈ దాడిలో ముగ్గురు మరణించారు. వారిలో ఒకరు కీలకమైన నేత సిన్వర్‌గా తర్వాత సైనికులు గుర్తించారు.

సిన్వర్ మృతిని ధృవీకరించిన హమాస్

హమాస్ కూడా సిన్వర్ మృతి వార్తను శుక్రవారం ధృవీకరించింది. హమాస్ డిప్యూటీ చీఫ్ ఖలీల్ హయ్యా ఈ పరిణామాలపై ఒక ప్రకటన చేశారు. గాజాపై దాడులను ఆపి, బలగాలను మొత్తంగా ఉపసంహరించుకునేంతవరకు బందీలను విడిచిపెట్టేది లేదని టివి ప్రసంగంలో స్పష్టం చేశారు. పాలస్తీనా విముక్తి జరిగేవరకు ఈ పోరు ఆగేది లేదని తేల్చి చెప్పారు. పాలస్తీనా విముక్తి పొంది, చట్టబద్ధమైన తమ హక్కులన్నింటినీ తిరిగి పొందిన నాడు ఈ పోరాటం ఆగుతుందని చెప్పారు. నేల కూలిన అమరవీరుడు యాహ్యా సిన్వర్ జ్ఞాపికే హమాస్ అని వ్యాఖ్యానించారు. సిన్వర్‌ను 'ధృఢమైన, ధైర్య సాహసాలు కలిగిన, నిర్భయుడు' అని అభివర్ణించారు. పాలస్తీనియన్ల విముక్తి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి అని కొనియాడారు. తన జీవితపు చివరి క్షణం వరకు పోరు బాటలోనే వున్న ధీరుడని వ్యాఖ్యానించారు. తొలినాళ్ల నుండి మహత్తరమైన రీతిలో ప్రతిఘటనను చేపట్టిన సిన్వర్ తాననుకున్న జీవితాశయం కోసం నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు.

> **ఇది ఆరంభం మాత్రమే**
> ఏడాది కాలంగా సాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ఇది ఆరంభం మాత్రమేనని సిన్వర్ మృతిపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. బందీలను అప్పగించిన మరుక్షణం ఈ యుద్ధానికి ముగింపు పలుకుతామని స్పష్టం చేశారు.

అసలీ సిన్వర్ ఎవరు ?

దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ శరణార్థ శిబిరంలో 1962లో సిన్వర్ జన్మించారు. అప్పటికి ఈ ప్రాంతమంతా ఈజిప్ట్ నియంత్రణలో వుండేది. 1948లో ఇజ్రాయిల్ ఆవిర్భావం సందరభంగా అరబ్బు జాతి ప్రక్షాళన పెద్ద ఎత్తున జరిగిన పాలస్తీనియన్ నక్బా (విపత్తు) సమయంలో యూదు శక్తులు సిన్వర తల్లిదండ్రులను బహిష్కరించారు. 1980ల నుండి చురుకుగా పనిచేసే సిన్వర్ గాజాలో ఇస్లామిక్ వర్సిటీ విద్యార్థిగా వున్నప్పుడు ఇజ్రాయిల్ ఆక్రమణలకు వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టినందుకు అరెస్టయ్యాడు.

22ఏండ్ల పాటు ఇజ్రాయిల్ జైళ్ళలో

హమాస్ అంతర్గత భద్రతా విభాగం అల్ మజిద్‌ను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదే. ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్, భద్రతా సర్వీసు అధికారులను గుర్తించడం, వారిని మట్టుబెట్టడం వంటి పనులన్నీ చక్కబెట్టడం ఈ విభాగం బాధ్యత. హమాస్ మిలటరీ విభాగం అల్ ఖసమ్ బ్రిగేడ్‌లను ఏర్పాటు చేసింది కూడా సిన్వరే. ఇజ్రాయిల్‌తో కుమ్మక్కైన 12మంది పాలస్తీనియన్లను హతమార్చినందుకు, ఇజ్రాయిల్ సైనికులిద్దరిని కిడ్నాప్ చేసి, హత్య చేసినందుకు 1988లో సిన్వర్‌ను ఇజ్రాయిల్ అరెస్టు చేసింది. ఇజ్రాయిల్‌లోని వివిధ జైళ్లల్లో 22ఏళ్ళ పాటు గడిపి చివరగా పెద్ద ఎత్తున ఖైదీల మార్పిడి ఒప్పందం కింద 2011లో విడుదలయ్యారు. తిరిగి హమాస్‌లో చేరి కిందిస్థాయి నుండి ఎదుగుతూ వచ్చి 2017లో హమాస్ నేత ఇస్మాయిల్ హనియెకు వారసుడిగా బాధ్యతలు చేపట్టారు. ఇరాన్‌లో హనియెను హతమార్చిన నేపథ్యంలో ఈ ఆగస్టులో హమాస్ పొలిట్‌బ్యూరో చీఫ్‌గా ఎన్నికయ్యారు.

అక్టోబరు 7నాటి దాడి వెనుక ...

గతేడాది అక్టోబరు 7నాటి దాడికి పథక రూపకల్పన 2022 డిసెంబరులోనే జరిగిందని భావిస్తున్నారు. గాజాలో జరిగిన ర్యాలీలో సిన్వర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై అంతులేనన్ని రాకెట్లు ప్రయోగిస్తామని, సైనికుల వరద పారుతుందని వ్యాఖ్యానించారు. అనూహ్యమైన రీతిలో అక్టోబరు 7న జరిగిన దాడిలో 1200మంది చనిపోగా, 150మందికి పైగా ఇజ్రాయిలీలను బందీలుగా పట్టుకున్నారు. గాజాలో నరమేధానికి ఈ దాడి హేతువైంది. సిన్వర్, ఇతర హమాస్ నేతలపై గత నెల్లో అమెరికా కొన్ని అభియోగాలు మోపింది. అమెరికన్ పౌరులను హతమార్చేందుకు పన్నిన కుట్రలకు నిధులు అందిస్తూ, దశాబ్దాలుగా సాగిన ఆ ప్రచారాలను పర్యవేక్షించారని, అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించారని పేర్కొంది. తాజాగా సిన్వర్ హత్యతో హమాస్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లైంది. అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితికి దారి తీసింది.

రాష్ట్ర ఆదాయం, అప్పులపై చర్చకు సిద్ధమే


- సీఎం స్థాయిని దిగజార్చేలా రేవంత్ వ్యాఖ్యలు : మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



అప్పులపై చర్చకు తాము సిద్ధమేనని, 2014 బడ్జెట్, ఇప్పటి బడ్జెట్‌ను చూస్తే రాష్ట్రంలో ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆదాయం పెంచింది కేసీఆర్ మాత్రమేనని, తాము కూడబెట్టిన ఆదాయాన్ని నిలబెడితే చాలని అన్నారు. 420 హామీలొద్దని.. కనీసం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలైనా కొనసాగిస్తే చాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు. మూసీ సుందరీకరణపై సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని విమర్శించారు. రేవంత్ వ్యక్తిగా పరువు పోగొట్టుకుంటే పర్వాలేదు కానీ తెలంగాణ సీఎంగా పరువు పోతే ఎవరికి నష్టం అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిదని హితవు పలికారు. మంత్రుల జేబులో నుంచి అప్పులు కడుతున్నట్టు అతి తెలివిగా మాట్లాడుతున్నారని చెప్పారు. మూసీ కూల్చివేతల తరవాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం.. సెక్యూరిటీ లేకుండా మూసీ ప్రాంతంలో తిరగాలన్నారు. అశోక్‌నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్‌కి అధికారం వచ్చిందని, ఇప్పుడు అశోక్‌నగర్ పేరు వింటే ఆయనకు భయమేస్తోందని అన్నారు. అశోక్‌నగర్‌లో పోలీస్ నిర్బంధం దేనికని ప్రశ్నించారు. యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్‌నగర్‌లే అవుతాయని హెచ్చరించారు. నిర్బంధం పెట్టే బదులు అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. సీఎం ఏకపక్షంగా వెళ్తునట్టు కాంగ్రెస్ సీనియర్లే అంటున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రజల నుంచి దూరమవుతున్న రేవంత్ దూకుడు తగ్గించుకోకపోతే పార్టీకి కూడా దూరమవుతారని అన్నారు.

ఆప్‌నేత సత్యేంద్రకు బెయిల్



న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో మాజీ మంత్రి, ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు ఢిల్లీ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణలో జాప్యాన్ని, సుదీర్ఘకాలం ఆయన జైల్లో మగ్గాల్సి రావడాన్ని ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. జైన్‌కు సంబంధించిన నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై 2022 మే 30న ఇడి ఆయనను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో వున్నారు. నిందితుడు, ఇడిల నుండి అందిన పిటిషన్లపై ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ప్రత్యేక న్యాయమూర్తి రాకేష్ స్యాల్ తన తీర్పును రిజర్వ్ చేసుకున్నారు. జైన్‌ను ఇంకా కస్టడీలో కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని జైన్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. విచారణలో జాప్యం, 18 మాసాల సుదీర్ఘ కారాగారవాసం, విచారణ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుందన్న వాస్తవం ఇవన్నీ చూస్తుంటే నిందితుడికి బెయిల్ ఇవ్వడం ద్వారా ఉపశమనం కలిగించాలని భావించాల్సి వస్తోందని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వ్యాఖ్యానించారు. రూ.50 వేల బెయిల్ బాండ్, అంతే మొత్తానికి రెండు పూచీకత్తులతో న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.కాగా ఇడి, జైన్ పిటిషన్‌ను తిరస్కరించింది. జైన్‌ను విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం వుందని, లేదా పారిపోతారని హెచ్చరించింది. జైన్‌కు బెయిల్ లభించిన వెంటనే 'సత్యమేవ జయతే' అంటూ ఆప్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఢిల్లీలో ఆరోగ్య రంగ విప్లవం తీసుకువచ్చిన జైన్‌కు బెయిల్ ఇవ్వడంతో బిజెపి పన్నిన మరో కుట్ర విఫలమైందని వ్యాఖ్యానించింది.

కేటీఆర్‌ను కలిసిన ఒమన్ అంబాసిడర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును నందినగర్‌లోని ఆయన నివాసంలో భారత్‌లోని ఒమన్ దేశ అంబాసిడర్ ఇస్సా అల్ షిబానీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఒకరినొకరు సన్మానించుకొని, జ్ఞాపికలు అందచేసుకున్నారు.

సింగరేణిలో 272 మంది ఉద్యోగుల ఎంపిక జాబితా విడుదల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో 272 మంది ఉద్యోగుల ఎంపిక జాబితాను శుక్రవారం ప్రకటించారు. పది విభాగాల్లో 272 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీకి ఈ ఏడాది జులై 20, 21తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక జాబితాను scclmines.com వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఓ ప్రకటనలో తెలిపారు.

వడ్డీ రేట్ల తగ్గింపు ప్రమాదకరం

- ఈ దశలో కోత పెట్టలేం
- అధిక ద్రవ్యోల్బణమే కారణం: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ : ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దేశంలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 5.5 శాతంగా ఉందని.. తదుపరి మరింత పెరగొచ్చని అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బర్గ్ ఇండియా క్రెడిట్ ఫోరమ్‌లో శక్తికాంత మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్నప్పుడు వడ్డీ రేట్లను తగ్గించడం ప్రమాదమవుతుందన్నారు. ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతం వద్ద స్థిరంగా ఉంటుందనే విశ్వాసం నెలకొన్నప్పుడే వడ్డీ రేట్ల తగ్గింపునపై ఆర్‌బీఐ ఆలోచిస్తుందన్నారు. రేట్ల తగ్గింపును తాము ముందుగా ఊహించడం లేదన్నారు. ద్రవ్యోల్బణ గణంకాల కోసం వేచి చూడాల్సిందేనన్నారు. వచ్చే ఆరు నెలలు లేదా ఏడాదిలో ద్రవ్యోల్బణం ఎలా ఉంటుందో చూడాలని.. దాని ఆధారంగా తాము చర్య తీసుకుంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్ల తగ్గింపునపై ముందుగా మాట్లాడటమంటే తెలివి తక్కువ పనే అవుతుందన్నారు. ఇతర దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నప్పటికీ.. తాము ఆ పని చేయలేమన్నారు. "మేము ఇతర దేశాల వ్యవస్థాగత బ్యాంకులు ఏమి చేస్తున్నాయో చూస్తున్నాం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ప్రపంచంలోని దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ప్రధానంగా దేశీయ ద్రవ్యోల్బణం, వృద్ధి, స్థూల ఆర్థిక పరిస్థితిపై మా నిర్ణయాలు ఆధారపడి ఉంటాయి" అని శక్తికాంత తెలిపారు. గడిచిన సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం సూచీ 5.49 శాతానికి ఎగిసింది. అహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే డిసెంబర్‌లోని ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలోనూ వడ్డీ రేట్లు దిగి రాకపోవచ్చని తెలుస్తోంది.

రూపాయి 11 శాతం క్షీణత

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గుతోందని శక్తికాంత దాస్ అన్నారు. అవకాశం ఉన్నప్పుడల్లా తాము డాలర్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. మార్కెట్లో డాలర్ కొరత ఉన్నప్పుడు తాము ఆ కరెన్సీని మార్కెట్లోకి విడుదల చేయడం ద్వారా రూపాయి విలువను స్థిరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. "జనవరి 2022 నుంచి ఇప్పటి వరకు డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 11.5 శాతం క్షీణించింది. ఈ కాలంలో డాలర్ సుమారు 8-8.5 శాతం పెరిగింది. దీంతో రూపాయి విలువ తగ్గింది." అని దాస్ తెలిపారు. విదేశీ మారకం నిల్వల పెంపుదలపై దృష్టి పెడుతున్నామని దాస్ తెలిపారు. నేటి ప్రపంచంలో ప్రతీ దేశం తన స్వంత భద్రతా వలయాన్ని నిర్మించుకోవాలని తాము భావిస్తున్నామన్నారు. ఆ నేపథ్యంలో మార్కెట్ అవకాశం ఇచ్చినప్పుడల్లా ఆర్‌బీఐ మారకం నిల్వలను పెంచుకుంటుందన్నారు.

తగ్గిన విదేశీ మారకం నిల్వలు..

వరుసగా రెండో వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వల్లో తగ్గుదల చోటుచేసుకుంది. ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించిన గణంకాల ప్రకారం.. అక్టోబర్ 11తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు ఏకంగా 10.74 బిలియన్ డాలర్లు తరిగిపోయి 690.43 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం వారం లోనూ 3.709 బిలియన్ డాలర్లు తగ్గాయి. సెప్టెంబర్ ముగింపు నాటికి రికార్డ్ స్థాయిలో 704.885 బిలియన్లుగా ఉన్నాయి.

బిజినెస్

చైనా జీడీపీ 4.6 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో చైనా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 4.6 శాతం పెరిగింది. ఆర్థిక నిపుణులు అంచనా వేసిన దాని కంటే మెరుగైన ప్రగతిని కనబర్చింది. తొలి తొమ్మిది మాసాల్లో 4.8 శాతం వృద్ధిని సాధించింది. కాగా.. వార్షిక లక్ష్యం 5 శాతంతో పోల్చితే అతి స్వల్పంగా తగ్గింది. సెప్టెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి పెరిగి.. నాలుగు మాసాల గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యిందని ఆ దేశ నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ తెలిపింది.

కరూర్ వైశ్యా బ్యాంక్‌కు రూ.473 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 25.1 శాతం వృద్ధితో రూ.473.60 కోట్ల నికర లాభాలు సాధించినట్టు కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.378.45 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.2,336 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.2,856 కోట్లకు చేరింది. నిర్వహణ వ్యయాలు రూ.715.72 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.73 శాతం నుంచి 1.10 శాతానికి తగ్గినట్టు తెలిపింది.

మద్రాస్ కోర్టులో టఫేకు ఉపశమనం

చెన్నయ్ : ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఈక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే)కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. అమెరికా ఆధారిత ఏజీసీఓకు చెందిన మాస్సే ఫెర్గూసన్ బ్రాండ్‌కు చెందిన ఇండియా విభాగం యాజమాన్య దావాలో శుక్రవారం న్యాయస్థానంలో విచారణ జరిగింది. కాగా.. మాస్సే ఫెర్గూసన్‌కు వ్యతిరేకంగా వేసిన దావాలో తమకు అనుకూలంగా ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చిందని టఫే వెల్లడించింది. భారత్‌లోని మాస్సే ఫెర్గూసన్ బ్రాండ్ ట్రేడ్‌మార్క్‌లకు టఫే సరైన యజమాని అని పేర్కొంది.

కొటాక్ మహీంద్రా చేతికి స్టాండర్డ్ చార్టర్డ్
పర్సనల్ లోన్ బుక్

న్యూఢిల్లీ : స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ తన భారత వ్యాపారంలోని వ్యక్తిగత రుణాల విభాగాన్ని కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు అప్పగించింది. దీంతో స్టాండర్డ్ చార్టర్డ్ తన సంపద, పెట్టుబడుల బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తోంది. 2024 సెప్టెంబర్ 30 నాటికి ఆ బ్యాంక్ పర్సనల్ లోన్ బుక్ విలువ రూ.4,100 కోట్లుగా ఉంది. ఈ రంగంలో విపరీతమైన పోటీ ఉండటంతో పాటు అధిక రిస్కు నేపథ్యంలో ఈ విభాగాన్ని వదిలించుకుంటుందని సమాచారం.

ఎంఎస్ఎంఈ కార్యకలాపాలను విస్తరిస్తాం

- తెలుగు రాష్ట్రాల్లో గృహ రుణాలు ప్రారంభిస్తాం : గోద్రేజ్ క్యాపిటల్ సీఈఓ మనీష్ షా వెల్లడి

నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

వచ్చే రెండు, మూడేండ్లలో తెలుగు రాష్ట్రాల్లో గృహ రుణాల విభాగాన్ని ప్రారంభిస్తామని గోద్రేజ్ క్యాపిటల్ ఎండీ, సీఈఓ మనీష్ షా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో నాలుగు నగరాల్లో ఈ సేవలను అందిస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈ రుణాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలను మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ రాష్ట్రాల్లో రూ.500 కోట్ల బ్యాలెన్స్ షీట్‌ను నమోదు చేశామన్నారు. ఇందులో అన్‌సెక్యూర్డ్ రుణాలు 60 శాతం, సెక్యూర్డ్ రుణాలు 40 శాతం చొప్పున ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.800 కోట్ల ఏయూఎం వ్యాపారాన్ని చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు కార్యాలయాలను కలిగి ఉన్నామని.. మరో రెండు తెరిచే పనిలో ఉన్నామని చెప్పారు.

దేశ వ్యాప్తంగా 40 నగరాల్లోని 180 ప్రాంతాల్లో తమ సంస్థ కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. 4,000 మంది ఛానల్ భాగస్వాము లున్నారన్నారు. గడిచిన మార్చి ముగింపు నాటికి రూ.13,650 కోట్ల ఏయూఎం కలిగి ఉన్నామని.. 2025 మార్చి ముగింపు నాటికి రూ.17వేల కోట్లకు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



ప్రస్తుతం తమ సంస్థలో మొత్తంగా 1,200 మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, తయారీ వంటి రంగాలకు ఇకపై కూడా రుణ ప్రాధాన్యత ఇవ్వడాన్ని కొనసాగిస్తామన్నారు.

ప్రగతికి విజ్ఞానమే కీలకం
ఐసీఎస్ఐ సమావేశంలో గవర్నర్

నవతెలంగాణ - హైదరాబాద్

విజ్ఞానమే ప్రగతికి ప్రధాన శోధకమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సామాజిక బాధ్యతలో కంపెనీల సెక్రెటరీలది కీలకపాత్ర అని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో "ఇండెల్జెన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్" అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల 16వ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సును జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. దివాలా, మధ్యవర్తిత్వం, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్, అనేక ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాల్లో కంపెనీయ సెక్రటరీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. క్యాపిటల్ మార్కెట్స్ లాంటి స్పెషలైజేషన్‌లో కంపెనీ సెక్రటరీలకు శిక్షణ ఇస్తున్నామని ఐసీఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ నరసింహన్ తెలిపారు. దీనికి దక్షిణాదిలోని 200మందికి పైగా కంపెనీ సెక్రెటరీలు, విద్యార్థులు హాజరయ్యారు.

ట్రస్ట్ ఎంఎఫ్ నుంచి స్మాల్ క్యాప్ ఫండ్

ముంబయి : ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ట్రస్ట్ ఎంఎఫ్ స్మాల్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్టు తెలిపింది. ఈ ఎన్ఎఫ్ఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైందని.. అక్టోబర్ 25 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఇందులోని నిధులను నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250లో పెట్టుబడులుగా పెట్టనున్నట్టు పేర్కొంది. కనీస పెట్టుబడిని రూ.1,000గా ప్రకటించింది.